125

మార్చ్ 1982

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

ఎన్‌కౌంటర్

పి. రామకృష్ణారెడ్డి

పచ్చతోరణాలు కట్టిన బ్యానర్‌లైన్ల సంతోషంతో
పాలకుల వాగ్దానాల రికార్డుల శ్రావ్యగానంతో
ప్రగతి ప్రకటన్ల పరిమళాల సత్కారాలతో
కళకళలాడే పెళ్ళిపందిరిలా కళ్ళముందున్న దినపత్రికలో
చిన్న నెత్తుటిబొట్టు చిందినట్టు చిన్నదే ఈ వార్త
ఈ నెత్తుటిసొత్తుకు వారసులు ఎందరో మహానుభావులు!
చెరిపెయ్యాలని చూస్తే చిక్కగామారే నెత్తుటిబొట్టు ఇది!
కాల్చినతర్వాత తుపాకి నిప్పురవ్వ చల్లారిపోయి అబద్ధంలోచస్తుంది
కార్చిన తర్వాత మెత్తటి నెత్తుటిబొట్టు నిప్పురవ్వగామారి నిజమై
బతుకుతుంది
చీకటి మస్తిష్కంనొసట చిచ్చరకన్నై విచ్చుకుంటుంది

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 2

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

125 మాసపత్రిక మార్చి 1982

సంపాదకీయం 1

కథ : పంట - అందుగుల మొండయ్య 5

వ్యాసం : సతీసహగమనం - కె. సంగరి, ఎస్. వైద్ 19

కవిత : జనంమీద విశ్వాసంఉంచు - ఎన్. కె. 27

ఊపిరి 29

నగరం - హెచ్చార్కె 35

జీవనది - "సుమనశ్రీ" 67

సాహిత్యవ్యాసం : మినీకవిత - ఒక పరిశీలన - 'జిజ్ఞాసి' 31

పుస్తక సమీక్ష : స్పార్టకస్ - 'ఎవిస్' 38

డిస్ టెన్స్‌టైమ్ - సురా 54

జాతుల సమస్య : నాగాజాతి సమస్య - ఉదయన్ మిశ్రా 58

కరపత్రం : పాఠకుల నష్టం సంగతి ఆలోచించారా ?

- కాన్షస్ రీడర్స్ సర్కిల్ 65

పుస్తక స్వీకారం 69

కవర్ కవిత - ఆంధ్రజ్యోతి వారపత్రిక సౌజన్యంతో

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు 20 ఈ సంచిక రు 2

వంచనాశ్రిత ఉత్సవాలు

పోతన పంచశతి ఉత్సవాల సంరంభంలో భాగవతతత్త్వం, మధురభక్తివంటి ంశాలు మాత్రమేకాకుండా ప్రభుధిక్కారభావం, వారసత్వం, ప్రజాదృక్పథంవంటి ంశాలుకూడా ప్రస్తావనలోకి వస్తున్నాయి. పోతనను, వేమనను అడ్డుపెట్టుకొని వరిమీద ఎవరు షాడోఫైట్ చేయదల్చుకుంటున్నారో వివేకంవున్నవాళ్ళు గ్రహించ ం కష్టంకాదు. అందులోనూ ప్రజాధనాన్ని కొల్లగొట్టి కొల్లలుగా ఖర్చుచేస్తున్నప్పుడు ందులో "ప్రజా ప్రతినిధులు" అనబడేవాళ్ళు భాగస్వాములయినపుడు ప్రజలకు ాబువారే కావాలిగనుక బట్టతలకూ మోకాటికీ ముడిపెట్టకతప్పదు. మొగిలయ్య ్మరకమందిరం పోతన పంచశతి సంస్మరణ కార్యాలయం కాకతప్పదు. విష్ణుమాయ రించి మాట్లాడడానికివచ్చే ముద్దుల వేదాంతులందరూ రాజ్యాంగయంత్రం అమలు స్తున్న భయంకర హింసా వాస్తవాలచక్రానికి సారథులుగానో, సాంస్కృతిక ప్రతి ధులుగానో వున్నవాళ్ళే. కనుక భుజాలురాచుకోవడం, భుజాలు తడుముకోవడం, ళ్ళనీడలకు వాళ్ళేబెదరడం ఎక్కువగాకనిపిస్తున్నది.

పోతన ప్రభుధిక్కారం చేసాడా? పోతనను మొట్టమొదటి డిసెంట్‌కవి నవచ్చా? చేసాడనడానికి కొ. కు. గారితోసహా ఎందరో సాల్యూట్‌చేసిన రెండు ద్యాలు ఆధారం. ఆ పద్యాలు ప్రక్షిప్తాలుఅనే వాదనవుంది. ఆ పద్యాలు ఆయనవే ని అనుకున్నప్పటికీ పోతన రాజరికవ్యవస్థను వ్యతిరేకించాడనడానికి అవిచాలవు. తనగానీ మరొకరుగానీ ఆరోజుల్లో రాజరికవ్యవస్థనే వ్యతిరేకించి ప్రజలస్వామ్యం రించి ఆలోచించే భౌతికపరిస్థితులు ఆనాడులేవు. అందువల్ల పోతన రాజరికవ్యవస్థను ్యతిరేకించిన డిసెంట్‌కవి అనడం ఎంతచారిత్రిక అజ్ఞానమో, ఆయన ప్రజా స్వామ్యాన్ని కోరుకోలేదని ఆయన భౌతిక, భాగవత వ్యక్తిత్వంమీద కినుకపూనడమూ ంతేఅవివేకం.

ఏదోఒక సందర్భంలో రాజులను, సంపన్నులను, అధికారులను, వాళ్ళ శ్వర్యాలను వాల్మీకి మొదలుకొని నేటిదాకా పాలకవర్గాల సంస్కృతిని బలపరచిన వులు విమర్శించిన, తీవ్రంగా ఖండించిన ఘట్టాలు ఎన్నోవున్నాయి. అదివాళ్ళ ఒకా క మానసికస్థితినో, అనివార్యంగా ప్రతిస్పందించక తప్పని భౌతికవాస్తవాన్నో ్రతిబింబిస్తుందితప్ప, ప్రతిభాశాలురైన కవులపరిశీలనను మనకు పరిచయం చేస్తుంది ప్ప దానినిబట్టి ఆ కవులవిలువలను నిర్ణయించబోతే మనం చరిత్రను, చరిత్రలో త్పత్తిశక్తుల పాత్రను లెక్కలోకి తీసుకోకుండా గంతులువేసినవాళ్ళమవుతాం.

‘పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట’ అని రాజశేఖరుడైన రామభద్రుని పాదాలయందు పరవశమైనవాడు తనభక్తి తన్మయంవల్ల చుట్టూ వున్న ‘మనుజేశ్వరాధముల’ను లెక్కలోకి తీసుకోనివాడవుతాడేమోకానీ మనుష్యుల క్షేమంగురించి ఆలోచించినవాడెట్లాఅవుతాడు. అయితే రాజాస్థానాల్లో వుండకపోవడంవల్ల, సామాన్య గ్రామీణ వ్యవసాయంలోవుంటూ సాహిత్యవ్యవసాయంచేయడంవల్ల మానవనైజాలను వాటి రక్తమాంసాలతో ప్రతిస్పందించే అవకాశంఎక్కువ వుండవచ్చు. అయినా శబ్దాలంకారాలమోజులో, వర్ణనలమోజులో, అలంకారశాస్త్రాల్లో చెప్పినప్రమాణాల్లో భూగోళాన్ని ఇరికించడానికి చేసిన ప్రయత్నంలో పోతన ఎన్ని తప్పటడుగులువేసాడో ఏసాహిత్యవిమర్శకుడైనా చెప్పగలడు. కాళిదాసు, పోతనలకు ఈనాడు భూగోళవిద్యార్థికున్నంత భౌగోళికజ్ఞానం లేదన్నందుకు ఉలికిపడితే మనం గతాన్ని అబద్ధంగా చిత్రించినవాళ్ళం మాత్రమేకాదు వర్తమాన వైజ్ఞానికప్రగతిని అవమానించినవాళ్ళంకూడ అవుతాం. మనతాత తండ్రుల భుజాలమీద నిలబడి మనం ప్రపంచంలోకి భవిష్యత్తులోకి చూస్తున్నామనడం అహంకారమూకాదు, వారసత్వ నిరాకరణాకాదు, గతాన్ని కాలదన్నడమూకాదు, గతంలోని నిలబడదగిన పునాదిమీద నిలబడడమే. స్వీకరించదగిన వారసత్వాన్ని స్వీకరించడమే. మానవజాతి తన కృషి ద్వారా అందించిన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించడమే. ఈ ప్రకటనలకు బెదిరిపోయే వాళ్ళు గతంనుంచి నేర్చుకోబోయి గతానికి తాకట్టుపడ్డవాళ్ళుమాత్రమే.

మరి తెలుగు సమాజంలోగానీ, తెలుగుసాహిత్యంలోగానీ నిరసన, ధిక్కార భావాలులేవా? నిస్సందేహంగావున్నాయి. ఒక్క తెలుగుసమాజంలోనే అనేమిటి-సమాజంలో వర్గాలు ఏర్పడిననాటినుంచీ వర్గవైరుధ్యాలు వున్నాయి. కనుక వర్గపోరాటాలూ వున్నాయి. అవి పునాది ఉత్పత్తిసంబంధాల్లో వున్నపుడు ఉపరితల సంస్కృతిలో ప్రతిఫలించకుండా వుండవు. వాటికోసం ఇవ్వాళ మనం పాలకవర్గాలు భద్రపరచిన లిఖితసంచయంలో వెతికిప్రయోజనంలేదు. ప్రజల పోరాటఒరవడిని, పలుకుబడిని, ఉరవడిని, నుడిని, త్రాణను, వాణిని, బాణిని, నిర్దాక్షిణ్యంగా అణచచూస్తున్న పాలకవర్గాలు వాటిని చారిత్రిక చీకటికోణాల్లోకి బలవంతంగా నెట్టేసాయి. ఐతే ప్రజల ధిక్కార హృదయం ఎంతశక్తివంతమయిందంటే ఆధోరణి అలిఖిత సాహిత్యంలోనే కాదు లిఖితసాహిత్యంలోకూడ కవుల వ్యక్తావ్యక్త ప్రయత్నాలవల్ల చోటుచేసుకోక తప్పదు. లిఖితచరణాలకింద మరుగునబడిన, నలిగిపోయిన అలిఖితభావాలను పిల్ల పాటలను, కాలిబాటలను మనం వెతికిపట్టుకోగలిగితే ఎన్నినిజాలు బయటికొస్తాయో.

తెలుగుసమాజంలోకి వైదికధర్మాన్ని, జ్ఞాన, కర్మమార్గాలను సాహిత్యంద్వారా ప్రవేశపెట్టి సంస్కృతమార్గంలోకి, అంటే ఆనాటిభద్రలోకపు వైదికవర్గం వృత్తంలోకి తెలుగుసాహిత్యాన్ని నన్నయాదులు నడిపించినపుడు మార్గపద్ధతిని, ఉరుతర గద్యపద్యోక్తులను ఈసడించి జానుతెనుగులో దేశిపద్ధతిలో తానునమ్మిన మతాన్ని ప్రచారంచేయడానికి 'వీర' వాదానికిదిగాడు పాల్కురుకి సోమనాథుడు. కవిత్వంద్వారా తనసిద్ధాంతాన్ని ప్రచారం చేసుకోవడానికి 'చాపకూడు' ఏర్పాటుచేసి సభల్లో కావ్యాలు వినిపించాడు. నూతనంగా తేదల్చుకున్న మతప్రచార అవసరమవే పరిమితులు వున్నప్పటికీ రాజసభ, పండితగోష్ఠినుంచి సాహిత్యాన్ని పదిమందిలోకి తెచ్చాడు. ద్విపదలోకి ప్రజల్లోవున్న పదాలనుతెచ్చాడు. తెలుగుసాహిత్యంలో వైదికవిషయానికి, మార్గపద్ధతికి లిఖితసాహిత్యంలోకూడ ఒక ప్రత్యామ్నాయ ధోరణివెలసింది. పాలక ఆలోచనకు భిన్నంగా నిర్దిష్టంగా పాలితఆలోచనకాకున్నా విభిన్నస్వరాలయినా వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా శతకకవుల్లో, అందులో శిఖరాయమానంగా వేమనలోమనకీ ధిక్కారస్వరం వినిపిస్తుంది ఈ నేపథ్యంలో చూసినపుడు పోతన భాగవతుడేకాని బాధితుడుకాడు. వైదికమార్గాన్ని 'పాపులర్' చేయడానికి భాగవతాన్ని ఎంచుకొని జ్ఞాన, కర్మమార్గాలస్థానంలో సులభమనిపించే భక్తిమార్గాన్ని ప్రవేశపెట్టాడు. ముస్లిముల దండయాత్రలతో చెదరిన తెలుగుజాతి స్థైర్యానికి ఒక భావావేశాన్ని ఇవ్వడానికి ఒక జయదేవునివలె, ఒక మీరాబాయివలె, బెంగాల్‌లోని వైష్ణవకవులవలె పోతనభావంలో మధురభక్తిని, భాషలో శబ్దసౌందర్యాన్ని పట్టుకున్నాడు. అందుకే అటు బెంగాలీ వైష్ణవకవుల మధురభక్తి టాగోరుకు ఇటు పోతనభాగవతం భావకవులకు తమ కాల్పనిక సాహిత్యసృజనకు ఎంతగానో ప్రేరణనిచ్చాయి. టాగోర్‌లోని మార్మికవాదానికైనా, కృష్ణశాస్త్రిలోని స్వేచ్ఛాప్రణయానికైనా గోపికాకృష్ణుల ఆధ్యాత్మికమో, ఆధిభౌతికమో, అమలినమో, అనురాగమో- ఆ భావంమాత్రం ఆలంబనమైంది. ఇంక అభివృద్ధికావడానికి వీలులేని ఉత్పత్తిశక్తుల సంబంధాలలో ఇమడలేక, ఆవిర్భవిస్తున్న నూతనవ్యవస్థలోకి అరమరికలు లేకుండా వెళ్ళలేకపోయిన వ్యక్తివాదులందరికీ ఇది చలిపేందిరిఅయింది, వెన్నెలపందిరి అయింది, కంటకావృతమార్గంలో కలలుగన్న గగనకుసుమమైంది.

వారసత్వంలో వున్నదంతా సత్యమేనా? నిత్యమేనా? వారసత్వంలో సత్త్వాన్నే గ్రహిద్దామా నిరసత్వాన్ని గూడా గ్రహిద్దామా? మనలో ప్రవహిస్తున్న మన తలిదండ్రుల రక్తాన్ని గుర్తిద్దామా మన తలిదండ్రుల రక్తం మనలో ప్రవహిస్తున్నది

గనుక వాళ్ళ శవాలను ఖననం చేయకుండా, దహనం చేయకుండా (అవతలపారేయకుండా అనిరాస్తే సెంటిమెంటల్ భావాలుచాల నొచ్చిపోతాయి.) పూజిద్దామా-

ఆలోచకులు వ్యతిరేకించవలసినది పోతన పూజను, పోతన పేరుతో పరాన్నభుక్కులయిన ఈపాలకుల, వీరివందిమాగధుల పొట్టపూజను. పోతన ప్రభుధిక్కార స్వభావం గురించి తాత్త్విక వివేచకహావభావాలతో ప్రగల్భాలు పలుకుతున్న వాళ్ళు కనీసంముప్పై ఏళ్ళుగా ప్రభువులకు అడుగులకు మడుగులొత్తుతున్న వాళ్ళు. పోనీ, పోతన భక్తి పారవశ్యం గురించి మాట్లాడుతున్న వాళ్ళు ఈ పేరుమీద విడుదలయిన నిధులనుంచి అందినంత భుక్తి సాధించుకోవాలనుకునే వాళ్ళు. ఈ పరిచయాలతో, ఈ ఉత్సవాలతో, ఈ నిచ్చెనమీదుగా పదవీవైకుంఠం చేరుకోవాలని తాపత్రయపడేవాళ్ళు పోతన సంగతి అలావుంచి ఇదే పోతన పంచశతికి సమకాలీన వ్యవస్థలోవున్న సందర్భమూ, అన్వయమూ.

వరంగల్
9-3.82

— సంపాదకుడు

రచనలకోసం విజ్ఞప్తి

ఆర్థికఇబ్బందులు, నిర్వహణా సమస్యలతోపాటు సృజన రచనల విషయంలోకూడ తీవ్రమైనకొరతను ఎదుర్కొంటున్నది. కళావిలువలులేని నినాదప్రాయమైన పాటలు, కవితలు, మూసలోపోసిన ఫార్ములాపద్ధతి కథలు, ఇతర భాషల్లోని మంచిరచనలకు (చెడ్డ) అనువాదాలుతప్ప మౌలికమైన ఉత్తేజకరమయిన కనీసం తృప్తికరమైన రచనలు రావడంలేదు. ముఖ్యంగా సమీక్షలు, మౌలికమైన సృజనాత్మక రచనలు కరువయినాయి. ఉత్తమమైన రచనలుపంపించి ప్రజాసాహిత్య ప్రమాణాలు ఉన్నతంగా కాపాడడంలో సృజనకు ఇతోధికంగా సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

— 'సాహితీ మిత్రులు'

పంట

అందుగుల మొండయ్య

తూరుపుదిక్కు ఎర్రిడాలు చిత్రంగా అంతకంతకు బంగారురంగుకు దిరుగుతోంది. ఎర్రిడాలుమీద మచ్చల్లాగా గోరెంకలు కిలకిలమనుకుంటూ ఎగురుతున్నాయి. గోరువంకలకు పైభాగంలో చిలుకలు అదేపనిగా అరుస్తూ ఎటో దూరదేశం ఎగిరిపోతున్నాయి. తూరుపు కొండమీది ఈతచెట్ల ఎండుటాకులమీదుగా గాలి బొయ్యిమని బయలుదేరి జొన్నచేన్లమీదికొచ్చేసరికి నెమ్మదించింది. ఊరువాళ్ళంత చిరుతల రామాయణ మేస్తున్నట్లుగా జొన్నకర్రలు ఊగుతున్నాయి. గువ్వొకటి రెక్కలు టపటపలాడిస్తూ మొగులుకేసి తుపాకీగుండ్లు దూసుకపోయినట్లుగా ఎగిరింది. అంతదాకా తన దగ్గరేఉండి హఠాత్తుగా లేచిపోయిన నేస్తగానివాలకం అర్థంగాక విప్పచెట్టుమీద మరో గువ్వ గుడగుడ గొణుగుతోంది.

అలాంటి సమయంలో కిలిశెట్టి ఎల్లయ్య కండ్లు నులిపొడుసుకుంటూ మంచెలో కూర్చున్నాడు. అతని బూసుకళ్ళల్లో పొద్దుపొడుపు వెలుగు కదలాడుతోంది. చప్పిడి దవడలు కిందకి మీదికి కదులుతున్నాయి. దవడలు అట్లాకదలడంచూస్తే అతను చాలా సేపటినుండి ఏదో మాట్లాడాలనీ ప్రయత్నం చేస్తున్నట్టు కన్పిస్తోంది.... నెత్తికి చుట్టుకున్న పాతగుడ్డపేగు విప్పదీసి మళ్ళీ చుట్టుకున్నాడు. రాత్రెప్పుడో చెక్కుకున్న మొక్కచుట్ట బయటపడ్డది. మంచెకిందికి చూసిండు మంచెకింద నెగట్లో పొగసన్నగా లేస్తోంది. మంచెలోనిలబడి ఒళ్ళిరుసుకొని అర్థంలేని కేకొకటివేసి చుట్టూచూసిండు. మిగతానాలుగు మంచెల మీదోల్లు అదివరకే లేచి ఒడిసెల్లు తిప్పుతూ అరుస్తున్నారు. కడమంచెవాడు ఏదో ఊరుపేరు లేనిపాట కూడా పాడుతున్నాడు. అదేంపాటో వినాలని ఎల్లయ్య కాసేపు చెవులురిక్కించాడు. ఎండిన చొప్పాకులకదలిక, పక్షులఅల్లరి తప్పిస్తే మరింకేది స్పష్టంగా వినిపించలేదు.... గాలి చప్పుడులో అప్పుడప్పుడూ అస్పష్టంగా రాగంమాత్రం విన్పిస్తోంది. చేనుగెట్టుమీద తీగదారుపొదల్లో బొల్లికోడి కురకుర లాడడం స్పష్టంగా విన్పించింది. తను ఒడిశెల గిరగిరతిప్పి అర్పికేకబెట్టిండు. నెత్తిమీద ఎగురుతున్న రామచిలుక కిలకిల లాడింది.

"నీయక్క అందుతె పులుసులేత్తునా ?" ఎల్లయ్య మంచెదిగుతూ అన్నాడు. నెగట్లనిప్పు చిదుగబొడిసి మొక్కచుట్టమీద నిప్పుపెట్టుకొని ఎండు పిఱుకలు నెగట్లో పారేసిండు. చుట్ట దమ్ములాగి ముక్కుల్లో నుండి పొగతీసుకుంట ఊగుతున్న జొన్న కంకులకేసి చూసిండు. పూనకం వచ్చినవానిలాగా లేచి కడుముంత అంత పెద్దగా

తెల్లగా నవనవలాడుతున్న జొన్నకంకిని చెంపలకు రాసుకున్నాడు- ఎందుచేతో బూను కళ్ళల్లో నీళ్లూరినాయి- వంగి మట్టితీసుకొని పిసికిండు.

"ఆగో పడుసుదాని తీర్గ పెకపెక లాడుతున్నవోంట- ఆడవ్‌మరి నీకేమెరుక, నిన్ను దక్కించుకోను మేమెంత పుల్లెందలబడ్డది- కుండలకాడ పడుండె ఆడిదానసొంటి దానివి.... చత్తెరి ఆడోల్లు కుండలకాడ బడుంటరా ? అవ్వ, అక్క, పెండ్లాం, పెల్లె, అదినె, బిడ్డ- అన్నీ నువ్వేకాదు మాకు నీమీద మోకున్న పాప్పరం దొరోల్లకు, సర్కారోల్లకేమెరుక- అట్టిసొపలు గాల్సుకదివే మొకాలకు సొపలసంగతేమెరుక ? కొవంటవా? అహాఁ నాకెరుకలేక అడిగిన...." కాల్లు నిలబొడిసి నేలదిక్కు చూస్తూ మనిషినడిగి నట్లుగా భూమిని అడిగిండు.... జొన్నకర్రిలు "ఔనన్నట్లు" అటూయిటూ ఊగినయ్.

"నాకెరికే నువ్వెట్లకాదంటవ్- నువ్వు నా బంగారెతునుకవుగాదు. ఓపారి నేను గిదేముచ్చెటంటె మామల్లి కోపానికచ్చింది- "నాకంటె ఎక్కువా ? అన్నది. 'కాదా మరి' అనినేనన్న- నువ్వు ఇంటివిగద- దానికేమెరుక అగ్గానెంలున్నది- నువ్వంటెనే గదా నుల్లయినా ఎల్లదైనా బతికేది ? మాఅయ్య సచ్చేటొకానున్నదో ? 'వారీఎల్లా' కన్నతల్లికన్న- కట్టుకున్న పెండ్లానికన్న దునియల మరేదేనికన్నా భూదేవర గొప్పరా ? గ బూదేవరను నమ్మకుంటె బతుకుతొవన్నడు. కట్టంల సుకంల దగ్గరకిదీసేది నువ్వేగదా ? నాకెరికే నువ్వుకాదంటవు- గట్లంటె నాకు కోపమత్తది. ఏమనుకున్నవో అఁ...." అప్పటి దనుక పిసికిన మట్టిని ముక్కుదగ్గర బెట్టుకొని వాసన చూసిండు.

"గిప్పుడు నీదగ్గర నిలుసుండి ఏదివడితె గదిఅదురుతున్న కనితల్లే ! తొట్టదొల్త నువ్వు గిట్లుంటివా ? బట్టల్లేని, తలసవరులేని పెయ్యంత పుండ్లుదినేసిన పోరితీరు గుంటివి. మేమంత పెట్లుగొట్టి పొదలుతవ్వేసి- రాళ్లురప్పలేరేసి- దూసిబొట్టుబెట్టి సక్కని సుక్కనుజేసినంక వాని సెక్రికండ్లనోల్లె ..." తుపుక్కున ఊంచిండు.

"తూఁ వానిపుటుకలమెు.... ఏఘడియలబుట్టిందో ? అనికంల్లె పడనేపడ్తివి అడేమన్న ఏలుకునే మొగోడా ? ఆదేమన్న సాదిసవరచ్చెన జేసినోడా ? నీతీర్గ ఎంద రిని పెరబట్టిండు- అందరూకున్నరుగని- పిల్లో ! మేమేమన్న సాతగానోల్లమా ? మాయింట్లపిల్లను ఆడెత్తుకపోతనంటె ఎట్లూకుంటం. నీయక్క నెత్తురుదొల్లాడుతేంది ? సచ్చిందోనాడు పుట్టిందోనాడు- తెగిచ్చినం. ఎట్లూకుంటంబిడ్డా ! ఎట్లూకుంటం-ఏడ్పు కుంట కోతకబోయె గొడ్డుతీర్గబోతాంటె మామనుసు నీల్లయిపోదా ? అయ్యింది గనుకనె అడ్డందిరిగినం- గిసొంటి అన్నాయెం సూడలేకపిలగండ్లు.... ముద్దుగ మేము

సారులనుకున్నం- గ సార్లు మాఎంటున్నరు- కండబలంమూదైనా ! కత్తెబలం మాదయినా ? గురినేర్పిండ్లు- పిల్లోసూసినవా అనితెలివి- దున్నంగ- దోకంగ- ఇత్తునంబెట్టంగ- కావలిగాయంగ- గియ్యన్నెందుకు సారెడునెత్తుకు పురిషెడువేసు కోంగ సప్పుడుచెయ్యలేదు. తీరా నోటికాడికచ్చినంక గుండగాళ్ళను దీస్కొని నీమీద పడ్డడు పడితేమయ్యింది ? పురెల్లు పురెల్లు బలిగినయ్. వానిచెల్లికండ్లనో తెలైతెడ్డు- గెట్టుమీన సికిలేటుతాక్కుంట నిలుసున్నడు మేం తన్నులాడుకోంగ నాకెపకలేదను కున్నవ నువ్వుసైగజేసినవ్- బస్‌గంతే- చేతికందిన పెళ్ళలందుకొని ఇసిరికొట్టినం. ఇంగుంటెనా ? ధోతి కాళ్ళకడ్డంపడి తట్టుకోంగ ఒకటేఉరుకుడు- పిల్లో గది తలుసు కుంటె గిప్పటికీ పవ్వాగది- ఇంటన్నవా ? ఏదో సక్కొరిల్లినట్లు ఆనిచ్చఆదే ఒరుల్లి కుంటడను కుంటన్నవ- గ పప్పులేం నాదగ్గెర ఉడుకయి ఎరుకయ్యిందా ? గీడెవ్వ డొంటా ? మండసొమ్ములు మంగళారతనే కోమటోడుగాదు- దొంగలెక్కలురాసే పట్వారి బక్కనారిగాడుగాదు- మండిబూములు గుంజుకునే బద్రైబాజి దొరోడుగాదు- భూమిదున్నిబతికే కిలిశెట్టి ఎల్లడు"

ఎల్లయ్యకు దగ్గరలోనే పుట్టగడ్డ గుంపుకర్రలమీద గొరెల్లంకబువాలి అల్లరి చేసుకుంటూ జొన్నకంకులు పొడుమకతింటున్నాయి- తలెత్తిచూసి ఉలిక్కిపడ్డడు.

"ఓరీ నీయవ్వల కుక్కల్దె.... మరిసిపోయి మాపు పెండ్లాన్ని అత్తాని పిలిసి నట్టున్నది ఎవారం.... ముచ్చట సంబురాన దొంగతిండిమరిసి నట్టయ్యింది ఎవారం- లే....లే.... మిమ్ముల గద్దతన్న లే....లే...." చేతులాడస్తూ చేతులో ఉన్నమట్టి విసిరిండు. గొరెల్లంకలు అరుస్తూలేచిపోయినయ్.

పక్కమంచెవాడు కేకేసి "వారీ ! ఎల్లన్న-నీను దొంగల్ బొడువ గాన్నేఉన్నవ్ పిట్టలకు బెట్టినవా ? నీకుపిస్సలేత్తదిగని- మన్నుబిసుకుంట దిరుగుతవుగని" అరిచిండు.

"ఆడిదాకత్తె మంచెకింద ఎత్తేత్త కొడుకా ! నాకారా పిస్సలేసేది- భూదేవరను నమ్మకోవోనికి పిస్సలేత్తదిగని ..." మునికాళ్ళమీదలేచి నిలబడి అరిచిండు నెత్తిమీద ఊగుతున్న జొన్నకంకుల్లోనుండి ఆమాట బయటకు పోనేలేదు.

"వాని కేమెరుక తల్లీ ! కట్టం సుకం- పడుసోపెకుసో అంటున్నడు- తొట్ట దొల్త ఏమంట ఇత్తున మేసినమో ? గప్పుడు షురువయ్యింది పుల్లెందల- కాదంటవా? మూడేండ్లు దొరోన్ని అనిబలగాన్ని తిప్పికొట్టినమి. ఘాఎంటుండి మా గుడిసెల్లపండి అంబలి గడ్కదాగిన సారులు మల్లకనిపియ్యలే....గిది గిప్పటిమాటా ? ఎడబోయిండ్లో

ఆయేడు మల్లపంట బెడ్తిమి. దొరోడు మల్లరానే అచ్చిండు. ఈపారి మాదాంట్ల కప్పదొక్కులోల్లను పేరదీసిండు. ఆనికడుపుల మన్నుబొయ్య ఏంజెప్పిండో? ఏతల్లి రొమ్మునీకి బతికిండో గతల్లి రొమ్మునే అమ్ముకున్నట్టుగ. ఆల్లు ఆనితోనే షరీకైయిరి. పురెల్లు బలిగిన పంట దక్కలేదు. ఇంటి దొంగను ఈసురుడైన పట్టలేడని గందుకనే అన్నరుగావచ్చు. మరోక్కేడు మల్ల తెల్లబట్టలోల్లచ్చిరి. 'మీకేంపర్వలేదు. మీబూమి మీకిప్పిత్తమనిరి. గాంధిపేరో గంగరాయునిపేరో సెప్పిరి. తెల్లకాయిదంమీద దస్కతులు దీస్కపోయిరి.... ఒకల కడుపునొప్పి ఒకలకేంమద్దు. దస్కతులోల్లు పల్ల రాకపోయిరి. ఆట్టిబొక్కలకు కొండిగ్గాడు దెబ్బలు బడ్డట్టు దెబ్బలు దింటిమి. సొప్ప సెలుక్కపాయె. ఉల్టా కేసులుబెట్టైకచ్చీర్ల సుట్టు అగస్న పచ్చులోలె తిరిగి తిరిగి సత్తిమి. ఏటా దున్నేటోడు దోకుడు. ఇత్తునం బెట్టుడు. పిట్టముట్టకుంట. ఏదుగొట్ట కుంట. కాపుగట్టి గద్దలకు బెట్టినట్టు ఫసలంతా ఆనికొమ్ముమన్నె బెట్టుకోవట్టె మీదికెల్లి దెబ్బలాయె. కచ్చీర్లాయె. కర్చులాయె గంటబల్లాయె. పిల్లో ఆళసావదాయె ఎన్ని షల్లెందులబడ్డ! ఎన్నిపారీలు కచ్చీర్లసుట్టు దిరిగినా సువ్వకండ్లల్ల గన్పడ్తివి పసిపోరిని పాల్జీకకుమంటె ఏమయితది. ఏడ్సేడ్సి సత్తది. పసురాన్నిగడ్డి ముట్టకంటె ఒర్రొర్రి సత్తది. మరి జిరాయితిజేసి బతికేటోన్ని నాగలి పాలెబట్టకు. బూమి దున్నకంటెఎట్ల? సర్కారోనోల్లెబ .. సి కొడితె గింత ఇసారం లేకపాయె. వానవ్వల బూకంపూస దెత్తుకపోను. ఓట్లప్పుడు జెండలు బెట్టుకొని సలువబట్టలేసుకొని కండ్లు పులపొడుసు కుంట సాతునాలుజెప్పిరి. అదేంపూట. గాంధెవడో సెప్పిండట. గాంధికేమెరుక బూమి సంగతి? ఎరకలేనోడు ఏదన్న సెప్పుతడు. అదుసెప్పసట్టంటె బూమత్తదన్నరు ఏపుట్టల ఏపామున్నదోనని సూత్తే ఏమున్నది? పుట్టలపాము పరిగిప్పి సరువనేసరిపె ... ఆయింక లాగులోల్లచ్చి అడివిలోల్లకు ఏందో మీదినుంచి దిగచ్చిందని రాసుకపోయిరి. ఎవడచ్చిఏంజేసిందట్లుంచి. ఏడేపిన గొంగడి అన్నేపెదలుబట్టె ..." ఎల్లయ్య ఇట్లా వదురుతూనే పరధ్యానంగానే జొన్నకర్రలు పాపుకొని గెట్టుమీది కొచ్చిండు. దూరంగా జింకలమంద నింపాదిగా నడుస్తూ కనిపించింది.

“అత్తండ్లాబిడ్డా! అయ్యవ్వ దాసబెట్టినట్టు-నీతల్లి....” ఎల్లయ్య జింకలకేసి పరుగెత్తిండు. జింకలు గుబురుపొదల మీదినుండి దుముకుతూ అడివిలో మాయమైనాయి. ఎల్లయ్య ఎగపోస్తూ నిలుచున్నాడు. అతనిముందు చెరువు కాల్వనీళ్లు పారుతున్నాయి. కాలువ నిలివెడులోతున్నది. కాలువలోకిదిగి నీళ్లపుక్కిలించి ఊంచి దోసిలితో నీళ్ళెత్తుకుని తాగి మూతితుడుచుకొని ఒడ్డుమీదికెక్కిండు.

"దొరోడంటె ఏందనుకున్నవ్? సర్కారోడు సెరువుగండిమూపిత్తె గుత్తె దారు మల్లీడె సగండిని సగంబెట్టి గండిమూపిచ్చిండు. కట్టకింది నాతకాని లంజకొడుకుల బూమి పొలమైతె బతికిపోతరు. కడుపుకు రొండుపూటలుదింటె కండ్లు నెత్తికెక్కుతయి.... గయ్యన్ని ఇసారంజేసి నిలిపెడు గాడెంగొట్టి, నాతకానోల్ల కండ్లమీన, కడుపుమీన దుబ్బగొట్టి పెరిపెడునీళ్ళు మైలుదూరంగొంటబోయి కంచెలన్ని పొలాలు జేసుకున్నడు గందుకనే అంటరుగదా! ఉల్లిగడ్డంత దొరోడుంటె ఊరుకుముప్పని-" తుపుక్కున కాలువనీళ్ళల్లోకుంచి వెనుదిరిగిండు- అప్పటికే మంచెలమీదివాళ్ళు ఎల్లయ్యను పిలుస్తూనేఉన్నారు.

ఎల్లయ్య అంతూపొంతూలేకుండా గొనుగుతూ చేనుచుట్టు తిరుగుతూనేఉన్నాడు మిగతా కావలివాళ్ళు ఒడిశెలలు తిప్పుతూ, గొంతు బొంగురుపోయేదాకా అరుస్తూ పిట్టల కొడుతున్నారు. ఇవేమిపట్టనట్టు తెల్లజొన్నకరర్రిలు గాలికి చిందులు తొక్కుతూనే ఉన్నాయి.

o o o o

రాత్రి నిశ్శబ్దంగాఉన్నది.... చెరువులోనీళ్ళు వెన్నెలవెలుగులో తళతళ మెరుస్తున్నాయి. అకాశంలో చుక్కలు పాలిపోయిఉన్నాయి. కట్టమీది ఊడుగుపొదల్లో బండకెక్కెరుగాడు ఉండి ఉండి పలుకుతోంది. కట్టమీది ఊడల మర్రిచెట్టుమీద ఏదో పక్షి పడకకుదరక రెక్కలు తపతపకొట్టుకొంటోంది. చెట్టుకింద చీకట్లో చుట్టలు వెలుగుతున్నాయి- చెట్టుకింద దుమ్ములో చాలామంది పెయికంగిలేనోల్లు కూర్చున్నారు. కిలిశెట్టి ఎల్లయ్య చెట్టుమొదలుకొరిగి నోరుతెరిచి గుర్రుకొడుతున్నాడు.

బక్కగా కంకబొంగులాగున్న యువకుడొకడు వాళ్ళమధ్యలో కూర్చున్నాడు.

"అందరచ్చినట్టేనా ?" యువకుడు.

"ఆఁ.... రావల్సినోల్లంత అచ్చిండ్లుసారు" చెవులమీదికంటా వెంట్రుకలు పెరిగినవాడు ఆవులించి అన్నాడు.

"ఓరినీ- దున్నపోతునిదుర-లేలే...." కిలిశెట్టి ఎల్లయ్యను ఎవడోపట్టిఊపిండు

"ఇంటికాడ సీకట్ల పొల్లగండ్ల పండబెట్టచ్చిన జెప్పనకానియ్యండ్లి" చీకటిలాగా నల్లగాఉన్న ఓ చింపిరితల తల్లి నెత్తి ఆదరబాదర గోక్కుంటూఅంది.

"రేపు సేను కోతబడుదాం.... దొరోడు ఈసారి పోలీసోల్ల ఎంటేసుకత్తడని సమ్మయ్య కబురుదెచ్చిండు- మీరు ఇరువయేండ్లబట్టి మీ సెమట, నెత్తురు- పోసిన కట్టం ఎత్తుకపోంగ సూసుకుంట కూకున్నరు."

"ఎందుకూకున్నం మాపెత్తలు మాడు దెబ్బల మచ్చలున్నయి." ఎల్లయ్య అడ్డుతగిలాడు.

"వసరాదుర ఎల్లన్న కూమ- సారును పురాగ సెప్పనియ్యి" గట్టయ్య.

"నేనేమంటన్న ఉన్నమాటంటన్న."

"నిజమే మీరు పెనుగులాడలేదనిగాదు- అట్టిగనే వానికి పంటప్పజెప్పి సేతులు ముంగటబెట్టుకున్నరనిగాదు- ఫలితమేమయ్యింది?"

"గట్టుకుమోసిన కట్టెలయ్యింది" పిల్లతల్లి.

"గట్ల ఎందుకయ్యింది? అన్నదే మనం ఇసారంజేయాలే- దెబ్బలేగాదు జేల్లకు కూడా పోయినసంగతి నాకు తెలుసుగదా!"

"నేనైతే ఇవ్వారకు పద్నాలుగు పారీల జేలుకుబోయిన- ఓపారైతే జేలుకగ్గిదల్ల నిజామబాదుల- అదఇడిసిపెడితె- ఊరికింత అదుక్కతినుకుంట వడిసచ్చిన...." దుద్దెగాళ్ళ వెంకులు....

"అవ్వన్ని లసుమయ్య జెప్పినట్టు గట్టుకుమోసిన కట్టెలయినయ్. మరింక ఇక ముందు అట్లకావటానికి వీల్లేదు.... వాన్ని వానిబలగాన్ని దెబ్బదీయాలె- మనం కొంత ఆలోచించి ముందుగాల్నే అన్ని అనుకొని సిద్ధంగావాలె- అదే మనం నిర్ణయించుకోవ దానికి ఇవ్వాళ్ళ ఇక్కడ కూడినం.... నిరుడుకొంకోన్ని, దొరతెచ్చిన గుండగాళ్ళను తరిమికొట్టినం- ఇయ్యేడు దొరోడు పోలీసోల్ల తెచ్చుకుంటడు-" ఇట్లాగా ఆయువకుడు చాలా చెప్పుకొచ్చాడు.

నడిఝామను తిరిగిపోయేదాకా పంటకోతగురించి- రానున్నప్రమాదాన్ని ఎదుర్కొవడం గురించి తర్జన భర్జనలుచేసి- చేనుకోయడం గురించి దొరతెచ్చే పోలీసులను ఎదుర్కోవడం గురించి ప్లాను నిర్ణయించుకున్నారు.

గోరుకొయ్యలు పొడిచే సమయానికి ఎటువాళ్ళటు లేచిపోయారు.

* * *

నాలుగు రోజుల నుండి జనం కోతలుకోస్తున్నారు. మెదలు కట్టలుకట్టి గూళ్ళేస్తున్నారు. కోతయిపోయింది. ఇంకా ఒక్కనాటికోత కట్టలుగట్టి గూళ్లేసేదున్నది. ఎసాలేల్లయ్యింది. కోత అయిపోవడంతో జనం మంచెలకాడ చేరిపోయారు.

నాలుగురోజుల నుండి దొర, దొర బలగం రాగలదని జనం దిక్కులుచూసిండ్లు- జాడాపత్తాలేకపోయేసరికి మరింక రాదని నిర్ణయించుకొని తేలికగాగాలి పీల్చుకొని ముచ్చట్లు బెట్టుకుంటున్నారు.

ఎల్లయ్య పొద్దటినుండి పట్టపగ్గాలు లేకుండా ఉన్నాడు.... సీసెడు విప్పసారా హుట్‌గతాగి నక్కోరడిగక్కినట్టు వదురుతూ పెళ్ళపెళ్ళకు గూడుగూడుకు అసులదార మోలె పేనంత కలె దిరుగుతున్నాడు.

"ఎల్లడంటె ఏమనుకున్నరాద్రి! ఊరాధి ఊరుడు ధరినికొమారుడు- పాండువ లోల్ల కతల అర్జెనుడు." మంచెకాడివాళ్ళతో.

"అర్జెనా! నీసోకు బాగనే ఉన్నదిగని. కిట్టమూంతెవ్వరో పెప్పకనేపోతివి-" మెల్లెకన్ను భీమక్క- మెటికలిరిసింది....

"గది తెలువదానే!" తొర్రిపండ్లు బయటపడేటట్టు కిసుక్కునన్వి "ఇంకెవలు అగోగాడ సొప్పకట్టలు గడ్తున్న పునసారు.... ఎరుకయ్యిందా?" అన్నడు.

"మీకెందుకు సారతిప్పలు కసేషమంచెసేడల కూసుందురురాండ్లి" భీమక్క- కేకేసింది....

యువకుడు రానన్నట్టు చెయ్యూపిండు....

"మరి అల్లిరావో" ఒక పసిపోరి గుడ్లుమిటకరిస్తూ ...

"నువ్వేనేపిల్లా!" ఎల్లయ్య.

"వావ్వోనీతొర్రి మొకానికి నేనా!" పిల్ల.

"రతం దెత్తనేపిల్ల ..." ఎల్లయ్య....

అంతలోనే దుమ్ము రేపుకుంటూ జీబురావడం కనిపించింది. జనం బెదిరిపోయారు. కొందరు ఏటూతోచక కాళ్ల మడతపడుతుండగా అటిటుఉరికారు. విప్ప చెట్లమీద- ఊకుచెట్లమీద పక్షులు జీపుచప్పుడుకు అరుస్తూలేచిపోయినయ్ జనం అట్లా గడబిడ పడేటాల్లకు జీపులోనుండి మాధవరావుదొర- ఆరుగురు పోలీసులు దిగారు. మట్టిపెళ్ళలమీద సొలుగుతూ పంటలకాడికినడిచారు.

మాధవరావు చేతులున్న వంకకర్రతోని ఏదో చూపుతున్నడు.

ఎల్లయ్య కండ్లుప్పలపొడిసి మెదలుకడుతున్న వాళ్ళదగ్గరికి ఉరికిండు.

మాటలఅవసరం లేకుండానే పోలీసులు కర్రలెత్తిండ్లు పోలీసుల కాకిబట్టలకు బెదిరి పరుగెత్తుతున్న జనాన్ని అందినవాళ్ళనల్లా కొట్టసాగారు. పిల్లలు మొత్తుకుంటు న్నారు.

అంతా అయిదునిముషాలే- మట్టిపెళ్ళల్లోపడి జనం మొక్కుతూ, దెబ్బలుకాచుకుంటూ మొత్తుకుంటున్నారు. ఆరుగురిలో ఒకడు తుపాకీగురిబెట్టి బెదిరిచ్చిండు.

మాధవరావు వంకరకర్రెత్తి యువకుడికేసి చూపిండు. ఒక పోలీసోడు కర్రి ఎత్తిండు- యువకుడు తప్పుకోకుంటె ఆ కర్రిదెబ్బకు తలపలిగేదే! మిగతావాళ్ళల్లో ముగ్గురు పట్టుకోవడాని ఉరికొస్తున్నారు. తప్పుకున్న యువకుడు పోలీసుకర్రి గుంజుకున్నడు- ఈసారి కర్రి పోలీసుమీదికి తిరిగింది. పోలీసుకు దెబ్బలుకొట్టడంతప్ప తినడంతెలవక బిత్తిరిపోయి మొత్తుకున్నడు- ఇదంతా చూస్తున్న జనానికి హుషారొచ్చింది.

మరోనిముషంలో పోలీసుల కాకిబట్టలు చినిగినయ్. తుపాకిబట్టుకున్న పోలీసోడు మట్టిపెళ్ళల్లోబడి "యాఅల్లా"అని కేకబెట్టిండు- మాధవరావు కాళ్ళకు ధోవతి అడ్డువడుతుండగా కాళ్ళచెప్పులు రాలిపోగా పరుగెత్తిండు.

పడమటిదిక్కు సూర్యుడు మండిపడుతుండగా జీపెల్లిపోయింది.

ఎల్లయ్య మంచెలదాచుకున్న విప్పసారా మిగిలిందితాగిండు.

"తల్లే! సూత్తివా! సూడు- ఎల్లడంటె ఎందనుకున్నవ్- ఇత్తునం బెట్టెటోడె గాదు- దున్నెటోడెగాదు- పంటబెంచెటోడు- దక్కించుకునేటోడు- నువ్వేం ఫికరు పడకు- నేనుండంగ నీకేంబయంలేదు" తూలుతూ మట్టిపెళ్ళను చేతుల్లోనికితీసుకొని కసికొద్ది జీపువెళ్ళిపోయినదిక్కు విసిరిండు.

X X X X

గిలేటు పళ్ళెంలోని గడుకముద్ద నోట్లోపెట్టుకోనుబోతున్న మల్లవ్వకు గూడెంల కొట్టుకొల్లు మొత్తుకోల్లు విన్పించినయ్.... హఠాత్తుగాలేచి గుడిశె బయటకొచ్చింది.

బజారులో నెత్తురు కారుతుండగా ఎల్లయ్య ఎగపోస్తూ చేతులూపుతూ ఏదో చెప్పుతున్నాడు మల్లవ్వ గాబరాగా అటుకేసి పరుగెత్తింది.

"గూళ్ళన్ని సత్తెనాశిడమైపోయినయ్- గూళ్ళకు అగ్గిబెట్టిండ్లు. మనోల్లను మంచెరగల్లకు కట్టేసిండ్లు- ఎంకటిగాడు తొవ్వసూపుతాంటే మనూళ్ళకత్తండ్లు- నేను

అడ్డతొవ్వలబడిఉరికచ్చిన." ఎల్లయ్య అట్లా చెప్పుతుండగానే కడింట్లో బొబ్బలేచింది. ఊరు ఊరంతా ఉరుకులు పరుగులు బెట్టిండ్లు- పశువులు తలుగులు దెంపుకొని గెబ్బెడ గెబ్బెడ పరుగెత్తినయ్....

పోలీసులు దొరికిన వాళ్ళనల్లా తన్నిండ్లు- గుడిసెల్లోకి జొరబడి కుండలు బోక్షలబయటపారేసిండ్లు-

మరో పదినిమిషాలకు ఊరు ఊరంతా ఏడుపులు- పెడబొబ్బలతో నిండి పోయింది.... ప్రతివాని ఒళ్ళు పికిలిపోయింది.

అందరిని కుప్పేసిండ్లు- పీమకండ్ల అమీన్ రూలుకర్రతో పొడుస్తూ "మీ నాయకుడెవడుబే" అన్నాడు.

ఒక్కడుమాట్లాడడు. ఒక్కతిపెదివి విప్పదు.... అమీన్ కండ్లు ఎరుపెక్కి కుక్కలాగా మొరుగుతూ బూటుకాలుతో వరుసబెట్టితన్నిండు....

"చెప్పకుంటే మిమ్ములందర్ని పిట్టలగాల్చినట్టు కాలుస్త...." పిస్టలు తీసిండు.

చప్పుడులేదు- అమీన్‌కు దిగచెమట కారుతోంది....

"మారోసాలోంకో...." అరిచిండు....

పోలీసుల బూట్లు టకటక లాడినయ్.... అలిసిపోయిన అమీనునిలుచున్నాడు. అతనికి దూరంగా పాసుపండ్ల ఎంకడు నాలెచూపులుచూస్తూ. ఎంకన్ని సైగచేసిపిలిచిండు

"దొకిలికే నువ్వయినాచెప్పు...."

"ఇందట్లలేదు బాంచెన్"

"మవ్వు అంతేబంచత్...." తన్నబోయి మానుకున్నాడు. మళ్ళీ నిలుచున్న వాళ్ళ దగ్గరికి నడిచిండు- కర్రతో తలలెత్తి చూసిండు....

అట్లా రాత్రియ్యేదాకా కొట్టినోల్లనేకొట్టిండు- తిట్లకులెక్కలేదు. కొందరిని వ్యాన్లకుతోసిండు.

ఊరంతా దొంగలు దోచినట్టుచేసి వ్యానెల్లిపోయింది....

ఏడవడానికికూడా ధైర్యంరానిజనం రాత్రింతా ఆకలికడుపులతో గుడిసెల్లో బిగుసుకపోయి కూర్చున్నారు.

o o o o

అట్లా మొదలయ్యింది పోలీసులు గూడానికిరావడం- వచ్చిన ప్రతిసారి నానా భీభత్సంచేయడం పరిపాటయిపోయింది. రెండవసారొచ్చినపుడు నాయకుడు దొరక

లేదన్న కోపంతో రెండుగుడిసెలు కాలబెట్టారు. ఊరపతలఉన్న మంచినీళ్ళబావిలో మలవిసర్జన చేసిపోయారు. జనానికి చెరువేదిక్కయింది. కొంతమంది గూడెం ఒడిలి పెట్టి అడివిలోనికి తరలిపోయి గుడిసెలువేసుకున్నారు. సారుతో కలిసితిరిగిన వాడొకడు వాళ్ళతో చేరిపోయాడు- మూడోసారి మరొకడు మాధవరావు గులామైపోయిండు. సారుదొరకలేదు. గాలింపు ఆగిపోలేదు....

o o o o

"కొక్కొరోకో"అని మొదటిపుంజు గూసింది. మల్లవ్వ ఉలిక్కిపడిలేచింది. తల గోల్లకొట్టుకొని గుడిసెబయటకొచ్చి అవులించింది.... ఇంకా చీకటి చీకటిగానే ఉన్నది.... "తెల్లారెసుక్క బారెడేఎక్కింది. పుంజుకగ్గివల్ల ఎప్పుడు మనాదిబద్దె గప్పుడేకూత్తది" మల్లవ్వ మళ్ళీగుడిసెలోకొచ్చి నేలమీదకూర్చున్నది.... ఎల్లయ్య పెద్దబండి సప్పుడుతీర్గ గురుకొడుతండు- మల్లవ్వకు మలేరియాసోకి సచ్చిన ఇద్దరు కొడుకులు యాదొచ్చిండ్లు- కళ్ళల్లో నీళ్ళూరినయ్

"దేవునిగుల్లె రాయిబడ ఒక్కన్నన్న ఉంచకపాయె-" అనుకున్నది. ఇంతలో గుడిసెవెనుక ఏదో సప్పుడినవచ్చింది....

"కుక్కలో - పిల్లులో...." అనుకున్నది....

"మల్లవ్వా!" ఎవరో పిలుస్తున్నపిలుపు.... మల్లవ్వలేచి ఇంటివెనకకొచ్చింది. చీకట్లో దడిదగ్గర ఏదో నీడకదులుతంది....

"నేను మల్లవ్వా!"

అగొంతు మల్లవ్వకెరికే....

"అయ్యోబిడ్డా!" ఎనుగుపొరకలు పాపింది....

సారు లోపలికొచ్చిండు....

"కాసంత సాయంబట్టు...."

మల్లవ్వ సాయంబట్టగా గుడిసెలోపలికొచ్చారు....

"అయ్యోబిడ్డా ఏమయ్యింది...." మల్లవ్వ ఆదుర్దాగా పొయ్యిల బూడిదలో వెతికి నిప్పుతీసి పుల్లలేసింది....

"పక్కపల్లెల దాడిజరిగింది. ఉరికచ్చిన- కాలుమలుసుకపోయింది"....సారు....

గుప్పున మంట లేచింది- కుడికాలు చీలమంత గీసుకపోయి నెత్తురుకారుతోంది- ఒళ్లంతా గీరుకపోయున్నది- దుమ్ముని౦డి, దవడలు పీక్కపోయి మరింక కదలడానికి ఓపిక లేనోనిలాగున్నాడు....

"అయ్యో కొడుకా! అళ్ళింట్లసీగ్గెల్ల బతుకనిచ్చేటట్టులేదు-" అనుకుంటూనే ఉప్పుకుండ వెతికింది. కుండలో ఒక్కఉప్పురాయన్నా దొరకలేదు-

బతుకింట్లపీగ్గెల్ల సయిసారంలేని బతుకులు- ఉప్పుసుతదొరుకని బతుకులు- కాపుతె కాసంతనొప్పితగ్గు, ఒదులకియ్యకపోను గొనుగుతూ- "ఏమయ్యలే....లే...." ఎల్లయ్యను పట్టిఊపింది....

"తెల్లారినంక సూద్దాం.... ఆళ్లు ఈగూడానికిసుత అత్తరేమొ?" అంటూదిక్కులు చూసిండు....

ఆగుడిసెలో దాగేటందుకు ఏదిలేదు, ఎల్లయ్యలేచిండు- ఎదురుగా సారును ఆ ఆకారంలోచూసి అతని నిదురమబ్బు ఒదిలిపోయింది.

"వో.... భీమింట్లకాసంత ఉప్పున్నదేమొ పట్టుకరాపో" మల్లవ్వ

"ఉప్పుసంగతట్లుంచు- మనోల్లందరికిచెప్పు- మొగోల్ల దరిని గుట్టమీదబడు మను, పక్కూల్లెకు పోలీసులచ్చిండ్లు" సారుచెప్పిండు.

ఎల్లయ్య గుడిసెబయటకునడిచిండు- మల్లవ్వకు "నూనెన్నా ఉంటెబాగుండు ననే" ఆలోచనవచ్చింది.

కోడిపుంజు మళ్లాగూసింది- మల్లవ్వ ఉలిక్కిపడ్డది,

గూడెంమొదట్ల ఈలలు వినవచ్చినయ్.

"మల్లవ్వా అత్తండ్లు" సారు లేచినిలుచున్నాడు.

"అయ్యో ఎట్లబిడ్డా?" మల్లవ్వ కాళ్లుచేతులు వనుకుతున్నాయి.

"లాభంలేదుమల్లవ్వా! ఈ గుడిసెల ఉండవశంగాదు" కుంటుకుంటూ దడికేసి నడిచిండు.

మల్లవ్వ దడికొయ్యలుబాపింది.... "చెరువుకట్ట తీగెదారుపొదల్లుండు బిడ్డా!" మల్లవ్వ అంటుండగానే కుంటుతూ సారు చీకట్లో కలిసిపోయాడు

సారుచీకట్లో చెరువుకట్టకేసి నడుస్తుండగా గూడెంలోనుంచి ఏడుపులు విన్పించి నయ్....

o o o o

చెరువుకట్టమీది తీగెదారుపొదల్లో కదలలేక సారు కుప్ప కూలిపోయున్నడు- కొలువాచింది- కడుపులో ఆకలికుట్టు అంతకంతకు తీవ్రమౌతోంది- కట్టకింద అందురు

దొమ్మల్లో పచ్చగా పొలాల కొసలుకన్పిస్తున్నాయి. మర్రిచెట్టు కొసలు కన్పిస్తున్నాయి. నాలుక పిడుచగట్టుకపోయింది.

చూస్తుండగానే ఎండపొద వెళ్ళిపోయింది- పల్లెలోని పెడబొబ్బలు, అవి ఆగిపోవడం తనువింటూ కదలలేనిస్థితిలో ఇక్కడపడున్నాడు- ఒళ్లు పొగలుచిమ్ముతున్నట్లుగా అన్పించింది.

కొసామొదలులేని ఆలోచనలు మెదడునిండా....

"ఇప్పుడేంచేయడం- ఏప్రజల కోసమైతే తను సర్వస్వాన్ని ఒదులుకొని వచ్చిందో? ఏప్రజల గుండెలో గుండెగ- మొసళ్లో మొసగ- గంజిగట్కదాగి సేండ్లల్ల వెలుకల్లపన్నడో? ఆ ప్రజలే ఇవ్వాళ్ళ నిర్బంధాల మధ్య బతుకుతున్నారు. తనతో కలిసచ్చిన వాళ్లల్లో దెబ్బలకాగలేక ఒకడు దొరపక్షం చేరిపోయిండు. ఒకడు ఊరిడిసిపోయిండు.... విప్లవం విందు భోజనంగాదు నిజమే- కాని ఇంత కర్కశంగా ఉంటుందా? అంతపెద్ద శత్రువుకు వ్యతిరేకంగా జనాన్నికూడ గట్టడమెట్లా? ఇరువైఏండ్లనుంచే కాదు- జనం వందల సంవత్సరాల నుంచి దగాపడుతూనే ఉన్నారు.... మొదట వీళ్ళతో ఉండి పోరాటం నడిపినవాళ్లు పాలకవర్గాల గులాంలైపోయారు.... ఎవ్వరొచ్చినా పంటదక్కలేదు- భూమిమీద హక్కు దక్కలేదు. పోయినసంవత్సరం పంట దక్కింది.... భూమిమీద హక్కుకోసం పెనుగులాట మొదలయ్యింది. ఈసారి దొర పోలీసులను రంగంలోకి దింపిండు- ఎట్లా? ఈ గండంనుంచి- ఈ దెబ్బలనుంచి, ఈ నిర్బంధంనుంచి బయటపడేదెట్లా? ఓ నాసోదరులారా చెప్పండి!" సారు చెంపల మీదిగుండా కన్నీళ్లు కారుతున్నాయి.... ఈ ఆలోచనలు కొసేపుఅగుతే బావుండుననుకున్నాడు.

పడమటి కొండమీద సూర్యుడు గాయపడిన వీరునిలాగున్నాడు. గుట్టబోరు మీద నెమల్లు ఎగురుతున్నాయి....

సారు మూతిసాచి పెరువుకట్ట మీదిగుండా చెట్లమధ్యనుండి గుట్టబోరు పక్కనుండి గూడానికి వెళ్లేదారికేసి చూస్తూ కూర్చున్నాడు. అతని కళ్ళముందు ఎవడో ముసలివాడు ఖనెల్లు ఖనెల్లున దగ్గుతూ చెమటలు కారుతుండగా కొండను తవ్వుతున్న దృశ్యం.... ఏదో కవిత్వంలోని చరణం.... గుర్తుకొచ్చాయి.

పడమటి కొండమీదినుండి చీకటి దిగుతోంది. మర్రిచెట్టుమీద పైడికంటె భయంభయంగా అరిచింది. గూడానికివెళ్ళేదారి నల్లనాగులాగా మారిపోయింది. చెట్లు

దయ్యాలయిపోయాయి. చెట్లకొసల్లో ఒకటి రెండుచుక్కలు వేలాడదీసినట్టుగా మినుకు మినుకు మంటున్నాయి. కాళ్ళు బారజాపి వెన్ను నేలమీదికాన్చాడు- కుడికాలు సలుపు తోంది. కండ్లకు చీకట్లుకమ్ముతున్నాయి.

సరిగ్గా అలాంటిసమయంలో గూడెందారిలో "ఓరిమొండవ్వో" అన్నపిలుపు అసహనంగా దీనంగా వినిపించింది. సారు ఉలిక్కిపడి దారికేసి చూసిండు కర్రి చప్పుడుతప్ప మరింకేమి విన్పించలేదు. మళ్ళీ అదేపిలుపు ఈసారి మర్రిచెట్టు కింది నుండి విన్పించింది.... అదితన పేరే....

"మల్లవ్వ...." అనుకున్నడు మనసులోనే. లేవబోయిండు బలాన్నంతా కూడదీసుకొని- పండ్లుబిగబట్టి లేచినిలుచున్నాడు- జరజర పాకినట్టుబాధ.

"ఏతల్లిగన్నదో బిడ్డా ! కాళ్ళల్లమెదిలినవ్- కండ్లల్లమెదిలినవ్" మల్లవ్వగొంతు పూడుకపోయింది.

"అవ్వా !" కుంటుతూ బొదలుదాటి కట్టమీదికొచ్చాడు.

"ఏడున్నవ్ బిడ్డా ! నాతండ్రీ ఏడున్నవ్" మల్లవ్వ సారుదగ్గెరికొచ్చి ఒళ్ళంతపునికి చూసింది- మీదపడిఏడ్చింది- అది ఎక్కడిదుఃఖమో ! వెక్కబట్టి నడిపించుకపోయి చెరువులో ముఖంకడిగింది. గుడ్డపేగుతో ఒళ్ళంతాతుడిచింది.

"బిడ్డా ! కూసంతదిను" తనుతెచ్చిన గదుకమూటవిప్పి ముద్దలుపిసికి నోటి కందిచ్చింది....

"మనోల్లు ..."

"అందర్ని పట్టుకపోయిండ్లుబిడ్డా !"

"ఎల్లయ్యనుసుత"

"ఆళ్ళ కొమ్ముగొట్ట రక్తాలుకారంగా తన్నుకుంట తీసుకపోయిండ్లు.... అయినె మరికొంత నంది గుట్టల్లకు బోయిండ్లట జాడాపత్తాలేరు."

"మనం గెలుత్తమంటవా అవ్వా ?"

మల్లవ్వ కాసేపు మాట్లాడలే.... ఆతరువాత ఎలుగురాసిన గొంతికతో "బిడ్డా ! నేను నీకు చెప్పేటాన్నిగాదు. నిచ్చమే ఒక్కపారిగాదు నాలుగుపారీలు గూడెం సత్తె నాశిడమైపోయింది అలెక్కన దోసుకోండెన్నడు ?"

"నిజమే కాని అవ్వా"

"గీ పెరువుకింద అరిపొలమే సూడరాదుబిడ్డా! ఎన్నిపారీలు దున్నాలె- నాలుగు పారీలు దున్నాలె- ఇదుగు ఇరువాలు మూడుసార్లుదున్ని నాలుగోపారి కయిలిజేసి జంబు గొట్టి నెలదినాల నుంచి పసిపోరగండ్ల తీరుగ సాదుకచ్చిన నారుబెట్టాలె- అదికి అయి పోయిందా? కండ్లల్ల కనిపాపలు జంపుకొని నీల్లుబెట్టాలె- నీల్లుబెట్టినంత గడ్డిగాదం బడ్తది. కలువాలె అదికే అయిపోయిందా? ఎర్రిబొమ్మడిరోగం, గొట్టపురోగం తాకుద్ది గది ఎరుకజేసుకొని మందుగొట్టాలె- ఎరువెయ్యాలె- ఇయ్యన్ని జేసినమే అనుకో పొలంపండి కోతకచ్చిందే అనుకో! కోసితెచ్చుకువేయాళ్ళకు రాళ్ళవాన గొట్టిందా? సర్వం గంగలగలుస్తది" అవ్వమాట్లాడలేదు. అప్పటికే పైడికంటె రెండుసార్లు గూసింది.

"ఇది గింతే అయ్యిందంటవా అవ్వా?"

"ఒప్పుకున్న- కని ఒక్కడు ఫసలు సత్తెనాశిదం ప్రతిపూజ అయ్యిందని మర్కొకేడు పొలం దున్ననిరైతును మన్నెక్కన్నన్న సూత్తివా? కొడుకొగిదిగంతే- ఎన్నిపారీలు దెబ్బదిన్నా రైతు దున్నుతనేఉంటడు. పంట బెడ్తనేఉంటడు. దున్నడు బందుజేత్తడా?" మల్లవ్వ ఇంకా ఏదో గొణుగుతోంది....

సాదు పనికేచేతులతో మల్లవ్వచేతులు పట్టుకున్నాడు. చెట్లసందుల్లోనుంచి వెన్నెల పాకుతోంది. మల్లవ్వకుందు నడుస్తుండగా సారువెనుక నడిచాడు.

వెన్నెలవెలుగులో మరికాసేపటికి గూడెం బజారులో పదిమందిదాకా కూర్చున్నారు.... అందులో కిలిశెట్టి ఎల్లయ్య కూడా ఉన్నాడు....

"నిజమే మనం సానాసార్లు దెబ్బలుతిన్నం. ఎందుకు? చేతులు ముందు బెట్టుకొని కూర్చున్నంగనక. పడేటోడుంటె కొట్టెటోడుంటడు. నోరు మెదుపకుంటె దోసుకునేటోడుంటడు.... ఎదురుతిరగడమొక్కటే కాదు. శత్రువువేసే ఎత్తులుజిత్తులు తిప్పికొట్టాలె- ముల్లును నరుకాలంటె గొడ్డలిగావాలె- ఉత్తచేతులతోని ఏంజెయ్యాలేం? ఇరువైఏండ్లనుంచి మనం ఉత్తచేతులతో నున్నంగనకనే వాడు మల్లమల్ల మనమీది కచ్చిండు". ఇట్లాగా సారు చెప్పుతూనే ఉన్నాడు....

సతీసహగమనం

మారుతున్న ప్రపంచంలో మారని సాంఘిక ధర్మం

కె. సంగరి, ఎస్. వైద్

ఈమధ్య రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ల్లో జరిగిన ఈకాలపు సతీ సహగమనపు సంఘటనల పరిశీలన ఈ వ్యాసం.

ఈ వ్యాసం గతంలో 'సతి' ఆచరణనూ, పందొమ్మిదో శతాబ్దంలో దానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాన్నీ, సతికి వ్యతిరేకంగా బ్రిటిష్ ప్రభుత్వజోక్యాన్నీ క్లుప్తంగా పరిశీలించి ఈ మధ్య రాజస్థాన్‌లో సికార్ జిల్లాలోని జాడ్లిగ్రామంలో జరిగిన సతి సంఘటనను వివరిస్తుంది. ఈ వ్యాసంలో ఆ ప్రాంతంలోని సాంఘిక, ఆర్థిక పరిస్థితుల నేపధ్యంలోనూ, ప్రబలంగా ఉన్న భావజాలపు నేపధ్యంలోనూ ఆసంఘట నను పరిశీలించే ప్రయత్నం జరిగింది.

గతంలో 'సతి'ని శాసించిన భావజాలమే ఆప్రాంతంలో ఇంకా కొనసాగుతున్నదని ఈ వ్యాసంలో గుర్తించబడింది. కాని తేడా ఏమిటంటే సతి ఆచరణ "విధి"గా కాకుండా "స్వచ్ఛందంగా" చేయబడుతున్నది. ఐతే పంతొమ్మిదో శతాబ్దపు బెంగాల్ పరిస్థితికి భిన్నంగా ప్రస్తుతం సతి వ్యతిరేక ఉద్యమమూ లేదు. ప్రభుత్వజోక్యమూ దాదాపు నిష్ఫలంగా ఉంది.

వేదకాలంలోనే చెల్లిపోయిన సతి మధ్యయుగపు రాజస్థాన్‌లోనూ, వలసగాఉన్న బెంగాల్లోనూ సాంఘిక సంక్షోభం ఉన్నదశలో సామూహిక కార్యక్రమంగా ముందుకొచ్చింది. బ్రిటిష్ పాలనకు లోనైన మొట్టమొదటి ప్రాంతం గనుక బెంగాల్ ఎన్నో ఆర్థికపరమైన మార్పులకు గురైంది. భూస్వామ్య విధానం గురించి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తనచెంది, మనిషికీ సంఘానికీ, మనిషికీ దేవునికీ ఉన్న సంబంధం విషయంలో భిన్నమైన భావనలుకలిగిన బ్రిటిష్ పాలకులు బెంగాల్‌మీది సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో బలమైన ప్రభావం వేశారు. ఈ మార్పులు మధ్యతరగతివర్గం ఏర్పడడానికి దారితీశాయి. మధ్యయుగాల హిందూ, ముస్లిం విద్యావంతులకు భిన్నంగా ఒక ఆధునిక మేధావివర్గం ఆవిర్భవించింది.

బెంగాల్‌లో ఈ పట్టణ మధ్యతరగతి మేధావివర్గం పుట్టుకలోనే సంఘ సంస్కరణోద్యమబీజాలు ఉన్నాయి. అధికారిక అంచనాల ప్రకారం 1815 నుంచి 1818 దాకా

ప్రెసిడెన్సీ మొత్తంలో 2365 సతీసహగమనాలు జరగగా దాంట్లో ఒక్క కలకత్తా డివిజన్‌లోనే 1528 సతీసహగమనాలు జరిగాయి. 1828 లో ప్రెసిడెన్సీ మొత్తంలో జరిగిన 464 సతీసహగమనాల్లో కలకత్తా డివిజన్‌లో జరిగినవి 309. సతీసహగమన వ్యతిరేకోద్యమం అది ప్రబలంగా ఉండిన కలకత్తా డివిజన్‌లోనే మొదలైంది. సతీ సహగమనాన్ని భావజాలరంగంలోనూ, సాంఘిక రంగంలోనూ ఎదుర్కొంటూ రామ మోహనరాయ్ రాసిన మూడు కరపత్రాలు 1818, 1820, 1829 ల్లో వెలువడ్డాయి. సతీసహగమనానికి మతపరమైన అంగీకారాన్ని ఖండిస్తూ వివిధ మతగ్రంథాలనుంచి సతీసహగమనం 'విధి'కాదనే అంశాలను ఉదహరిస్తూ మొదటి కరపత్రం 'సతి'ని కోరిన వాళ్ళకు వాళ్ళభాషలోనే జవాబు చెప్పింది. రెండో కరపత్రం స్త్రీల నికృష్ట పరిస్థితులను వివరించి ఆ పీడక ఆచారాలే సతికి పునాదిగా ఉన్నాయని లౌకికపరమైన వాదనచేసింది. మూడో కరపత్రం సతి నిషేధచట్టం వెలువడిన తర్వాత ప్రకటించ బడింది. ఈ కరపత్రంలో సతి కోరడం వెనకఉన్న నీచమైన, భౌతిక అవసరాలను వివరించి, సతిలోని అమానుషత్వాన్ని ఎత్తిచూపడం జరిగింది. ఆరకంగా సతి అతీతభావననుంచి, మత అంగీకారం నుంచి విడదీయబడి హత్య, ఆత్మహత్యలతో సమానంగా చూడబడడం ప్రారంభమైంది.

సంస్కర్తల ప్రచారం పండితుల, పాలకుల పరిమితబృందాలనుంచి ప్రజల్లోకి చొచ్చుకపోయింది. కరపత్రాలు బెంగాలీలో ఉండేవి. అవి "వితంతుదహనం ప్రబ లంగాఉన్న ప్రాంతాల్లో పంచబడ్డాయి". అదేసమయంలో ఈప్రచారం న్యాయశాస్త్ర రంగంలోకూడా కదలికకుతోడ్పడింది. సంస్కర్తలకు దొరికిన సదవకాశమేమిటంటే పాలకులకు సతివ్యతిరేక విలువల్లో విశ్వాసముంది, వాళ్ళింకా అప్పటికి వలసవ్యతిరేక పోరాటదశలోకి రాలేదు. కనుక వాళ్ళుచాలా సులభంగానే సతిని నిషేధిస్తూ చట్టం ప్రవేశపెట్టారు. చట్టం వెంటనే ఆచరణలోకివచ్చింది, 1829 నుంచి 67 దాకా ఇరవై ఐదు సతీసహగమన ప్రయత్నాలు పోలీసుజోక్యంతో అడ్డుకోబడ్డాయి. నేరస్తులకు శిక్షలు, జరిమానాలు విధించబడ్డాయి. మొత్తంగా సతి దాదాపుగా ఆగిపోయింది. స్వాతంత్ర్యానంతరంకూడా చెదురుమదురుగా కొన్నిసంఘటలు జరిగాయి కాని ప్రజలు వాటిని పట్టించుకోలేదు.

జాడీలో సతీసహగమనం

పదహారేళ్ళ ఓంకన్వర్ అనే షెకావత్ రాజపుత్రయువతికి బొంబాయిలో ట్రక్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇరవైరెండేళ్ళ రామ్‌సింగ్ అనే యువకుడితో పెళ్ళయింది.

ఆయన మరణించాక ఆయువతి సహగమనం చేయడానికి నిర్ణయించుకుంది. వాళ్ళ పెళ్ళయి ఆరునెలలే అయినందువల్లా, రామ్‌సింగ్ బొంబాయిలో ఉన్నందువల్లా, ఆయన వ్యాధితో ఆస్పత్రిలు తిరుగుతూ ఉండినందువల్లా వాళ్ళు కలుసుకోనేలేదు శవం జైపూర్ ఆస్పత్రినుంచి జాడ్లీ చేరింతర్వాత ఆమె అకస్మాత్తుగా తననిర్ణయం ప్రక టించింది గ్రామస్తులందరూ ఏర్పాట్లలోపాల్గొన్నారు. ఆమె సహగమనంచేయడం వేలాదిమంది చూశారు. సర్పంచ్‌వెళ్ళి పోలీసులను తీసుకొచ్చేసరికే అంతా అయిపో యింది. పదమూడోరోజున 'చంద్రి' ఉత్సవం చేసేవరకూ బూడిదను సాయుధ వ్యక్తులు కాపలాకాశారు. చంద్రిఉత్సవానికి రెండులక్షలమంది హాజరయ్యారని చెప్ప బడుతోంది. ధర్మశాల, స్మారకమందిరమూ నిర్మించడానికై ఒకట్రస్టుకూడా ఏర్పా టయ్యింది.

జాడ్లీలోనే దీనికంటె ముందరి సతీసహగమనం రెండువందల ఏళ్ళకింద జరి గింది. ఐతే శికార్‌జిల్లాలో సతి ఎక్కువగావే జరుగుతోంది. ఈమధ్యకాలంలోనే ఏడు సతీసహగమనాలు జరిగాయి.

శికార్-జాడ్లీ

1938 వరకూ శికార్ జైపూర్ సంస్థానంలో 'స్వతంత్ర' ప్రాంతంగా ఉంటూ ఉండేది. 1938లో శికార్ ప్రధాని రావురాజా శికార్ తన అధికారాలన్నిటినీ జైపూర్ మహారాజాకు ధారాదత్తం చేయాల్సివచ్చింది. జైపూర్ రాష్ట్రంలో భాగంగా శికార్ కూడా ఇండియన్ యూనియన్‌లో కలిసిపోయింది. ఈ జిల్లా రాజస్తాన్‌లో అర్ధమెట్ట ప్రాంతంలోకి చేరుతుంది. ఇక్కడ వర్షపాతం 15 అంగుళాలు మాత్రమే. నీటి పారుదల సౌకర్యాలేమీలేవు. పారిశ్రామికాభివృద్ధిఏమీలేదు. ఒకకోటి దాకా ఉండే జిల్లా జనాభాలో ఎక్కువశాతం గ్రామీణ జనాభాయే.

జైపూర్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉండే జాడ్లీ గ్రామం జనాభా పదివేలు. ఇక్కడ పెద్దగా ఉద్యోగావకాశాలేమీ లేకపోవడంవల్ల జనం ఎక్కువగా పట్టణాలకు వెళ్ళి బతుకుదెరువు చూసుకుంటారు. గ్రామానికి కంకరరోడ్డు ఉంది. గ్రామంలో పోస్టాఫీసు. విద్యుచ్ఛక్తి, ఒక ఉన్నత పాఠశాల, రెండు ప్రాథమిక పాఠశాలలు సాంఘిక వ్యవస్థ దృఢమైన కులపునాదిమీద ఆధారపడిఉంది. భూమి ఎక్కువగా షెకావత్ రాజపుత్రుల చేతుల్లోనూ, జాట్‌ల చేతుల్లోనూ ఉంది.

1950-51 వరకు ఇక్కడ జనాభాలో స్త్రీలనిష్పత్తి బాగానేఉండేది. ఆతర్వాత ఆ నిష్పత్తి పడిపోవడం ప్రారంభమైంది. జనాభాలో స్త్రీ పురుషుల నిష్పత్తి 1951లో

972 : 1000 ఉండగా 1961లో 964 కూ. 1971 లో 961 కీ పడిపోయింది. శికార్ జిల్లాలో ఉత్పత్తి రంగంలో పాల్గొంటున్న స్త్రీలసంఖ్య చాలాతక్కువ వ్యవహాయ దారుల్లో 4 శాతం మందిమాత్రమేస్త్రీలు. వ్యవసాయకూలీల్లో వాళ్ళసంఖ్య 0.6 శాతం మాత్రమే. మిగిలిన రంగాల్లో వాళ్ళసంఖ్య మరీతక్కువ. ఇక్కడ అక్షరాస్యతాశాతం కూడా తక్కువే గ్రామీణప్రాంతాల్లో 4 శాతంమాత్రమే అక్షరాస్యతఉంది.

అగ్రవర్ణాలస్త్రీలు ఆర్థికంగా పురుషాధీనినులు- ఇక్కడ కఠినమైన ఘోషాపద్ధతి అమల్లోఉంది. వరకట్న సమస్యమూలంగా వివాహాలు వయసుమీరిన తర్వాత అవుతున్నాయి. స్త్రీలు బావుల్లోపడి ఆత్మహత్య చేసుకోవడం ఇక్కడిగ్రామాల్లో సర్వసాధారణం. అగ్రవర్ణాలలో వితంతు పునర్వివాహ నిషేధం అమలవుతున్నది. జాట్‌లకు, హరిజనులకు ఈ నిషేధంలేదు- వైశ్యుల్లో కొన్ని వితంతుపునర్వివాహాలు జరిగినాయి. కాని రాజపుత్రుల్లో, బ్రాహ్మణుల్లోమాత్రం ఒక్కటికూడా జరగలేదు. అగ్రవర్ణ వితంతువులు మామగారిఇంటివద్దనే ఉండాలి. చనిపోయిన భర్త ఆస్తికి ఆమె వారసురాలు, గౌరవనీయ కుటుంబాలవాళ్ళు వితంతువుల ఈహక్కును కాదనరు. ఐనా, అత్తగారివైపువాళ్ళు తమ బాధ్యతలను గుర్తెరిగినప్పటికీ వితంతువుల పరిస్థితి పరాధీనతే. భర్త ఉంటే ఉండే రక్షణా గౌరవమూ ఉండవు- సాధారణంగా వితంతువులను దయనీయమైన స్థాయిలోనే ఉంచుతారు. ఇట్లా అగ్రవర్ణ వితంతువులు హీన స్థితిలో ఉంచబడడమే ఈ ప్రాంతంలో పతిసహగమనం జరగడానికి కారణం.

స్వచ్ఛందక్రియగా సతి :

పైకిచూస్తే ఓం కన్వర్ సహగమనం స్వచ్ఛందక్రియగానే కనిపిస్తుందిగాని ఈ స్వచ్ఛందక్రియను సాంఘిక, సాంస్కృతిక, మతనేపథ్యంలో చూడవలసిఉన్నది. పదిరోజులకిందే మూర్ఛవచ్చిన ఓం కన్వర్ బహుశా ఇంకా ఉద్వేగంతో ఉండి ఉంటుంది. ఆమె రామ్‌సింగ్ మేనత్త వితంతువుగా ఇంట్లోపొందుతున్న కష్టాలుచూస్తూ ఉన్నది. కులగురువు జమన్‌లాల్‌శాస్త్రి ఉపదేశించిన నారీధర్మానికి సంబంధించిన మతభావనలు ఆమెపై ప్రభావం వేసేఉంటాయి. శవాన్ని వెనక్కి తీసుకురావడమూ, ఆచారంలో లేనిరీతిలో యువతితోపాటే నగలు దహనంచేయడమూచూస్తే ఈ సతీ సహగమనం ముందే నిర్ణయించబడిందికాదని అర్థమవుతుంది. ఐనా కుటుంబం దాన్నాపే ప్రయత్నమేమీ చేయలేదు. గమనించవలసిన విషయమేమిటంటే మెహందీలోకి నీరుప్రవహించడం, పెట్టెలు వాటంతటవే తెరుచుకోవడం, పెళ్ళిబట్టలు పైకెగరడం, ఎత్తైన చితిమీదికి స్త్రీ ఎవరి సహాయమూలేకుండా ఎగరడం, చితిమంటలు

దానంతటదే రగులుకోవడంలాంటి కుటుంబసభ్యులో, ఇతరులో సాయపడకుండా చేయలేనిపనులు అద్భుతాలుగా చూడబడుతున్నాయి. భౌతిక విషయాలను అద్భుతాలుగా భావించడంలో రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి, అది వ్యక్తిగత, సామాజిక బాధ్యతలను దాస్తుంది లేదా నిరాకరిస్తుంది. రెండు ఈ అద్భుతాలు 'సత్'ఉన్నదన డానికి రుజువులవుతాయి. ప్రతి వితంతువూ 'సత్' కలిగినతరువాతనే సతి ఆచరించ డానికి అర్హురాలవుతుంది. ఓంకన్వర్‌కు సత్ ఉన్నదోలేదో పరిశీలించిన ప్రధాన మధ్యవర్తి జమన్‌లాల్‌శాస్త్రి అనితెలుస్తున్నది ఆయన ఓమ్ కన్వర్‌ను సత్ వెల్ల డించమని అడిగాడని, స్వయంగా తనచేతుల్లోకాల్చడం ప్రారంభించాడని తెలుస్తున్నది.

సత్ కలిగిఉన్నస్త్రీ వరాలివ్వడానికైనా, శపించడానికైనా ప్రత్యేకశక్తులు కలిగి ఉంటుందని భావించబడుతున్నది. సత్ శాపంపట్ల భయమే వితంతువులను బలినుంచి అడ్డుకునే ప్రయత్నం నుంచి ప్రజలను వెనక్కితోస్తున్నది. సత్‌కు ఉన్న శక్తులేవీ ఇంతవరకూ రుజువుకాలేదు. సత్ కలిగిఉన్న స్త్రీ మంటల బాధకు అతీతురాలైపోతుంది గనుక చితిమీద ఏబాధాలేకుండా కూచోగలుగుతుందనే భావనఉంది. ఐతే విచిత్రంగా సత్‌కు వ్యతిరేకమైన రుజువు స్త్రీ కాలిపోవడంలోనే దొరుకుతున్నది.

మంటకు అతీతురాలైన ఓమ్‌కన్వర్ చితిమీద ఎంతనిశ్చలంగా, నిశ్శబ్దంగా కూర్చున్నదో కొందరు వివరించారు. ప్రత్యేకంగా ఒక హరిజన కుటుంబం మాత్రం ఓమ్‌కన్వర్ పడిన వేదనను గుర్తించింది. ఐతే వాళ్ళు సత్ శక్తులను శంకించడం లేదు. ఈ సంఘటనలో మాత్రం సత్ ఉందోలేదోనని అనుమానిస్తున్నారు.

ఒకసారి స్త్రీకి సత్ కలిగింతర్వాత మళ్ళీ తన నిర్ణయాన్ని మార్చుకోలేని లేదా తన నిర్ణయపు పూర్తి రూపాన్ని తెలుసుకోలేని ఒక క్రూరమైన పరిస్థితిలోకి నెట్టబడు తుంది. సత్ శబ్దఉచ్చారణ స్త్రీని దేవతగా మార్చి ఆ చర్యయొక్క భీభత్సాన్ని ఆలో చించనివ్వకుండా సామూహిక దహనానికి వీలుకలిగిస్తుంది. సహగమనం స్త్రీపరంగా ఎప్పుడూ స్వచ్ఛందచర్యకాదు. ఆమె ఎన్నో కుల, మత కట్టుబాట్ల హోరులో సత్ నిర్దేశించినట్టు చనిపోవడానికి నిర్ణయించుకుంటుంది. సత్‌మీద విశ్వాసం అనేది బల ప్రయోగానికి సమానమైన మతశక్తి.

సత్ ఉనికిని అంగీకరించడం మీదనే సహగమనం స్వచ్ఛందక్రియా, బల ప్రయోగంవల్ల చేయబడుతున్నదా అనే విషయం ఆధారపడిఉంది. ఆత్మహత్యగానో మతాచారాల ప్రకారం చేయబడే హత్యగానో చూడబడవలసిన సతీసహగమనం వని[illegible]

కార్యమని భావించడానికి సత్‌లో నమ్మకమే కారణం. సత్ విధిగానూ, అతీతమైనదిగానూ నిర్దేశించబడడంవల్ల న్యాయశాస్త్ర జోక్యం అనవసరమైందిగా, దైవోల్లంఘనంగా భావించబడుతున్నది.

సతి భావజాల ప్రచారం :

సతీసహగమనం పట్ల వేరువేరుకులాల్లో వేరువేరు ఆలోచనలున్నాయి. హరిజనులు దాన్నొక అద్భుతంగా భావించి, భయంతో దాన్నంగీకరిస్తున్నారు. అగ్రవర్ణాల వర్గాలవాళ్ళు సతిని ఉత్తమకార్యంగా అభివర్ణిస్తూ దాన్ని ఈ ప్రాంతంలో ప్రబలం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఝాడ్లీలో సతి కంటె ఒకటిన్నర సంవత్సరాల క్రితం ఝాడ్లీకి మూడు మైళ్ళ దూరంలో హతిదే అనేఊళ్ళో ఒక యాభైఐదుసంవత్సరాల స్త్రీ సహగమనం చేసింది. ఈసంఘటనను స్తుతిస్తూ ఓం కన్వర్‌కు కులగురువైన జమన్‌లాల్‌శాస్త్రి ఒక పుస్తకం రాశాడు. ఈ ప్రాంతంనుంచి ముప్పైరెండు మంది సభ్యుల బృందం ఒకటి హతిదేలో సతిఆలయం నిర్మించడానికి, సతి ఆదర్శాన్ని ప్రచారం చేయడానికీ విరాళాల కోసం ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

పుస్తక ప్రచురణ మాత్రమేకాక సహగమన భావప్రచారం ఇతర రూపాల్లో కూడా జరుగుతోంది. ప్రాంతీయ పాఠశాలల పాఠ్యగ్రంథాల్లోనూ, డింగాల్ వీరచరిత్రలోనూ సతీసహగమనం స్తుతించబడింది. ఒక్కమాటలో చెప్పాలంటే గతంలోలాగే మళ్ళీ (సతీసహగమనం) స్త్రీ విజయసాధనకు శిఖరాయమానమైనదనీ, చరిత్ర, మతం, సాంఘికాచారాలు నిర్దేశించిన సరైనచర్య అనీ అనుకోబడుతున్నది.

గ్రామంలో మార్పులు చాలా తక్కువస్థాయిలో వస్తున్నాయి. ఈమధ్యనే బాలికల ప్రాథమిక పాఠశాల ప్రారంభమైంది. ఇది అన్నికులాల బాలికలనూ ఆకర్షిస్తున్నది. జిల్లాలో స్త్రీలలో అక్షరాస్యతాశాతం చాలాతక్కువ. 35 ఏళ్ళుదాటిన స్త్రీలలో అక్షరాస్యులు 3% మాత్రమే. ఈ సంఖ్య 10-19 వయసుగల బాలికల్లో 14 శాతం, 5-9 వయసుగల బాలికల్లో 61 శాతంఉంది.

సతిభావజాలాన్ని దృఢంగా ప్రతిష్ఠించి దానిద్వారా భార్యలుగా, ఇంటి పనివాళ్ళుగా స్త్రీలస్థానాన్ని పవిత్రీకరించడం స్త్రీలను యథాస్థితిలో ఉంచడానికొక ముసుగు మాత్రమే. ఇదివరకు రాజపుత్రుల అధీనంలో ఉన్నప్రాంతాల్లో తక్కువకులాలవాళ్ళకులేని విద్యాసౌకర్యాలు కల్పించి, మంచి ఇళ్ళుకట్టించి, వాళ్ళను బాగుపరుస్తున్నామనే పేరుమీద అగ్రవర్ణాల విలువలకు దన్నుగానిలవడమే సతిభావజాల ఉద్దేశ్యం.

సతి ప్రభావం :

సతీసహగమనంద్వారా వచ్చేలాభాలు భావపరమైనవీ, భౌతికపరమైనవికూడా. సాంప్రదాయికంగా సతివల్ల కుటుంబగౌరవమూ, కులగౌరవమూ ఇనుమడిస్తాయి. జాడ్లీలో సతివల్ల గ్రామానికి గౌరవందక్కింది. నిజానికిక్కడ కుటుంబమే వెనక్కి నెట్టబడినట్టు కనిపిస్తున్నది. పంచాయత్, పూజారి, వ్యాపారులు, విద్యావంతులు మొదలైన గ్రామపాలకపక్షాలే కుటుంబంకన్న ఎక్కువగా ఈ సంఘటనను వాడుకున్నట్టు కనబడుతున్నది. భౌతికపరమైన లాభాలు పూజారికీ, వ్యాపారులకీ దక్కాయిగాని కుటుంబానికేమీ రాలేదు. నిజానికి ఓంకన్వర్ మామ రిచ్‌పాల్‌సింగ్‌కు న్యాయంగారావలసిన దేవాలయ ట్రస్టుసభ్యత్వమూ, బహుశా దానినుంచి వచ్చే ఇతర లాభాలూ ఆయన రాజకీయవిశ్వాసాలు వేరైనందువల్ల నిరాకరించబడ్డాయి. ఆలయ నిర్మాణనిధికోసం ఏర్పడ్డట్రస్టు లక్షరూపాయలదాకా విరాళాలు సేకరించింది. ఇప్పటికి ఆలయనిర్మాణంమీద సగండబ్బు ఖర్చయినట్టు చెప్పబడుతున్నది.

పంతొమ్మిదో శతాబ్దంతో పోల్చిచూసినప్పుడు శికార్ జిల్లాలో ఏడు సంవత్సరాల్లో జరిగిన ఏడు సతీసహగమనాలు తక్కువే అనిపించవచ్చుగాని ప్రస్తుత పరిస్థితుల్లో దాని ప్రభావాన్నిబట్టి చూస్తే స్త్రీలను సాంఘిక అదుపులో ఉంచే భావజాలాన్ని ప్రచారంచేయడానికీ, తద్వారా భౌతికలాభాలు పొందుతుండడానికీ ఏడాదికొక సహగమనమైనా సరిపోతుంది.

ప్రభుత్వవైఖరి :

న్యాయశాస్త్ర పరంగా ప్రభుత్వవైఖరి లాంఛనప్రాయంగా ఉంది. శవాన్ని మోసుకుపోయిన నలుగురిమీద, పూజారిమీదా, సర్పంచ్‌మీదా కేసుపెట్టబడింది. ఐతే ఈ కేసు ఇంకా అమల్లోఉన్న 1829 సతీసహగమన నిషేధచట్టం కిందగాక మైనార్ బాలికను ఆత్మహత్యచేసుకోవడానికి ప్రోత్సహించారనే భారతనేరశిక్ష స్మృతి సెక్షన్ల కింద పెట్టబడింది. ఆ చర్యను వేలాదిమంది చూసినప్పటికీ 'సాక్ష్యాలు లేనందువల్ల కేసు కొట్టుడుపోతుంది' అని గ్రామస్తులు భావిస్తున్నారు. వాళ్ళవాదనకు ఆధారాలు కూడా ఉన్నాయి. ఈమధ్య జరిగిన సహగమనాల సంఘటనల్లో ఏ ఒక్కదాంట్లోనూ, ఏ ఒక్కరికీ శిక్షవిధించబడలేదు. చట్టం తన నిస్సహాయతవల్ల ఒక రకంగా సహగమనానికి అనుమతిస్తున్నది. అన్ని మతట్రస్టుల్లాగానే సతి ఆలయ ట్రస్టుకు కూడా పన్నుమినహాయింపు ఉంది.

14వ శతాబ్దపు జుంజును రాణీ సతిస్మారక ఆలయ నిర్మాణంపట్ల చిన్నపాటి నిరసన ప్రదర్శనా. ప్రస్తుత సహగమనం గురించి ఏడుగురు మహిళా ఎం. పి.లు

ప్రధానిని కలుసుకున్నప్పుడు "ఇది ఘోరంగా ఉంది" అన్న ఆమె మాటలూ తప్ప రాజకీయస్థాయిలో ఏ మాత్రం సంచలనం లేదు. జాడ్లీలో జరిగిన చందీ ఉత్సవంలో కొన్ని రాజకీయ పక్షాలకు చెందిన సభ్యులు పాల్గొన్నట్టు కూడా తెలుస్తున్నది.

అధికార స్థాయిలో ఉన్నవికూడా కొన్ని నిజమైన సమస్యలే. కొందరు అధికారులు సతి అనుకూలభావాలు కలిగిఉంటారు. కొందరైతే సతి జరిగిన స్థలానికివెళ్ళి నివాళి అర్పించారుకూడా. ఐతే ఇది స్థానిక అధికారులకో, రాష్ట్రప్రభుత్వాలకో సంబంధించిన సమస్యకాదు. రాజ్యాంగయంత్రానికి సంబంధించిన సమస్య. తన ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికీ, తన పోలీసునూ, అధికార యంత్రాంగాన్నీ రక్షించుకోవడానికి స్త్రీల హక్కులను త్యాగంచేసే రాజ్యాంగయంత్ర స్వభావం ఘోరమైనది. సతీసహగమనం విషయంలో 1960 తర్వాత ప్రభుత్వ ఉదాసీనవైఖరికి కారణం అది ఇతరేతర రాజకీయ, సాంఘిక ఆర్థిక సంక్షోభాలలో చిక్కుకుపోవడమే. కనుక ఇలాంటి స్థితిలో దానికి సతిసహగమన వ్యతిరేక అభ్యుదయకరచర్య తీసుకునే రాజకీయ విశ్వాసం లేదు.

అసలు సంఘసంస్కరణ స్వల్పకాలికంగానూ, దీర్ఘకాలికంగానూ సమస్యాత్మకమైందే. వితంతు పునర్వివాహం, వరకట్న నిషేధం ఇంకా కాయిదాలమీదనే ఉన్నాయి. గత, ప్రస్తుత అనుభవాలు తెలిపేదేమంటే చట్టానికీ, మతవిశ్వాసాలకూ మధ్య, పవిత్రగ్రంథాలకూ సాంఘికాచారాలకూ మధ్య, పౌరులకూ ప్రభుత్వానికీ మధ్య వైరుధ్యాలు ఉండే అవకాశం ఉంది. ఇక మతం, సాంఘిక విశ్వాసాలు, ఆచారాలు, సాంప్రదాయం మిళితమై ఉండే సతిసహగమనం విషయంలో సంస్కరణ కాయితాల మీద మాత్రమే ఉండకతప్పదు. సాంఘికపరమైన సంస్కరణ సాధించడానికి బెంగాల్ అనుభవం చూపినట్టుగా అప్పటికి ప్రబలంగా ఉన్న సాంఘిక దృక్పథాలకంటే అభివృద్ధికరమైన అభిప్రాయాలు కలిగిన నూతన వర్గాల ఉనికీ, రాజకీయ ఆశయమూ, దాన్ని సాధించేవనరులూ ఉండవలసిన అవసరం ఉంది.

ప్రస్తుత సహగమనం విషయంలో ఈ పరిస్థితులులేవు. శికార్ జిల్లాలో సహగమనాన్ని వ్యతిరేకించే సాంఘిక వర్గాలులేనేలేవు. చాలాకాలం స్వతంత్ర రాజ్యంగా ఉండడంవల్ల బ్రిటిష్ ఇండియాలో వచ్చిన మార్పులు ఈప్రాంతంపై ప్రభావం వేయలేదు. ఈ ప్రాంతంలో కలిగిన ఒకే ఒక్క సంచలనం జాట్ రైతుల ఉద్యమం. ఇది ఖచ్చితంగా ఆర్థిక డిమాండ్ల మీదనే నడిచినందువల్ల భూస్వామ్య వ్యవస్థనుగానీ, విశ్వాసాలనుగానీ సవాల్ చేయలేదు. ఈ కారణాలవల్ల సహగమనంలో బయటినుంచి జోక్యంకలగజేసుకోవలసిన అవసరం ఉంది. మొట్టమొదలు బెంగాల్

జనం మీద విశ్వాసం ఉంచు

ఎన్. కె.

సహగామీ !
మిత్రునిపట్ల నాకెంత మమకారమో నీకుతెల్సు
అయినా మిత్రునిగూర్చి
శత్రువుమాటే అనుకున్నాను
మోకాటిచుట్టూ చేతులుచుట్టేసుకుని
తలని సాంతంగా కడుపులోకి దించేసుకుని
ఇక అంతా అయిపోయిందని
అంతటా చప్పగా చల్లారిపోతుందని
ఈడ్పుగాళ్ళ జీవితాన్ని కండ్లకెత్తినాను
అపుడు
విప్లవంపట్ల
నాయకునిపట్ల విశ్వాసమేగాని
చరిత్రనిర్మాతలుగా
జనాన్ని విశ్వసించాలని తెలియదునాకు
ఇవాళ నా నాయకుడు బందీ
అయినా నా విప్లవస్వప్నాలు బందీ కాలేదు
విప్లవ విజయంమీది విశ్వాసం బందీకాలేదు
విచారమేసినమాట నిజమే
శ్వాస నిశ్వాసమైనమాట నిజమే
కాని శ్వాస ఆగిపోలేదు
ఆశ వీగిపోలేదు
జనంగుండెమీద చెవి ఆన్చివిను
ఏ నాయకుని పుట్టుక ఎక్కడో అక్కడల్లా తను

అనుభవంలో చూపినట్టుగా మత విషయాల ఆధారంగా సహగమనంపై దాడి ప్రారంభించాలి. రెండోవైపునుంచి ప్రభుత్వ జోక్యం కొంతవరకు సహగమనాన్ని ఆపడానికి ఉపయోగపడవచ్చు. తక్షణమే పెద్దఎత్తున వ్యతిరేక చర్యలు చేపట్టకపోతే ఈ ప్రాంతంలో సహగమనాలు కొనసాగడమేగాక చాలా ఎక్కువ సంఖ్యలోకూడా జరిగే అవకాశం ఉంది.

[ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ఆగస్టు 1, 1981 సంచిక నుంచి]

ఓ జనార్ధన్‌ని పోగొట్టుకున్నప్పుడు
ఓ చిన్నాల్ని పోగొట్టుకున్నప్పుడు
ఓ శంకర్‌ని పోగొట్టుకున్నప్పుడు
ఇట్లా ఎందరిపేర్లనిచెప్పను !
రాలి మట్టితో మమేకమైన కన్నీటిబిందువుల్ని ఎన్నని కూర్చను?
ఒక్కో అమరవీరునికి
ఎందరెందరో అనామక అజ్ఞాత మృతవీరులకి
అనవతవదనుడనై
అశ్రుతర్పణం చేస్తున్నప్పుడు
ఒక్కో దెబ్బకు నా నడుం వంగి నేను కృంగిపోతున్నప్పుడు
విప్లవ స్వప్న సాఫల్యం కోసం
మన పర్చుకున్న దారి
కట్టిన ఊపిర్లదండ
పోయినవాళ్ళ కోసం పడిపడి ఏడ్వడానికో
ఊపిర్లుడిగి ఉరేసుకోవడానికో కాదని
జనం మీది విశ్వాసంతో
పోరాటంలో గమ్యానికి మరింత చేరువకావడమని
వీరునికి మరణం లేదంటే
బతికున్న మనిషికోసం బతికిపోవడమని
నా వెన్నుచర్చి కన్నుతెర్చి
భుజం నిమిరింది నా నాయకుడే
నా నాయకుడు బందీ ఎట్లాఅవుతాడు ?
కాడు !
వీరుడు బందీ కాడు
వీరుడు విశ్వసంబంధి
అతను అర్ధరింగాడు
అతను సముద్రం
నల్దిక్కుల్లో మట్టినాక్రమిస్తున్న ఆచరణ
పోరాట సమాచరణ
నూతన మానవుని ఆవిష్కరణ

1

ఒక నిట్టూర్పు

వ్యక్తావ్యక్త గతంనీడలో
వర్తమానానికి రంగులుదిద్దుతున్నప్పుడు,
స్పష్టాస్పష్ట గతంవెలుగులో
వర్తమానాన్ని నిర్మిస్తున్నప్పుడు
వార్తలన్నీ ఆశను మోస్తున్నప్పుడు
కళ్ళలో భవిష్యత్తు పుష్పిస్తున్నప్పుడు
అకస్మాత్తుగా ఒక భయం
ఒక వణుకు, ఒక వేదన....
వార్తల్లో నిరాశధ్వనిస్తున్నది
వర్తమానం భయంకరంగా తోస్తున్నది
వర్తమానం కళ్ళముందు బాష్పవాయుపీడిత ఆకాశం లాగున్నది
వర్తమానం చుట్టూపరుచుకున్న నిర్బంధం నిశ్శబ్దం లాగున్నది
వర్తమానం భూమితల్లిని ముంచేస్తున్న తుఫాను సంద్రంలాగున్నది
రక్తంచల్లిన ప్రభాతంలాగ,
రాత్రేకాదు గుండెలుపగిలే ఎండలాగ
చీకటివాతపడుతున్న సాయంత్రంలాగ
కట్టేసిన మనిషిగుండెలోంచి తనకాండంలోంచి
తుపాకీగుండు దూసుకపోయిన చెట్టులాగ
విషాదసముద్ర ఘోషలాగ
అనంతవేదనాకాశంలాగ
మనిషిమీద కత్తిగట్టిన మహమ్మారిలాగ
కన్నీళ్ళ జడివానలాగ
వర్తమానం భయపెడుతున్నది
ఎన్నడీనెత్తురుజడివానకు ముగింపు?
ఈ వర్తమానవేదనాకాశంలో
మన భవిష్యత్‌సూర్యుడు పొడిచేదెన్నడు?

2

[redacted] ఒక ఆశ్వాసం

నెత్తురు చిత్తడి చూసినపుడు
కన్నీళ్ళు ఒత్తుకోవడం సహజమే
బతికున్న గుండెల్లో నెత్తుర్లు పొంగడం భావ్యమే
గుండె కాసేపు కుంగిపోవడమూ తప్పదు
ఆ నెత్తురు మట్టిచేతులు మట్టిముంతలో
పంచుకున్న గటకతిని దప్పితాగిందయితే
ఆ నెత్తురు మన చూరుకింద దీపంనీడలో
మన సుఖదుఃఖాలు పంచుకున్నదయితే
మన కూలిగింజలు, మన కూరాడు
మన పిల్ల మనమేక మనగొడ్డు మనకొట్టం
మన గోడు మనబడిగా చెప్పిందయితే
మన బడుగు బతుకులకు
అదివేకువ నెత్తుటి మడుగయితే
మనం కన్నీళ్ళ జడివాన అవుతాం నిజమే
మరి జడివాన తెచ్చే వరద సంగతి ఏమిటి?
వరదతెచ్చే అలజడి సంగతేమిటి?
శత్రువు హత్య దేన్నిదాస్తున్నది
సత్యాన్ని
ఏది ప్రకటించి ఏది దాస్తున్నాడు
మన తాత్కాలికనష్టాన్ని ప్రకటించి
తన గుండెకూ పేగుకూ ముడిపడ్డపిరికితనాన్నిదాస్తున్నాడు
వార్తలన్నీ ఆశను ధ్వనించినపుడు
వార్తల్లో నిరాశకాదు నిర్బంధం ధ్వనిస్తుంది.
పుష్పించే భవిష్యత్తు ప్రసవ వేదనను
రక్తలేఖలుచూసి పోల్చుకోవడం నేర్చుకోవాలి
సాయంత్రం చీకటవుతుంది
చీకటిని నక్షత్రాలు వెలిగిస్తాయి

మినీకవిత - ఒక పరిశీలన

'జిజ్ఞాసి'

గత కొద్ది కాలంగా 'మినీకవిత' అన్న మాట వినిపిస్తున్నది. పత్రికలలో చిన్నకవితలు ఎక్కువగా వస్తున్నాయి- ముఖ్యంగా ఆంధ్రజ్యోతి పత్రికలో. తెలుగు దేశంలో అక్కడక్కడా మినీకవితలపై చర్చలు, ప్రదర్శనలు, పుస్తకాలు రాయటం జరుగుతున్నది. కవిత్వంపై అభిరుచిఉన్న చదువుకున్న యువకులు చిన్న చిన్న కవితలను రాయటం మొదలుపెట్టారు. అసలు ఈ మినీకవిత ప్రచారంలోకి రావటానికి తోడ్పడిన అంశాలేమిటో చర్చించవలసిన అవసరం మనకున్నది. ముఖ్యంగా మినీకవిత వ్యాపార నాగరికతా ప్రతిఫలం. ఎందుకంటే పత్రికలవాళ్ళ వ్యాపార దృక్పథం వల్లనే మినీకవిత పుట్టుకొచ్చింది. రెండవది ఉద్దేశ్యపూర్వకంగా ప్రజలు ఆదరిస్తున్న ఒక ప్రక్రియను పడగొట్టడానికి నిశ్చయించుకోవడం. ఇందుకు పత్రికలను, ప్రదర్శనలను, సమావేశాలను, పుస్తకాలను ఆధారంచేసుకొని విప్లవ కవిత్వానికి ప్రజల్లో వ్యాప్తిచెందాల్సిన అవసరం పోయిందని ప్రచారం సాగించడం. మూడవది కేవల ప్రయోగకుతూహలం విప్లవ కవిత్వం. ప్రజల్లో సృష్టిస్తున్న చైతన్యాన్ని మరొక రూపాన్ని వెలుగులోకి తేవడంద్వారా అడ్డుకోవటానికి చేస్తున్న వ్యర్థప్రయత్నాలే ఈ మినీకవిత రావడానికి కారణం.

రూపాన్ని ఆధారంచేసుకొని 'సైజు'ను నిర్ణయించడం ద్వారా 'మినీకవిత' భావ వ్యక్తీకరణ చేయగల్గుతోందా అన్న విషయంపై 'మినీకవితోద్యమకారుడు' అద్దేపల్లి రామమోహనరావు రాసిన 'మినీకవిత' అన్న ప్రచారపుస్తకాన్ని చర్చించడమే ఈ వ్యాసలక్ష్యం.

ప్రభాతం రక్తనదిలో ప్రభవిస్తుంది.
ప్రభాతాన్ని పసిగట్టిన రాక్షసి
మనిషిమీద కత్తిగట్టి అహంకరిస్తాడు
మనిషి మేల్కొంటున్నాడని
రాక్షసి పసిగట్టిన జాడలు
మన మనసుమీద పరచుకున్న ఈవార్తల క్రీనీడలు
మనిషి మేల్కొంటాడు
రాక్షసీలేదు కత్తిలేదు
మనుషులుచేసిన త్యాగాలనెత్తురు
కొత్తరూపంలో మానవత్వం వికసిస్తుంది.

కవిత్వానికి సైజు ఒకరునిర్ణయిస్తేరాదు. భావాన్నిబట్టి, విషయాన్నిబట్టి, కవి స్పందననుబట్టి కవిత్వం వెల్లడవుతుంది. అది చిన్నగావుండవచ్చు- పెద్దగాఉండవచ్చు. ఒక విషయానికి స్పందించిరాసేవాడు 'సైజు'ను దృష్టిలోపెట్టుకోడు. 'సాధ్యమైనంత శక్తిమంతంగా' కవిత్వాన్ని వెల్లడిచేయాలని అద్దెపల్లి మినీకవితగురించి అన్నారు. కవిత రాసేటప్పుడు వచ్చిన భావాలన్నీ కుదించుకుంటూ రాయాలని అద్దేపల్లి అభిప్రాయంకావచ్చు. భావాలను భాగాలుగా తనకుతోచినట్లు మార్చేవానికి ఒకరు నిర్దేశించిన నియమాలుండవు. ఎక్కువమంది ప్రజలకర్థంకావాలనేకదా, పాట ఇతర ప్రజాకళారూపాలు ఈనాటి తెలుగుసాహిత్య ప్రధానరూపాలయ్యాయి.

సాహిత్యంలో రూపం ప్రధానమైనదంటూ అద్దేపల్లి రామమోహనరావు ఈరూపంమీద ఏకాగ్రతచూపిస్తే వస్తు ప్రాధాన్యవాదానికి భంగంకలిగిస్తుందేమోనన్న భయం తుమ్మితే ముక్కు ఊడిపోతుందేమోనని భయపడ్డంలాంటిది" అనిఅన్నారు. సాహిత్యంలో రూపం వస్తువునుబట్టి స్థూలంగా నిర్ణయించబడుతుంది. రూపం, వస్తువుకూడా సమాజాన్నిబట్టే నిర్ణయించబడతాయి. సాహిత్యంలోమార్పులు వస్తువులో ప్రధానంగా శిల్పంలో దానికనుగుణంగా కనబడతాయి. కాని వాటికికారణం వస్తుశిల్పాలుకావని అద్దేపల్లి గ్రహించాలి. కవిత్వంలో రూపాల మార్పులవల్లా, భాషలో మార్పులవల్లా వచ్చేమార్పులు నిజమైనమార్పులుకావు. ఈ మార్పులకు మూలం ఉత్పత్తి సంబంధాలమధ్య ఘర్షణలోవుంది.

అట్లాగే మినీకవితద్వారా అద్దేపల్లి సాధిస్తానంటున్న అనుభూతి సమానత్వమనేది ఆయనచెప్పిన వర్ణవర్గ లింగాదిభేదాలు లేకుండాఉంటవు. వర్గసమాజంలో అనుభూతి పాక్షికము. అనుభూతి, హృదయంతో వర్ణించడంఅని అద్దేపల్లి చెప్పిన పదాలు పాఠకునికి అవగాహనలో అస్పష్టతనుకలిగిస్తాయి. వర్గసమాజంలో కవి అనుభూతికి సామాజికమైన పునాది ఉండవలసిన 'పని'లేదు డనుక అనుభూతి అకవిత్వం వ్యక్తులమధ్య సామాజిక సంపర్కాన్ని సాధించటంలో, వర్గపోరాటలక్ష్యం ప్రతిపాదించటంలో విఫలమవుతుంది.

'రాజకీయపరిష్కారంతో సాహిత్యం మమేకంకావటంవల్ల నిరంతర చైతన్యశీలమైన సామాజిక సాంస్కృతిక విశాల ప్రాతిపదికను సాహిత్యం విస్మరిస్తుంది'అని అద్దేపల్లి అన్నారు. సమాజంకోసం కళను ఆయుధంగా వాడుకోవాలనుకున్నప్పుడు ప్రతి సామాజికసమస్యా ఆర్థికసమస్యలతో ముడివడిఉంటుంది. ఆర్థికపరిష్కారం రాజకీయపరిష్కారంతోనే ఉంటుంది. సాహిత్యం, రాజకీయం ఒకే ఆర్థిక పునాది

యొక్క ఉపరితలతరంగాలే. కనుక ఆర్థిక పునాదిలేని ఒక్కవాక్యమూ కవిరాయలేడు. సమాజంలో ఏచిన్న మార్పుఅయినా రాజకీయరూపాన్ని పొందుతుంది.

"1970 నుండి 1975 దాకా విప్లవ కవిత్వం తన సిద్ధాంతాల్ని తీవ్రంగా విస్తృతంగా ప్రచారం చేసింది. నూతన సిద్ధాంతాలతో సంఘంలో గొప్ప వికాసాన్ని తెచ్చింది 75 వచ్చేటప్పటికి ఇక అంత తీవ్రవ్యాప్తికి అవసరంపోయింది. ఇక ఆ సిద్ధాంతాలు సంఘంలో వర్క్ చేయడమే జరుగుతుంది. ప్రతి నూతనమైన భావవ్యాప్తికీ ఇదే సూత్రంవర్తిస్తుంది", అని అద్దేపల్లి తన తప్పుడు అవగాహనని స్పష్టంచేస్తున్నాడు విప్లవ రచయితల సంఘం రావటంతోనే విప్లవ కవిత్వం రాలేదు. విప్లవోద్యమంవల్ల విప్లవ కవిత్వం వచ్చింది, విరసం వచ్చింది. విప్లవకవిత్వం 1970 లో నూతనంగా సృష్టించబడిన కవిత్వంకాదు. విప్లవ కవిత్వం సమాజంలో దోపిడీని ప్రజలెప్పుడు గుర్తించడం మొదలుపెట్టారో అప్పటినుండి ఉంది. 1967లో ప్రారంభమైన నక్సల్బరీ పోరాట ప్రభావంతో విరసం ఆవిర్భావం జరిగింది. కేవలం విరసం మాత్రమే నూతనంగా విప్లవ కవిత్వాన్ని సృష్టించలేదు. అద్దేపల్లి ప్రతిపాదించిన విషయంలో ముఖ్యఉద్దేశ్యం విప్లవ కవిత్వం ప్రజలలో ఆదరణ కోల్పోయింది- మినీకవితకు ఆదరణ లభించడం మొదలయింది అని చెప్పడం. వర్గాలు, వాటిమధ్య ఘర్షణ ఉన్నంతకాలం విప్లవ కవిత్వానికి కాలదోషంపట్టదు.

మినీకవిత ప్రజాప్రయోగం, ప్రజల్లో దానికి వెల్లువలా ఆదరణ లభిస్తుందని అద్దేపల్లి ప్రచారం చేయడం ఎంతో హాస్యాస్పదంగా ఉంది. ప్రజలంటే కవిసమ్మేళనాలకు హాజరయ్యేవారుకారు. శ్రమజీవులైన కోట్లాది ప్రజలలో కలిసి వారి ఆవేశ ఆక్రందనలలో, కష్టసుఖాలలో పాలుపంచుకొని వాళ్ళబ్రతుకుకోంచి సృష్టించే సాహిత్యమే నిజమైన సాహిత్యం. వాళ్ళే నిజమైన ప్రజలు. కీర్తి కాంక్ష వ్యామోహితులై పట్నవాస, సామ్రాజ్యవాదసంస్కృతికి బానిసలై ప్రజలంటే ఎవరో తెలియకున్నా ప్రజాప్రయోగం చేస్తున్నామనడం భ్రమే అవుతుంది.

శిల్పవైవిధ్యంకన్నా శిల్పవైచిత్రి, శిల్పచాతుర్య పరిణామము ప్రధానమని అద్దేపల్లి అన్నారు. వస్తువుకన్నా వక్రోక్తి, అలంకారాలు ప్రధానమన్నమాట. మినీకవితలు సాముగరిడీల్లాంటివని అద్దేపల్లే ఒప్పుకున్నారనటానికి నిదర్శనం 'మినీకవితకు తాడుమీద నడిచేవాడికి ఉండే ఏకాగ్రతకావాలి' అని వారు చేసినవ్యాఖ్యే. తాడుమీద నడిచేవాడు తన గురించే ఆలోచించుకుంటాడు కాని ఇతరుల మీదికి ఏకాగ్రత మళ్ళించడు.

అట్లాగే మినీకవితకు ఉచ్ఛ్వాసం 'క్లుప్తత' నిశ్వాసం 'ధ్వని' అని రాసేకవి ప్రతిభను బట్టి ఎంతక్లుప్తతకైనా అవకాశం ఉందని ఆయన అన్నాడు. మరి మినీకవితలో అస్పష్టత, భాషాభేషజం ఉండదని అద్దేపల్లి ఎలాఅన్నారు? ఇలా అయితే నిజంగానే చదివిన తరవాత చాలాసేపు ఆలోచింపచేస్తుంది మినీకవిత 'దాని అర్థంఏమై ఉంటుందా అని.' చాలా కవితల్లో చివరిపంక్తి హృదయాల్లో హత్తుకుంటుంది కనుక దాన్ని మినీ కవిత అనుకోవాలని అద్దేపల్లి రాయటం ముగింపును చదివిన పాఠకుడు ప్రారంభాన్ని కూడా అర్థంచేసుకోవాల్నేమో అని అనిపించడానికి దారితీస్తుంది.

గురజాడ, గాలిబ్, శ్రీశ్రీ, ఆరుద్ర, బెల్లంకొండరామదాసు, గుడిహాళంలు మినీకవితలు రాశారని అద్దేపల్లి రాయడం, వాళ్ళ దీర్ఘకవితలు విడగొట్టి మినీ కవితలని ఉదహరించడం హాస్యాస్పదంగాఉంది. నిజానికి వేమన, గురజాడ మొదలైన కవులు తాము మినీకవితలు రాస్తున్నామని చెప్పలేదు. శ్రీశ్రీ 'కవితా ఓకవితా'ను మినీకవితలో చెప్పగలమా? అదేశ్రీశ్రీ 'అః' రాశాడు. కవి విషయం, స్పందనకు ప్రాధాన్యమిస్తాడుకాని 'సైజు'కు కాదుకదా!

పాఠకుని అవగాహనా సౌలభ్యాన్నిబట్టి రచయితల రచనాసౌలభ్యం ఏర్పడుతుంటుంది. కాని పెనుకటి పొడుపుకథల్లా నేడు మినీకవితలు చలామణి అవుతున్నాయి. మినీకవితలుఅనగానే చాలామంది తక్కువసమయంలో ఎక్కువకవితలు వ్రాయొచ్చు కదా అని అనుకుంటున్నారు. 'భార్యాభర్తల మధ్య కలతలు ఉంటే అందమైనమంచం అగుపించేదెంతే' లాంటి కవితలు రావడానికి కారణం 'మినీకవిత' అని 'మినీకవితా యుగం' అని చెవులు గిల్లుమనిపిస్తున్న హోరేఅని జవాబువస్తుంది.

విప్లవ కవిత్వం యొక్క ప్రధాన కవితా ప్రక్రియ అప్పటికీ ఇప్పటికీపాటయే. విప్లవ కవులు మినీకవితలు కవితాప్రక్రియగా ఎన్నడూ ఎంచుకోలేదు. విప్లవకవులైనా మరెవరైనా చిన్న కవితలు రాసినా, మినీ, బ్రీఫ్ అన్న దృక్పథంతో ఎప్పుడూ రాయలేదు. ఏ సాహిత్య ప్రక్రియయైనా ప్రజాజీవితంలోంచివస్తేనే అర్థం, ఆదరణ ప్రచారపుస్తకాలవల్లా, మినీకవితా ప్రదర్శనలవల్లా ఏమీరాదు. అది సాహిత్యప్రక్రియ అనికూడా అనబడదు. ఎంతోమంచి చిన్నకవితలు, ఇంకా చదవాలనిపించే పెద్ద కవితలూఉన్నాయి. అయితే చదివేవాడు విషయాన్నిబట్టి బలంగా చెప్పేపద్ధతినిబట్టి ఉత్తేజితుడవుతాడు కాని సైజు చూసికాదు, ఉద్యమాలు నడుపాలనుకుంటే స్వచ్ఛందంగా ప్రజాపోరాటాలలో పాల్గొంటూ ప్రజాసాహిత్యాన్ని సృష్టించడంకావాలి. అంతవరకూ మినీకవితకాదు, ఏ కవితా నిష్ఫలమే.

నగరం

హెచ్చార్కె

దృశ్యం - 1

"నగరం శోభాయమానంగా వుంది"ట

గజ్జిపిచ్చి కుక్కలతో కొట్లాడే
గోచిపాత కుర్రాళ్ళ తలలమీద
ఆకాశం కొక్కానికి వేళ్లాడే సైన్ బోర్డు
అటు కేసి పోయినప్పుడల్లా తెగ అరుస్తుంది.

పొద్దున్నే మాయింటికున్న ఒకేఒక
న్యూస్‌ప్రింట్ కిటికీ తెరవగానే
శవపేటిక మీది గులాబీలవాసన
గుప్పుమని కొడుతుంది.

క్యూలో నిలబడి తెచ్చిన రాళ్ళతో
అన్నం వండి పెడుతుంది
అనసూయను తలదన్నే మా ఆవిడ.

ఆఫీసు చెట్టుమీద ఫైలుకోతి
అటూ యిటూ వూగుతుంది
ఎర్రరిబ్బన్‌తో ఆడుకుంటుంది
కొమ్మవదిలిపోదు.

కనడానికి కలలేమీ మిగలనప్పుడు
మూడు రూపాయలు ఖర్చుపెట్టి
మూడుగంటల చావు కొనుక్కుంటా.

ట్యాంక్‌బండ్ కాడ మంత్రిగారు
ఒక బీచి కట్టిస్తానంటాడు
మనస్సును తన్ని, గుద్ది, అణిచి, మరీ నమ్మేస్తా.

ఆ ట్యాంక్‌బండ్ బెంచీమీదే కూర్చుని
కళ్ళముందే నీళ్లల్లోదూకిన పిల్లగురించి

కబుర్ల బిఠానీలు నముల్తూ గడిపి
వెళ్ళిపోతాం ఎవరి పీడకలల్లోకి వాళ్ళం.

పిల్లలు నిద్రపోయాక అమ్మలు
లీగల్‌గానే రేప్ చేయబడతారు
నిర్మానుష్యంగా కనిపించే
మసక మసక రోడ్లకింద
ఎందరెందరో ఎన్నెన్నో అమ్ముకుంటారు.

గడియారాలు తిరుగుతాయి
పగళ్ళు కరుగుతాయి
క్యాలెండర్లు చిరుగుతాయి
నగరం నీళ్ళలోపడిన బ్యాడ్మింటన్ బాల్‌లాగ
వుబ్బుతుంది.
నగర సముద్రం అంచులలో
పాడైపోయిన పూలెన్నో, కలలెన్నో
నుంగ, నురగగా- నిర్దయగా....

దృశ్యం - 2

గ్రామాల్నుండి వచ్చిన పళ్లూ, కూరగాయలూ,
చెమటతో తడిసిన శరీరాలేకాదు;
బ్యాలెట్ కాగితాలుతిని
బలిసిన గాడిదలేకాదు;
పైసాల పగుళ్ళలో ముఖాలుదాచుకునే
క్షణికసుఖాల బానిసలేకాదు;

నగరంపొట్టలో పొగగొట్టాలుంటాయి
పొగగొట్టాలక్రింద పెనుకొలిమిలుంటాయి.
కొలిములు సమావేశాలవుతాయి.
కన్నెర్రజేసిన పతాకాలవుతాయి.

విశ్వవిద్యాలయాల ముఖద్వారాలదగ్గర
"స్వేచ్ఛ అంతమవుతుంది"

విశ్వవిద్యాలయాల గర్భకుహరాల్లోంచి
ధిక్కారస్వరాలు కదనగీతం పాడుతాయి.
అర్ధనగ్నచిత్రాల్ని కప్పుతూ
సమర ప్రకటనలు గర్జిస్తాయి.

ఎరుకొచ్చిన రేకులూ, గోనెపాతలూ
కప్పుకుని, సకుటుంబంగా
రాత్రిళ్ళను తినిబ్రతికే శరీరాలు
నగరం నడిబొడ్డున
బిగిసిన పిడికిళ్ళయి మొలుస్తాయి.

వాహనాల ముఖాలు పగిలి
రోడ్డు అప్పుడప్పుడు గాయాలతో మెరుస్తుంది.
తూటాల వడగళ్ళవానలో
ఒకటి, రెండు, ఒక్కోసారివంద
శరీరాలు దొర్లుతాయి
ఒరిగిన శరీరాల్ని మోసుకుంటూ
అంతస్థుల పుట్టల్ని కంపింపిస్తూ
చీమల దళాలు నడుస్తాయి.

గోదావరిలోయ అడవుల్లో
వికసించిన మంటలు,
ఇంద్రవెల్లి, దత్తోజిపల్లెల్లో
గాయపడిన సూర్యుళ్ళు,
చీకటిగండ్ల, బస్తరుకోనల్లో
నెత్తురోడ్చిన నినాదాలు
నగరాన్ని ముట్టడిస్తాయి.

మంట దావాగ్నితో కలిసి మండుతుంది.
జేగంట గంటతో కలిసి మోగుతుంది.

పుస్తక సమీక్ష : స్పార్టకస్

జీవితాన్ని ప్రేమించవలసిన చోట...

జీవితానికి అర్థం ఏమిటి ? మనమెందుకు జీవిస్తున్నాం ? 'సుఖదుఃఖాలేవేవో వస్తూంచే తలదాలిచి ప్రపంచ పరిణామంలో ప్రయాణికులమై పరివ్రాజకులమై విహ్వలంగా వర్తించడమే'నా జీవితపరమార్థం ?

జీవితాన్ని ప్రేమించి, దానికోసం యుద్ధాన్ని ప్రేమించి, బానిస విముక్తికోసం సాగే సంకుల సమరాన్ని ప్రేమించి స్పార్టకస్ జీవితానికి సమాధానం చెప్పాడు. మహాఘనతవహించిన రోమ్‌సామ్రాజ్యాన్ని నాలుగేళ్ళపాటు గజగజలాడించిన స్పార్ట కస్ జీవితసార్థక్యాన్ని, మానవసారాన్ని దాదాపు మొదటిసారిగా మనుషుల అనుభవం లోకి తెచ్చాడు ఈ అవగాహన, ఈ నైశిత్యం ఆయనకు వర్గపోరాట క్రమంలో వచ్చినవే. చరిత్రకెక్కిన తొలివర్గపోరాటయోధుడు స్పార్టకస్.

మనకు తెలిసిన యూరప్‌చరిత్రలో మొదటివర్గసమాజం బానిససమాజమే. ఒకవ్యక్తో, ఒక బృందమో మరోవ్యక్తికో మరో బృందానికో లోబడి నిర్బంధంగా శ్రమించడాన్ని అంగీకరించే సాంఘికధర్మం బానిసత్వపు ప్రధాన లక్షణం. మానవ సమాజం వేట, ఆహారసేకరణ దశలలోఉన్న నాటికి బానిసత్వంలేదు. వ్యవసాయదశలోనే బానిసశ్రమ దోపిడీ బాగాపెరిగింది. మనుగడకోసం వ్యవసాయం సాగినంతకాలం మామూలు స్థాయిలోఉన్న బానిసవిధానం చిన్నకమతాలు రద్దయిపోయి, పెద్దపెద్ద భూక్షేత్రాలు వెలసి మార్కెట్‌కోసం వ్యవసాయం చేయడం ప్రారంభమయాక విపరీతంగా పెరిగి పోయింది. యుద్ధాల్లో పట్టుబడ్డఖైదీలు, జయించబడిన నగరాల్లోని పురుషులు, స్త్రీలు, పిల్లలు బానిసలుగా మార్చబడ్డారు. యుద్ధంలేని శాంతిసమయాల్లో సముద్రపు దొంగలు విదేశాలమీద దాడిచేసి అక్కడి ప్రజల్ని ఎత్తుకొచ్చి బానిసలుగా అమ్మేవారు, ఇటలీలో, మెడిటరేనియన్‌లో జరిగిన యుద్ధాలు బానిసమార్కెట్లకు ఖైదీలను ప్రవహింపజేశాయి. కార్థేజ్‌తోయుద్ధంలో ఇటలీకి రెండులక్షలమంది ఖైదీలుగా తేబడ్డారు. ప్రాచ్యదేశాల మీద దండయాత్రలద్వారా రోమ్ ఐదులక్షలమంది బానిసలను సంపాదించుకుంది. క్రీ. పూ. రెండు, ఒకటి శతాబ్దాలలో రోమ్‌లో బానిసత్వం అత్యున్నతస్థాయికి చేరు కుంది. యుద్ధంలోకివెళ్ళితిరిగివచ్చిన చిన్నరైతులను వెళ్ళగొట్టి రోమన్‌కులీనులు పెద్ద పెద్దఎస్టేట్లను నిర్మించుకోవడంవల్ల వ్యవసాయానికి బానిసలు పెద్దసంఖ్యలో రాగి, వెండి, అవసరమయ్యారు. మరోవైపు గనిపనికికూడా బానిసలు అవసరమయ్యారు. బంగారం ఇనుము, తగరం గనుల్లో, చీకటికోనల్లో ఇరుకుసందుల్లోజొరబడి సంపదలుసృష్టించి

ఈబానిసలు రోమ్‌ను 'అద్యంతాలులేని మహానగరం'గా మార్చారు. ఒక్క న్యూకార్తేజియన్ స్పెయిన్‌లో వెండిగనుల్లోనే యాభై వేలమంది బానిసలు పనిచేసేవారని చరిత్ర చెపుతోంది. ఇట్లా బానిసలు సృష్టించిన 'భోగాలు, ఆనందయోగాలు, అనుభవిస్తూ చేయడానికి పనేమీలేని రోమన్ కులీనవర్గం కాలం గడపడానికి ఎన్నెన్నో వ్యాపకాలు కనిపెట్టింది. విలాసవంతమైన స్నానశాలల్లో గంటల తరబడి గడపడం, జూదం, అత్తరు సువాసనల్లో తేలిపోవడం లాంటి మామూలు వ్యాపకాలేగాక, రథాలపందాలు, గుర్రప్పందాలు లాంటి ఉట్టిహింసా వినోదాలేగాక, మల్లయుద్ధం లాంటి **అమానుష**మైన హింసావినోదాన్ని, పైశాచికక్రీడను రోమ్ తనకోసం సృష్టించుకుంది. సెనెటర్ గ్రాచూస్ ఈ రోమను స్వభావాన్ని స్పష్టంగానే చెప్పుకున్నాడు. "....సహజమైన సంతోషానికి బదులు కృత్రిమమైన వినోదాన్ని ఆరాధిస్తాం. ప్రతి వినోదమూ కొన్నాళ్ళకి పాతబడిపోతుంది. అది పాతబడ్డాక మరొకకొత్తది. ఇంకా ఇంకా వినోదమైనది, మరింత ఆవేశజనకంగా ఉండేదికనిపెడతాం. మతిపోగొట్టుకునేటంత పశుత్వం పొందుతాం మేం....". ఐతే ఈ హింస రోమన్లు ఆనందించడానికేగాని తాము స్వయంగా అనుభవించడానికిగాదు- మళ్ళీ ఇందుకూ బానిసలేకావాలి- వీరోచితంగా పోరాడగలిగిన బానిసలను ఎంపికచేసి మల్లులుగా మార్చేవాళ్ళు- మల్లయుద్ధం ఒకవేలం వెర్రిగామారిపోయి రోమ్‌నిండా మల్లయుద్ధరంగస్థలాలు, శిక్షణశాలలు అల్లుకుపోయాయి వేలమంది బానిసలు ఈ రంగస్థలాల్లో, శిక్షణశాలల్లో రోమన్ల ఆనందంకోసం ఒకరినొకరు పొడుచుకు చంపుకునేవారు.

ఇలాంటి మల్లుల్లో ఒకడే స్పార్టకస్- క్రీ. పూ. 74 నుంచి 71 దాకా 'రోమన్ పాలన క్రిందవున్న ఆక్రమిత ప్రాంతాలన్నిటినీ, రోమన్ రిపబ్లిక్కునీ కూకటి వేళ్ళతో కదిల్చిపారేసిన' బానిస విప్లవ నాయకుడు స్పార్టకస్- "ఉత్తముడు, యోధుడు మాత్రమేకాదు, అవగాహనలోను, మంచితనంలోను తన స్థితికి మించినవాడు" అని క్రీ. శ. మొదటి శతాబ్దపు తత్వవేత్త, చరిత్రకారుడు ప్లుటార్క్ ప్రశంసించిన స్పార్టకస్ ఇటలీ బానిసలందరికీ విప్లవిస్తే జయంమనదని పిలుపిచ్చాడు- పశుస తటిపాలనను కూల్చమని పిలుపిచ్చాడు- స్వేచ్ఛకోసం, ప్రతీకారం కోసం అర్రులు చాస్తున్న డెబ్బై వేలమంది బానిసలు వెంటనే అతని నాయకత్వంకింద చేరారు. అతనివిజయాలు ఇటలీ బానిస యజమానులను, ధనికులను భయంలోముంచినవి, బానిసలలో ఆశలునింపినవి,

'ఎంతోమంది అతనిసైన్యంలో చేరవచ్చారు కానీ లక్షాఇరవై వేలమంది తన సైన్యంలో చేరినతర్వాత ఇకకొత్తగా చేర్చుకోవడానికి నిరాకరించాడు. ఆయన తన

సైన్యంతో ఇటలీలో లాంగ్‌మార్చ్‌చేశాడు" అని విల్‌డ్యురాంట్ రాశాడు. కాని మహోన్నతమైన రోమన్‌శక్తి ముందు బానిససైన్యం నిలువలేకపోయింది. అధర్మం ముందు ధర్మం నిలవలేకపోయింది. హింస, అవినీతి, పీడన, అమానుషత్వం, బానిసత్వం నిండిన పాతసమాజపు పశుబలంముందు స్వేచ్ఛాస్వాతంత్ర్యాల నూత్న సమాజపు స్వప్నం నిలువలేకపోయింది. మృత్యువునుప్రేమించే రోమ్‌చేతిలో జీవితాన్ని ప్రేమించే స్పార్టకస్ ఓడిపోయాడు. చరిత్రకాలగర్భంలో కలిసిపోయేందుకు మహాసేనాని మార్కస్ లిసినియస్‌క్రాసస్ గెలిచాడు. మానవజాతిస్మృతిలో ఎల్లవేళలా నిలిచిపోయేందుకు స్పార్టకస్ ఓడిపోయాడు. కేపువానుంచి రోమ్‌వరకుపోయే ఏపియన్ రాజమార్గం పొడవునా ఆరువేలమంది బానిసలు శిలువవేయబడ్డారు. యజమానులందరూ భద్రత అనుభవించడానికీ, బానిసలందరూ భీతావహులు గావడానికీ శిలువలమీద ఆ మృతశరీరాలు కొన్నినెలలపాటు వేలాడదీయ బడ్డాయి.

ఈ మహత్తర పోరాటాన్ని, చరిత్రకెక్కిన తొలి వర్గపోరాటాన్ని స్పార్టకస్ ద్వారా, స్పార్టకస్ జీవితంద్వారాతప్ప మరొకవిధంగా మనం అర్థంచేసుకోలేం. ఎందుకంటే ఈ పోరాటానికి జీవితం స్పార్టకస్. స్పార్టకస్ జీవితం ఈపోరాటం. రోమ్‌ను గజగజలాడించిన విద్యుద్వలయం స్పార్టకస్ నరాలతీగలు సృష్టించినది. రోమ్‌ను అల్లకల్లోలంచేసిన బానిసయుద్ధవ్యూహం స్పార్టకస్ మేధ ఊహించినది. బానిస శక్తినంతటినీ పీడిత శక్తినంతటినీ ఎక్కుపెట్టి రోమ్‌పైకి సంధించినయోధుడు స్పార్టకస్. అమానుష సాంఘిక ధర్మపు రథచక్రపుటిరుసులలోపడి నలిగిన బానిసల రక్తచేతనం స్పార్టకస్. సంపదనే కాదు భయాన్ని సృష్టించగలమని, ఆద్యంతాలులేని మహానగరాలనేకాదు ఆశను నిర్మించగలమని, రక్తసిక్తదేహాలు రేపు రక్తంకార్చనవసరం లేని సమాజాన్ని తేగలమని, అశ్రుసిక్తనేత్రాలు భావిసుందరస్వప్నాలు కనగలవని, ఆ కలలు నిజం చేసుకోగలమని బానిసలకు తెలియజెప్పినమేధావి స్పార్టకస్.

స్పార్టకస్‌ను నాటి వాతావరణంతోసహా పునర్నిర్మించిన ఘనత హోవార్డ్ ఫాస్ట్‌కేదక్కుతుంది. ఫాస్ట్ 1914లో న్యూయార్క్‌లో జన్మించాడు. కాలేజీకిపోవడం ఇష్టంలేక దక్షిణాదికి పారిపోయినఫాస్ట్ త్వరలోనే జేబులో పైసాలేనిస్థితిలో న్యూయార్క్‌కు తిరిగివచ్చాడు. అప్పటినుంచి బతుకుతెరువుకోసం అమెరికాఅంతాతిరిగాడు, చేయగలిగిన పనులన్నీచేశాడు. ఆయనరాసిన మొదటినవల 'టువాలీస్' 1933లో ప్రచురితమైంది. అప్పటినుంచి రచననే జీవికగాచేసుకున్న ఫాస్ట్ 1943లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయాడు. 1951లో స్పార్టకస్‌రాయడం పూర్తిచేశాడు. 1953లో స్టాలిన్

బహూమతి పొందాడు- కమ్యూనిస్టుపార్టీ నాయకత్వపు పెత్తందారీతనానికి విసిగిపోయి, నాయకత్వపు పెత్తందారీతనానికీ, కమ్యూనిజానికీ తేడా గమనించక ఫాస్ట్ కమ్యూనిజానికి దూరమయ్యాడు. 1956లో కమ్యూనిస్టుపార్టీనుంచి విడిపోయి కమ్యూనిస్టు వ్యతిరేకనవలలు రాశాడు. "ప్రతిరచయితా తనజీవితంలో ఎన్నడో ఒకనాడు తన మనోభావాలు, జ్ఞానం, జీవితానుభవాల అట్టడుగులోతులనుంచి ఒకరచనను నిర్మిస్తాడు. నాకు అప్పుడూ, ఇప్పుడూకూడా స్పార్టకస్ అలాంటిపుస్తకం. అది నా అస్తిత్వానికి ప్రతీక" అని ఫాస్ట్ 1957లో చెప్పుకున్నాడు.

ఈ నవలలో ఫాస్ట్ మనకు వేరువేరు పాత్రలద్వారా స్పార్టకస్‌ను అర్థంచేయించే ప్రయత్నంచేస్తాడు.

రోమ్‌మీద యుద్ధం ప్రారంభించిన స్పార్టకస్ మొదలు రోమ్‌కు అర్థంకాలేదు. అసలు రోమ్‌కు స్పార్టకస్సేకాదు, పీడకవర్గానికి పీడితవర్గం తలపెట్టేయుద్ధం అర్థం కాదేమో ! వాళ్ళకుతెలిసినవి వేరేరకంయుద్ధాలు. మహాసేనాని క్రాసస్‌మాటల్లో "ఈ బానిసలు వీళ్ళకు యుద్ధమేమిటి ? నాకర్థంకానిదల్లా ఈ బానిస ప్రకటించిన యుద్ధమే. ఎందుకు వీడికీయుద్ధం ? ప్రపంచంలోని చెత్తసంతటినీ, అల్లరిమూకనంతటినీ, అలగా జనాన్నందరినీ కూడగట్టుకొని మరేఇతరదేశమూ సృష్టించలేని, గర్వించదగ్గ అద్భుతమైన రోమన్‌సైన్యాన్ని వీడెందుకు నాశనం చేయతలపెట్టేడు ?...." అయితే స్పార్టకస్ తలపెట్టిందేమిటో కొంతలో కొంతయినా గుర్తించినవాడు తాత్వికుడు సిసిరో. "125 సంవత్సరాలక్రితం ఇది ప్రారంభమైంది. మనం నిర్బంధంలో ఉంచినకార్తేజీనియన్ బానిసలతిరుగుబాటు దీనికినాంది. అటుపిమ్మట రెండుతరాలు గడిచాక గ్రీస్‌లోని లారియమ్ గనుల్లోజరిగిన బానిస మహావిప్లవం, ఆ తర్వాత స్పెయిన్‌గని పనివాళ్ళ బ్రహ్మాండమైన విప్లవం, పిమ్మట కొద్దిసంవత్సరాలకే మన రిపబ్లిక్‌నే కూకటివేళ్ళతో కదిల్చిపారేసిన సిసిలియన్ బానిసలతిరుగుబాటు, ఆ తర్వాత ఇరవైసంవత్సరాలకు సాల్వియస్‌అనే బానిసనాయకత్వాన జరిగిన తిరుగుబాటు, బానిస యుద్ధాలనేసరికి మనం సాధారణంగా చెప్పుకునే యుద్ధాలివి. వీటిలో ఒకదానికీ మరొకదానికీమధ్య ఎన్నెన్ని చిన్నచిన్న తిరుగుబాట్లు జరగడంలేదు ? ఎంత సంక్షోభం వ్యాపించడంలేదు? ఇదంతాకలిసి మనకూ మన బానిసలకుమధ్య జరుగుతున్న ఎడతెగని పోరాటం, నిశ్శబ్దంగా సాగిపోయ్యేయుద్ధం. మనం సిగ్గుపడాల్సినయుద్ధం.... అది ప్రపంచంలో ఒక అధునాతనశక్తి. రెండుదేశాలమధ్య యుద్ధాలుండేవి. రెండుపట్నాలమధ్య యుద్ధాలు జరిగేవి. రెండుపార్టీలుపడక పోట్లాడుకచచ్చేవి. ఆకరుకు ఇద్దరుసోదరులు కొట్టుకునే

వారు. కాని ఇదో– ఇది మననావహించిన బ్రహ్మరాక్షసి. మన నరాల్లోనూ ఉంది ఇది. అన్నిదేశాలకు వ్యతిరేకంగా, అన్నిపట్టణాలకు వ్యతిరేకంగా, అన్నిపార్టీలకు వ్యతిరేకంగా, సాగుతోందిఇది.... సిసిరో ఈమాత్రమైనా తెలుసుకున్నాడుగాని పాతవ్యవస్థను సమూలంగా నిర్మూలించ తలపెట్టిన పోరాటం వాళ్ళకుకొత్త. తొంభైతొమ్మిది డిగ్రీలపాటు తెలియని వేడి ఒక్కసారి మసలడం ప్రారంభంకాగానే వాళ్ళు బెంబేలు పడతారు. "బానిసలకు కూడా అంతపరిజ్ఞానం ఉంటుందంటారా?" అని ఆశ్చర్యపోతారు. "బానిసలలో మానవత్వపు ఛాయలేఉండవని వారినమ్మకం" స్పార్టకస్ అకస్మాత్తుగా పేలినట్టు కనిపిస్తాడేమోగాని ఎంత పీడననను భవించి, ఎంత అనుభవం తర్వాత, ఎంత ఘర్షణతర్వాత, ఎంతజ్ఞానంతర్వాత అట్లాపేలాడో తెలుసుకుంటే గుణాత్మకమార్పు ఎంతసహజంగా, ఎంతవేగంగా గంతులాగావస్తుందో అర్థమవుతుంది.

స్పార్టకస్ ఒక'కోరా'. అంటే మూడుతరాలబానిస. అతనిజీవితం మనకుతెలిసి న్యూబియన్ ఎడారిలోని బంగారుగనుల్లో మొదలవుతుంది. ఆ ఎడారిమనుషులు బతకడానికి వీల్లేనిది. అక్కడ "..వాయుప్రసారం స్తంభిస్తుంది భూమిచచ్చిపడి ఉంటుంది. గాలిమాత్రం ఉంటుంది. మనిషిశరీరం అక్కడపనిచేయదు" అలాంటిచోట రోమ్ బానిసలతో పని చేయించింది. బానిసలకుతెలిసింది ఈ శ్రమమాత్రమే. వాళ్ళకుతెలిసిన భూగోళశాస్త్రమంతా తమశ్రమను తుదిదాకాపిండుకునే ప్రదేశాలే. వాళ్ళకు "పర్వతాగ్రాల కొలతలు తెలియకపోవచ్చు. నదులు, అవి ప్రవహించేప్రాంతాలు వాళ్ళకు అంతుబట్టని విషయంకావచ్చు. సముద్రాల సరిహద్దులు వాళ్ళకు తెలియకపోవచ్చు. దేశజనాభా లెక్కలు వాళ్ళు లెక్కకట్టలేకపోవచ్చు. కాని స్పెయిన్ దేశపు వెండిగనులు, ఉత్తరాఫ్రికా ఇనుపగనులు, అరేబియా బంగారుగనులు, గాల్ దేశపు తగరపుగనులు, కాకసస్ కొండలనడుమనున్న రాగిగనులు– వీటిగురించి బానిసలకు బాగాతెలుసు...."

"కాలమూ, వైశాల్యమూ సరిహద్దులులేక ఇక దీనికంతులేదా" అని భయపెట్టే న్యూబియన్ ఎడారికి మెడలకు గొలుసులు వేసి తోలుకురాబడ్డ నూటఇరవైఇద్దరు (మూలంలో నూటఇరవైఇద్దరే, అనువాదంలో నూరఇరవై ముగ్గురయ్యారు!) థ్రేషియన్లలో పన్నెండోవాడు స్పార్టకస్. "అతను పెద్దమనిషితరహాగా, చాలా పెద్ద మనిషి తరహాగా, విధేయుడుగా కనబడే థ్రేషియన్.... ఏమంత పొడుగయిన మనిషి కాడు. నల్లగా ఉంగరాలుతిరిగినజుట్టూ, గోధుమరంగు కళ్ళూ. అతనిముక్కు ఎప్పుడో పగిలింది" అంటాడు స్పార్టకస్ గురించి బేటియాటస్.

"...అతనో మామూలుమనిషి ప్రేమతోనిండిన హృదయుడతను. మృదువైన, సరళమైన, ధారాళమైన స్వభావంకలవాడు. తన సహచరులనతను హృదయపూర్వ

కంగా ప్రేమించేవాడు. వాళ్ళు ఒకరినొకరు కలుసుకున్నప్పుడల్లా ఒకరునొకరు ఆప్యాయంగా కౌగిలించుకొని ముద్దుపెట్టుకొనేవారు...." అంటుంది వరీనియా.

ఇలాంటి స్పార్టకస్ ఇరవైమూడోఏట భయంకరమైన న్యూబియన్ బంగారు గనుల్లోకి తోలబడ్డాడు. అక్కడశ్రమలో, నిరంతర జీవనసంఘర్షణలో స్పార్టకస్‌లో ఆలోచన పుష్పించింది" ఎప్పుడైనా జన్మానికి ఓశివరాత్రిలా ఆలోచిస్తేచాలు స్వతంత్రుడైన మనిషి బతగ్గలడు. కానిప్రతిక్షణం, అనునిత్యం, ఆలోచిస్తేనేగాని బానిస బతకలేడు" తనతో శ్రమచేయిస్తున్న వాళ్ళగురించి ఆలోచించడం ప్రారంభించాడు స్పార్టకస్. "వాళ్ళెవరు?" అనేప్రశ్న ఉదయించిందతనిలో. 'మానవుల శరీరాలపై సంగీతాన్నాలపించి మూర్ఛనలుపోగల కొరడా' దెబ్బలకింద స్పార్టకస్‌లో కొరడాలు లేని సమాజస్వప్నం ప్రారంభమైంది. ఈప్రశ్న, ఈఆలోచన సహజంగానే ఇంకా ఉన్నతమైన ఆలోచనకు దారితీసింది. 'వాళ్ళెవరు'అని ఆలోచించడం మొదలుపెట్టిన స్పార్టకస్ తనవాళ్ళెవరోకూడా తెలుసుకున్నాడు. ఐతే తనవాళ్ళను తాను కలుసుకోగూడని క్రూరమైన సాంఘికధర్మం, సాంఘికసంబంధాలను అంగీకరించని సాంఘికధర్మం అమలవుతున్నదక్కడ. పీడకవర్గం పీడితులమధ్య అన్యోన్యసంబంధాన్ని హర్షించదు, తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. మనిషికీ మనిషికీ సంసర్గంతో మనిషి ఎదుగుతాడుగనుక ఒక మనిషికి మరోమనిషికి కలవనివ్యవస్థను సృష్టించి వాళ్ళు ఉత్పత్తిచేసే సంపదననుభవిద్దామని పీడకులఆలోచన. స్పార్టకస్‌లో ఖచ్చితంగా వ్యతిరేకమయిన ఆలోచన మొదలైంది. "స్పార్టకస్ తనజాతికేసి, తనమందకేసి తెల్లబోయి చూసేడు. 'మాట్లాడండి' అతనిలో అతనుకొన్నాడు. 'ఒకళ్ళతో ఒకళ్ళెందుకు మాట్లాడగూడదో!' వాళ్ళుమాట్లాడరు. మృత్యువులా మౌనంగా ఉంటారువాళ్ళు. 'నవ్వండి' అతనిలో అతనే తర్కించుకుంటాడు. కాని ఎవ్వరూనవ్వరు."

ఈ మృత్యువు అంచుమీదిజీవితంలో స్పార్టకస్‌కు జీవితసౌందర్యం అవగాహన అయింది. జీవనరహస్యం తెలిసిపోయింది. "తను చావకూడదు. అందుకే అతను అలవాటుపడుతూ, అవసరమైనట్లుసాగుతూ, పరిస్థితులకు దాసుడౌతూ, వాతావరణానికి అనుకూలంగా మారుతూ, అదేసమయంలో ఇదంతా గ్రహిస్తూ జీవిస్తున్నాడు. జీవిస్తూ గ్రహిస్తున్నాడు" ఈ కష్టాల కన్నీళ్ళ వాస్తవంలోనుంచి స్పార్టకస్‌కు భవిష్యత్తు స్ఫురించింది. "అంతాబాగుపడుతుంది" అనే నిశ్చయంకలిగింది.

ఈ న్యూబియన్ ఎడారినుంచి స్పార్టకస్‌ను బేటియాటస్ కొనుక్కొచ్చుకున్నాడు. కేపువాలోని బేటియాటస్ మల్లయుద్ధ శిక్షణశాల అన్నిటికంటె పెద్దది. "అక్కడఇద్దరు

మల్లుల్ని పోరాడించడానికి ఖర్చయే సొమ్ముతో ఒక ఏనుగును కొనవచ్చునని చెప్పుకునేవారు. ఈ వర్తకంలో బేటియాటస్ ఒకలక్ష సంపాదించాడంటారు." ఆ శిక్షణ శాల మల్లయుద్ధాలకు పెట్టిందిపేరు. అసలు రోమ్‌నిండా ఈ మల్లయుద్ధ రంగస్థలాలు ఎక్కడచూస్తే అక్కడ పుట్టగొడుగుల్లా వెలిశాయి. "ఎంతచిన్న పట్నంలోనైనా పరే అధమం ఒక కర్రతో కట్టిన మల్లయుద్ధరంగస్థలమైనాలేని ఊరంటూలేదు."

అలాంటిచోటికి తీసుకొచ్చి, విపరీతంగా తిండిపెట్టి, మాలీసుచేయించి, చేతికి కత్తిఇచ్చి రోమన్ల ఆనందంకోసం రంగస్థలంమీద కొట్టుకుచావమన్నాడు బేటియాటస్. "ఎంత ఘోరమైనా గనిపని, పొలంపని రంగస్థలపుటిసుకలో నిలబడి మరొకభాగ్యుని హతమార్చడంకన్నా ఘోరంకాదు." తనుచేసే పనిలోని, తనతో చేయించబడే పనిలోని హైన్యం స్పార్టకస్‌కు అర్థమైంది. అది మాత్రమేకాదు; శ్రమను చిన్నచూపు చూసే, శ్రమను అసహ్యించుకునే వర్గసమాజపు స్వభావం స్పార్టకస్ అనుభవంలోకి వచ్చింది. "గోధుమ, బార్లీ, బంగారం మొదలైన మానవావసర వస్తూత్పత్తిలో తాను పాల్గొన్నంతకాలం తన శరీరం మురికితో అసహ్యంగా, అనవసరమైందిగా ఉండేది. ఉంచబడేది. కొరడాదెబ్బలకు, తన్నులకు, తాడింపులకు, మాడ్చిచంపడానికి తన శరీరాన్నుపయోగించేవారు. కాని ఇప్పుడు తనొక చంపే, చంపబడే జంతువుగా మారేడు కాబట్టి అశేషశ్రమతో భూమిలోతులనుండి తవ్వితీసిన మేలిమి బంగారంకన్నా విలువైనదిగా చూడబడుతున్నది అతని శరీరం...."

ఏక్షణం మృత్యువు కబళిస్తుందోతెలియని ఈ జీవితంలో స్పార్టకస్‌కు జీవితం మీద ప్రేమ మరింత ఎక్కువైంది, జీవితాన్ని ప్రేమించవలసిన అవసరం తెలిసింది. "జీవితం నిరర్థకంగా సాగుతున్నా దాన్నేపట్టుకొని వేలాడుతాడేం ప్రతివాడూ? తన కుటుంబంనుంచి, ఇంటినుంచి, దేశంనుంచి ఆఖరికి ఆశలనుంచి దూరమైన మానవుడు, ఇక ఆఇంటికి, ఆశలదేశానికి తిరిగిపోగల అవకాశమూ, సామర్థ్యమూ లేని మానవుడు దయాదాక్షిణ్య రహితంగా అవమానానికీ, అనాదరణకీ, బాధలకీ బానిస అయిన మానవుడు, ఇతరుల ఆనందంకోసం ఒకరినొకరు పొడుచుకు చంపుకునేందుకు శిక్షణపొంది జంతువులాబతికే మానవుడు, మానవుడైన జంతువు ఇంతటి ఘోరానికి గురియైకూడా జీవితాన్ని పట్టుకువేళ్లాడుతాడేం? బతుకంటే వ్యామోహం చూపిస్తాడేం?" "శూన్యంలోపుట్టి, గిట్టి శూన్యంలోనికేపోయే ఈ జీవితార్థం ఏమిటి? ఏమిటి దీని పరమార్థం?" ఈ ఆలోచన స్పార్టకస్‌ను రోమ్‌నుంచి వేరుచేసింది. సుఖమయజీవితాన్ని గడుపుతూ మృత్యువును ప్రేమించే రోమ్‌కు వ్యతిరేకంగా మృత్యువుకోరల్లో

నిలబడి జీవితాన్ని ప్రేమించే బానిసయోధుడు స్పార్టకస్ ఆవిర్భవించాడు. "స్పార్టకస్ సారాంశం కూడా జీవితమే. అతనిలోని ఆవిషయాన్ని గుర్తించారు ప్రజలు. బతుకుదామనే కోర్కెతారల వరకూ లేచిన ఉత్తుంగమైన అశాసౌధం....

బతుకును ప్రేమించడం ప్రారంభించాక స్పార్టకస్‌కు బతుకుకోసం చేయవలసిన యుద్ధం అర్థమయింది. ఆ యుద్ధంలో తనవైపు నిలుపుకోగల శక్తులను కూడగట్టవలసిన అవసరం తెలిసింది. "....స్పార్టకస్ ఎప్పుడూ ఒంటరిగా ఉండడు. తను నిర్మించుకున్న ఏగూటిలోనో ఏకాకిగా ఉండిపోడు. అదే అతనిలోని పరమాద్భుతమైనశక్తి"....అదే అతన్ని బానిసల నాయకునిగా మార్చింది. "....అంతా అతనిదగ్గరికి వచ్చేవారు, న్యాయనిర్ణయంచేయమని తేల్చిచెప్పమని. అతడు ఏ నిర్ణయించినా తక్కినవాళ్ళంతా దాన్ని పాటించేవారు. ఎప్పుడూ తలవంచలేదతను. బానిసలకిది కొత్త. ఎప్పుడూ కోపంగా మాట్లాడలేదు. స్వరంహెచ్చించలేదు. సంతృప్తి అతన్ని తక్కినవారినుండి వేరుచేసింది ...".

ఇక్కడా అదేనీతి. పీడితులు ఒకరితో ఒకరు కలవద్దు. వాళ్ళమధ్య సంబంధాలుండడానికి వీల్లేదు. "మల్లు! మల్లులసహవాసం కూడదు" అని వాళ్ళకెప్పుడూ చెప్పబడుతుండేది.

అయినా మల్లుడు మల్లుల సహవాసంమానలేదు. బరిమీదకుపోతున్న స్పార్టకస్‌ను కౌగలించుకొని ముద్దుపెట్టుకున్నాడు గేనికస్, అందుకుఫలితంగా తనపైకొరడాదెబ్బలశిక్ష అనుభవించవలసి ఉంటుందని తెలిసికూడా.

ఈ శిక్షణశాలలోనే స్పార్టకస్‌కు క్రిక్సస్ చెప్పేగాథలూ, ఆలోచనా, జీవితానుభవమూ తనపోరాటనేపథ్యాన్ని, భవిష్యత్తును స్పష్టంచేశాయి. బానిస మహావీరుల గురించి విన్నాడు. "....శిలువవేయబడ్డ గాల్‌లు, ఆఫ్రికన్లు, థ్రేషియన్లు, యూదులు, జర్మన్లు, గ్రీకులు మొదలైన వారిగురించి తెలుసుకున్నాడు. ఈ మహోద్రేకంలో ఒక నూతనమైన, బలవత్తరమైన మహాప్రవాహ ప్రతిబింబమొకటి గోచరించిందతనికి. అది భవిష్యత్కాలాలలోకూడా పొంగి, పొరలి ప్రవహించేదిగా తోచింది." "సాధారణంగా ప్రతిసాయంత్రమూ తల తలుపుకుచేరువగాపెట్టి పడుకొని బానిసత్వవిమోచనకై అర్ధశతాబ్దంనుంచీ ఎడతెరిపిలేకుండా సిసిలీలోజరిగే నిరంతరపోరాటగాథలను క్రిక్సస్ చెప్పగావినేవాడు." కేంద్రీకృత నాయకత్వంలేని ఫలితంగా వీరోచితమైన సిసిలియన్ బానిసలతిరుగుబాటు ఎట్లావిఫలమైందో స్పార్టకస్‌కు అర్థమైంది. సిసిలీ స్పార్టకస్‌కు ప్రేరణనుఇచ్చింది. హెచ్చరికనూఇచ్చింది. ఈ అనుభవాలతో "....మృతజీవనులై,

మృత్యుంజయులైన ఈ కామ్రేడ్స్ పేర్లు విన్నప్పుడల్లా ఆవేశంతో, ఉద్రేకంతో స్పందించేదతనిహృదయం. వారిమనసుల్లో మెదిలిన భావాలతనికితెలుసు. తనకు తెలుసు వారేకలలుకన్నారో. తనకుతెలుసు వారుసకలేంద్రియములతో ఏదివాంఛించారో...."

ఇతరుల ఆనందంకోసం చచ్చిపోవలసిన జీవనవిధానంలో వాళ్ళకు ఇంకోరకమైన చావుగురించి, మంచిబతుకుకోసం చావుగురించి, పుట్టుకకోసం చావుగురించి ఆలోచన వచ్చింది. ఇకఇన్నాళ్ళఆలోచన, ఇన్నాళ్ళ పరిణామాత్మకమార్పు గుణాత్మక మార్పుకు దారితీసింది.

"....'ఏమల్లునితోనూ నేనికదెబ్బలాడను' ప్రతిమాటా కూచిశాంతంగా చెపుతున్నాడు స్పార్టకస్." ఇక రోమన్‌ల ఆనందంకోసం మల్లునితో దెబ్బలాడదలుచుకోలేదు స్పార్టకస్. రోమన్ వేదాంతంవిని మల్లునితో సహవాసం మానదలుచుకోలేదు స్పార్టకస్. "కొంతమంది ఒక నిశ్చయానికివస్తారు, 'నేనుఫలానాపని చేయలేకపోతే నేనిక బతికిఉండాల్సిన అవసరంలేదు. దాని ప్రయోజనమూలేదు' చాలామంది ఈ నిశ్చయానికివస్తే పృథ్వికంపిస్తుది...."

అప్పుడుజరిగింది భోజనశాలలో సంఘటన. మల్లులు శిక్షకులను శిక్షించారు. ఒక్కతాటిమీద నిలబడ్డారు. ఇక భోజనశాలలోంచి బయటికివచ్చి సైనికులను ఎదుర్కోవాలి. సైనికులు పారిపోరని స్పార్టకస్‌కు కచ్చితంగాతెలుసు. భోజనశాలలోంచి నూతనసైన్యం, నూత్నప్రపంచపుసైన్యం బయటికివచ్చింది. సైన్యానికి ఎదురుగా నిలబడింది. "....ప్రపంచంలో ఏసైనికుడూ మల్లులతో సమానంగా నడవలేడు. మల్లులకు వేగమేజీవితం...." అలాంటి చురుకైన బానిససైన్యానికి, మహాఖ్యాతవహించిన రోమన్‌సైన్యానికీ యుద్ధం ప్రారంభంకాబోతున్నది. "....వాడియైన రోమన్‌మొనలకు ఎదురుగా మూకుమ్మడిగాపడి ఈ చెలకు ప్రాణాలుబలిఇచ్చి నశించిన సైన్యాలగాథలను విన్నాడుగనుక వాటి ఎత్తుగడల్లోని తప్పులను వివరంగా క్లుప్తంగా తనమనోనేత్రంతో చూడగలిగాడు" స్పార్టకస్. మొట్టమొదటి పోరాటంలో రోమన్ సైనికులు హతమైపోయారు. తొలివిజయం బానిసలను వరించింది "ఇప్పుడిక విశ్రాంతిఉండదు. ....మృత్యువులతోనిండిన, నెత్తుటితోతడిసిన ఆ రాజమార్గంలో నిలబడ్డ స్పార్టకస్‌కి బ్రహ్మాండమైన కల్లోలిత ప్రవాహాలపై స్వారీచేస్తున్నట్టనిపించింది నవ్వుతూకనబడ్డాడు క్రిక్సస్. విజయోత్సాహంతో కనబడ్డాడు గేనికస్. కత్తిపై నెత్తురు కళ్ళమెరిసే జీవంతోకనబడ్డాడు యూదుడు డేవిడ్. వాళ్ళభాషలో యుద్ధగీతాలుపాడు

కుంటూ ఆఫ్రికన్లు నిశ్చలంగానిలబడ్డారు." ఈ ఆనందంనుంచి, విజయోత్సాహంనుంచి "ఏకాగ్రతరగుల్లోని అతన్ని మార్చివేసింది. తన జీవితమంతా ఈ పనికే, అతని ప్రయత్నమంతా ఈపనికే అని ఉద్బోధించింది. శతాబ్దాలతరబడి అతడు నిరీక్షిస్తున్నాడు. ఆ నిర్ణయానికి మార్పన్నదిలేదు."

ఐతే ఈ విజయం ఈ ఎటుదారితీస్తుంది? ఈవిజయాన్ని నిలుపుకోవడమెట్లా స్పార్టకస్‌తోసహా బానిసలందరూ మొదలు పారిపోయారు. కాని అప్పుడు స్పార్టకస్‌కు వాస్తవం స్ఫురణకొచ్చింది- కేపువానుంచి సైన్యాలొస్తున్నాయి "....ప్రపంచంలో బానిసకు ఎక్కడా శరణ్యంలేదు- ప్రపంచం అలాతయారయింది- అలా తయారుచేశారు- తల దాచుకుందుకుచోటులేదు.... ఈ ప్రపంచం మారాలి, అంటే ఈ ప్రపంచాన్ని మార్చాలి పరిగెత్తడం ఆపాడు- చెప్పాడు 'సైనికుల్తో తలపడాలి మనం' " బానిససేనా నాయకుని అజ్ఞ అమలయింది- కేపువారక్షణదుర్గ సైనికులతో బానిసలు తలపడ్డారు. బానిసల చేతుల్లో కేపువాసైన్యం నామరూపాలు లేకుండా నాశనమైపోయింది- ఒక్కరోజు రెండు విజయాల్ని చవిచూశారువాళ్ళు- "ఆ క్షణంలో బానిసలందరూ కలల విమానాల మీద ఎగిరి స్వాప్నిక జగత్తులో విహరిస్తున్నారు-" "కాలం మొక్క ఉక్కుసంకెళ్ళన్నీ విదుల్చుకొని కానరాని భవిష్యత్కాలాన్ని చూడగలిగింది స్పార్టకస్ దృష్టి-" "మన మెక్కడికీ పారిపోం అని చెప్పాడు స్పార్టకస్- అతనికెప్పుడూ ఏమీ అనుమానం లేనట్టు, ప్రతిదీ ఖచ్చితంగా తెలిసినవాడిలా ఖండితంగా చెప్పాడు స్పార్టకస్- ప్రతి తోటకీ, ప్రతిఇ టికీపోదాం- అక్కడి బానిసలందర్నీ స్వతంత్రులనుచేసి మనలో కలుపుకుందాం రోమ్ మనమీదికి సైన్యాలను పంపితే వాటితో పోరాడుదాం... సైనికుల ఆయుధాలే లాక్కుందాం కావాలంటే వాటిని మనమే తయారుచేద్దాం.... "రోమ్‌ను అంతం చేద్దాం-" పాతను విధ్వంసం చేయడం మాత్రమేకాదు కొత్తదాన్ని నిర్మిద్దామన్నాడు స్పార్టకస్.

ఈ ఆశను నిర్మించే, భవిష్యత్ చరిత్ర నిర్మాతల జట్టు ఎట్లాంటిది? "....ఎటువంటి జట్టు వాళ్ళది! ఆ జట్టులో గాల్‌లు, యూదులు, యవనులు, ఈజిప్షియన్లు, థ్రేషియన్లు, న్యూబియన్లు, సూడాన్నీ, లిబియన్లు, పర్షియన్లు, అస్సీరియన్లు సమారియన్లు జర్మన్లు, స్లావులు, బల్గార్లు, మేసిడోనియన్లు, స్పేనియార్డులు.... ఇటాలియన్లు, సబైన్లు, ఆంబ్రియన్లు, టుసకున్‌లు, సిసిలియన్లు: చరిత్ర నుండి, భూగోళంనుండి తుడిచిపెట్టుకుపోయిన ఎన్నోతెగల" వాళ్ళతో వాళ్ళసైన్యం ఏర్పడింది ఒక్కమాటలో అది నూతనమానవసైన్యం- తిరుగుబాటు జెండా ఎగరేసిన బానిససైన్యం

శతాబ్దాల పీడననుంచి ప్రభవించిన విప్లవసైన్యం- "వాళ్ళు కసాయివాళ్ళుకారు, హంతకులూకారు, మానవులుగా బతకనేర్చిన, బతికిన సాధారణ మానవులు వాళ్ళు".

"బానిసల ఎముకల పునాదులపైలేచి, బానిసలమూపులపై నిర్మించబడ్డ" రోమన్ సాంఘికశక్తి "ఉచ్చరించే, ఆలపించే ఒకేఒక్క స్వరసమ్మేళనం కొరడావిసరిన కొసగాలుల సంగీతం, కొరడాదెబ్బల మూర్ఛనలగీతం" ఇంకెంతమాత్రమూ సాగడానికి వీల్లేదని ప్రకటించింది బానిససైన్యం. "మా ఒక్కళ్ళకోసమే మేం యుద్ధం చేయడంలేదు- ఈ ప్రపంచమంతటికోసం మేం పోరాడుతున్నాం" అని నిబ్బరంగా చెప్పుకోగలిగింది బానిససైన్యం.

బానిససైన్యం మొత్తం తొమ్మిదిసార్లు రోమన్ సైన్యాల్ని ఓడించింది, ఈ తొమ్మిది విజయాల కాలంలో వాళ్ళుబాగా రాటుదేలారు. ప్రస్తుతం తాము మునిగిఉన్న ఈ సమరం ముగిసినతర్వాత సమాజం ఎట్లాఉండబోతుందో, తామెట్లాంటి సమాజాన్ని నిర్మిస్తారో వాళ్ళకు స్పష్టంగానే తెలుసు, రోమన్లకూ, తమకూ తేడా తెలుసు వాళ్ళకి- అందుకే "రోమన్లు చేసినట్లుచేయొద్దు మనం. రోమన్ న్యాయాన్ని పాటించొద్దుమనం మన న్యాయశాస్త్రాన్ని మనమే తయారుచేద్దాం. మనధర్మం సాధారణమైంది మనలో ఎవరేది వశపరచుకున్నా అది అందరికీ చెందిన సమిష్టి ఆస్తి అవుతుంది. ఎవరూ తన బట్టలూ, ఆయుధాలూ తప్ప ఇకవేటినీ ఉంచుకోగూడదు.... భార్యని తప్ప మరేస్త్రీనీ ఉంచుకోగూడదు. ఒక పురుషునికి ఒకతే భార్య. భార్యాభర్తలిద్దరూ న్యాయందృష్టిలో సమానులే. వాళ్ళు సౌఖ్యంగా, శాంతియుతంగా జీవితం గడపలేకపోతే విడిపోవచ్చు. కాని ఏ మనిషీ రోమన్ స్త్రీనైనాసరే, మరేస్త్రీనైనాసరే భార్య అయితేతప్ప తన కామంకోసం ఉపయోగించగూడదు...." అని చెప్పాడు స్పార్టకస్. "బానిసలూ, యజమానులూ అనే తేడాలేకుండా, ప్రజలంతా కలిసిమెలిసి శాంతియుతంగా సోదరత్వంతో మనగల ప్రపంచాన్నికోరాడు స్పార్టకస్. రోమ్‌లోని మంచినంతటినీ తీసుకొని మనం చుట్టూప్రహరీ గోడలులేని మహానగరాలు నిర్మిద్దామని చెప్పేవాడు అప్పుడు ప్రజలంతా శాంతి, సౌహార్ద్ర, సమతాభావాలతో బతుకుతారు. అప్పుడీ ప్రపంచంలో యుద్ధాలనేవే ఉండవు దౌర్భాగ్యం ఉండదు. కష్టాలు కాపురంచెయ్యవు." అని స్పార్టకస్ కలను గుర్తుతెచ్చుకుంటోంది స్పార్టకస్ భార్య వరీనియా.

ఈయుద్ధంమధ్య నించే స్పార్టకస్ రోమ్‌కు సందేశంపంపాడు. పీడకవర్గానికి పీడితవర్గంనుంచి అందిన తొలితాఖీదుఅది. 'సభ్య'ప్రపంచానికి ఒక బానిస విసరిన సవాల్ అది, మహాఘనతవహించిన 'నాగరికత'కు ఆ నాగరికతా నిర్మాతచేసిన హెచ్చ

రిక అది. తమదిగెలిచేవర్గమని, పీడకులు చరిత్ర కాలగర్భంలో కలిసిపోకతప్పదనీ మొట్టమొదటిసారి పీడితవర్గం హెచ్చరించింది. వరీనియస్ గ్లాబ్రొస్‌నాయకత్వాన స్పార్టకస్‌ను అణచివేయడానికివెళ్ళిన ఆరుపటాలాలలో ఒక్కసైనికుడుమాత్రం మిగిలి స్పార్టకస్ సందేశాన్ని సెనేట్‌లో వినిపించడానికి తిరిగివచ్చాడు. స్పార్టకస్ పేరువిన గానే రోమన్ సెనేట్‌లో కెరటాలుగా భయంవ్యాపించి ప్రతివాడినీ ఆ భయసముద్రం లో ముంచెత్తింది. బానిసపంపిన సందేశాన్ని వినడానికి రోమన్ సెనేట్ సిగ్గుతో, అవమానంతో సంసిద్ధమైకూచుంది. స్పార్టకస్ చెప్పాడు "....వాళ్ళతో యీ ప్రపం చం విసిగిపోయిందనీ, ఈ ఛండాలపురోమ్, ఈ సెనేట్-వీటితో ప్రపంచం విసిగి పోయిందనీ మేమన్నామనిచెప్పు. కొరడాదెబ్బల సంగీతంవిని ఈ ప్రపంచం విసిగి పోయిందనికూడాచెప్పు.

....ఆపాట ఇకమేమెప్పుడూ వినదలచుకోలేదు, వినం. ఆదిమానవులందరూ ఒకలాగేఉండేవారు. వాళ్ళు శాంతియుతంగా జీవించేవారు. వాళ్ళకున్న ఆస్తినంతటినీ సమిష్టిఆస్తిగా పరిగణించేవారు. కాని ఇప్పుడు రెండువర్గాలున్నాయి.... ఒకరు బానిసలు వేరొకరు యజమానులు.... మేం మీకన్న బలవంతులం.... మానవుల్లోని మంచిఅంతా మానొత్తు. మాస్త్రీలను మేంగౌరవిస్తాం. వారి సరసనవిలిచి దుర్మార్గాన్ని ప్రతి ఘటిస్తాం.... మీస్త్రీలనుమీరు కులటలుగా తయారుచేస్తారు. మా స్త్రీలను జంతువులుగా చూస్తారు. మా పసిపాపలను మీరపహరించినపుడు మేం దుఃఖంలో కృంగిపోతాం. ఏడుస్తాం..... ఎంతనీచులుమీరు ? ఎంత ఏహ్యమైనవాళ్ళుమీరు ?.... మానవజీవితాన్ని ఎంతకలుషితం చేసేసారు మీరు ? మానవుడు కలలుకనే విర్మాణాత్మక కృషినిసల్పే మానవహస్తాలను, వానిచెమటను, వారి జీవస్రవంతియైన రక్తాన్ని మీరుపేళాకోళంగా వెక్కిరింతగా తయారుచేసారు. జీవితాన్ని అకటావికటంగా తయారుచేసి దానివిలువను నాశనంచేసారుమీరు.... వాళ్ళసైన్యాలను మామీదకు పంపమనీ, ఆ పంపినసైన్యా లను మేం ధ్వంసం చేసిపారేస్తామనీ, ఆ సైన్యాల ఆయుధాలనే మేం తీసుకొని మీ ఆయుధాలతో మిమ్మల్నే చంపుతామనీచెప్పు మీ సెనేట్‌తో.... ఈ ప్రపంచమంతా ఈ మాట్లాడగల పనిముట్టుచెప్పిన మాటలు వింటుంది. మేమోపిలుపుఇస్తాం. 'బానిస లంతా లేవండి ! లేచి మీగొలుసులు తెంపుకోండి !'.... మేమెక్కడికివెళ్తే అక్కడ బానిసలు మాతోచేరతారు.... మేం రోమ్‌గోడలు బద్దలుచేస్తాం. వాళ్ళకు ముట్ట వలసిన న్యాయాన్ని, మాకు వాళ్ళిచ్చిన న్యాయానికి ప్రతిఫలాన్ని వాళ్ళకుముట్ట చెప్తాం... అప్పుడు న్యాయం జరిగినపిమ్మట మేం ఇంతకన్న మంచినగరాలను నిర్మిస్తాం. అందమైన శుభ్రమైన పట్నాలను నిర్మిస్తాం. ఆపట్నాలచుట్టూ గోడ

లుండవు. ఎక్కడ మానవులు హాయిగా, శాంతియుతంగా జీవిస్తారో అక్కడ ప్రహరీ గోడలు అనవసరం. ఇదే మా సందేశం. ఇది వాళ్ళతో చెప్పు....". రెండువేల ఏళ్ళకింద స్పార్టకస్ ఊహించిన సమతా సుందర స్వర్గం ఇది. యుద్ధం మధ్యలో నిలబడి స్పార్టకస్ చేసిన ఊహాగానం ఇది, వీక్షించిన మరో జగత్తు ఇది. మృత్యు ముఖాన నిలిచి కామ్రేడ్ స్పార్టకస్ పాడిన జీవనగీతిక ఇది, నవజీవన గీతిక ఇది.

ఈపోరాట క్రమంలోని రెండు సంఘటనలు పరిశీలిస్తే స్పార్టకస్ అవగాహనలో అతని సహచరుల అవగాహనలో ఎంతనైశిత్యం, ఎంతస్పష్టత వచ్చాయో అర్థమవుతుంది. ఈ సంఘటనలు బానిసల ఎదుగుదలను చూపుతాయి. వర్గపోరాటక్రమంలో వాళ్ళదృష్టి ఎంతపరిణతి చెందిందో అర్థమవుతుంది.

పీడితులకు అధికారం హస్తగతమయినప్పుడు వాళ్ళుకూడా పీడకులవలెనే దాన్ని ఉపయోగిస్తారన్నది పాలకుల అంగీకారాన్ని పొందింది. స్పార్టకస్ గురించి కూడా చరిత్రకారులు అలాగేవర్ణించారు. స్పార్టకస్ తనకు దొరికిన ఖైదీలతో దిగంబరంగా మల్లయుద్ధం చేయించి చంపేవాడని రోమన్ చరిత్రకారులు రాశారు. నిజానికి బానిస సైన్యం ఖైదీలపట్ల రోమ్ ప్రవర్తించినంత క్రూరంగా ప్రవర్తించలేదు. అయితే ఒక్కసంఘటనలో మాత్రం ఇద్దరు సేనానాయకులను స్పార్టకస్ 'మేం ఎలాచచ్చామో మీరూ అలానే చావండి' అని మల్లయుద్ధం చేయించాడు. కాని స్పార్టకస్‌కి తనుచేసింది ఒప్పుకాదేమోనని అనుమానంగానే ఉంది. అందుకే మిత్రుడు డేవిడ్‌ను అడిగాడు " 'నేను చేసింది తప్పా, ఒప్పా?' ఆ ప్రశ్నలో హృదయారాటం ధ్వనించింది." ఈ విషయంలో స్పార్టకస్ కంటె స్పష్టత, సరైనఅవగాహనఉన్న డేవిడ్ ఖచ్చితంగా చెప్పాడు. "వాళ్ళకి ఒప్పైనది మనకుఒప్పుకాదు. నువ్వూనేనూ మల్లులం. నికృష్టమైన ఈ మల్లయుద్ధాలను, ఏఒకడి స్మృతిపథంలోనూ లేకుండా తుడిచిపారేస్తాంఅని మనం చెప్పి ఎంతకాలమయిందంటావు?"

ఇంకోసంఘటనలో చివరిపోరాటానికి సన్నద్ధమవుతూ ఉన్నప్పుడు బానిసలు స్పార్టకస్‌కోసం పంచకళ్యాణి గుర్రాన్నొకదాన్ని తెస్తారు. ఆగుర్రం తనకు బహూకరించినందుకు వాళ్ళకు హృదయపూర్వక అభినందనలుచెప్పి స్పార్టకస్ ఆ గుర్రాన్ని చంపేస్తాడు, చంపేసి "....మనం మానవజీవితంకోసం పోరాడుతాంగాని జంతువుల కోసంకాదు. రోమన్లు గుర్రాలను ప్రేమిస్తారు. మనుషులను ద్వేషిస్తారు....నేనొక పంచకళ్యాణి గుర్రమెక్కి పోరాడాలనికదూ మీ ఉద్దేశ్యం. గుర్రాలు రోమన్లకే ఉండనివ్వండి నేను నా సోదరుల సరసన నిలిచిపోరాడుతా. ఈనాటియుద్ధంలో మనంగెలిచామా

మనకు లెక్కలేనన్ని గుర్రాలువస్తాయి. అప్పుడు మనమాగుర్రాలను యుద్ధరథాలకు కట్టి యుద్ధభూమికి ఆహుతిచెయ్యవద్దు. వాటికి నాగళ్ళుకట్టి మరింతభూమిని సాగులోనికి తెద్దాం...."

కాని ఆ చివరిపోరాటం స్పార్టకస్‌కు ఓటమినేఇచ్చింది. గుర్రాలను యుద్ధానికి కాక మానవావసర వస్తూత్పత్తికి ఉపయోగపెట్టాలనేకల యుద్ధభూమికి ఆహుతిఅయి పోయింది. శత్రువును పూర్తిగా తెలుసుకొని, అర్థంచేసుకున్న క్రాసస్ స్పార్టకస్‌ను ఓడించగలిగాడు. రోమన్‌సైన్యం స్పార్టకస్‌ను చంపేసింది. "అతనిశరీరం కనబడ లేదు. ముక్కలకింద కోసిపారేసేరు. ముక్కముక్కలకింద నరికిపారేసేరు." యుద్ధంలోదొరికిన ఆరువేలమంది ఖైదీలను ఏపియన్ రాజమార్గంపొడవునా శిలువ వేశారు. "....ప్రత్యేకంగా ఈశిలువపద్ధతి ఒక బలవత్తరమైన తీవ్రోద్రేకం. ఆ శిలువమీద రోమన్ క్రౌర్యానికి బలియై, నెమ్మదిగా, ప్రాణంలోని ప్రతి అంగుళాన్నీ కోల్పోతూ ఆ బానిసలుభరించిన భరించలేకవచ్చిన దుస్సహబాధ రోమన్ దేశమంతటా ప్రతిపల్లెలో, ప్రతివాడలో, ప్రతిఇంటా, ప్రతిహృదయంలో అంతటావ్యాపించి సర్వాత్మకమైంది....."

ఈ బానిస విప్లవం ఇంతక్రూరంగా అణచివేయబడిన తర్వాత మిగిలిపోయిన బానిసస్త్రీలందరిలాగే స్పార్టకస్ భార్యవరీనియా కొడుకుస్పార్టకస్‌తోసహా క్రాసస్ దగ్గర నిర్బంధించబడింది. కొంతవరకు పరివర్తన చెందిన గ్రాఛాస్ సహాయంతో వరీనియాకు స్వేచ్ఛ దొరుకుతుంది. ఆమె చిన్నస్పార్టకస్‌తోపాటు ఒక మారుమూల గ్రామానికివెళ్ళి ఒక రైతుకు భార్యగా సాధారణమైన జీవితం గడుపుతూ ఆ గ్రామస్తు లందరికీ బానిసవిప్లవకథ చెప్తూఉండేది. ".... ఒక సామాన్యమానవుడు, అంతకన్న అధమం ఒక బానిస దౌర్జన్యానికి, బానిసత్వానికీ వ్యతిరేకంగా ఎంత వీరోచితంగా పోరాడాడో, బలసంపన్నమైన రోమ్‌నే విధంగా నాలుగేళ్ళపాటు మంచినీళ్ళు తాగకుండా గడగడలాడించిపారేశాడో, అతని పేరంటేనే హడలిచచ్చేస్థితి తీసుకురాగలిగేడో ఆమె కళ్ళకు కట్టినట్టుచెప్పేది.... అతనిలోని సహృదయత గురించి, శాంతసౌమ్య స్వభావం గురించి కూడా చెప్పేది...." ఈ కథలు తరాలు, తరాలు చెప్పబడి గాథలయ్యాయి. ఆగాథలే వాళ్ళచిహ్నాలయాయి. పీడితులు పీడకులపై సాగించేయుద్ధం కొనసాగుతూనే ఉండేది. గెల్చిన క్రాసస్ పేరు ఎవరికీ గుర్తులేదు. ఓడిన స్పార్టకస్ ప్రతినిత్యమూ గుర్తుచేసుకోబడుతున్నాడు. 'నియంత చనిపోతాడు, అతనిపాలన అంతమవుతుంది; వీరుడు మరణిస్తాడు, అతని పాలన ప్రారంభమవుతుంది' అని కిర్క్‌గార్డ్ అన్నాడు.

స్పార్టకస్ జీవితం ద్వారా మనం నేర్చుకోవలసిందేమిటంటే "జీవించడమే జీవితం తాలూకు పరమరహస్యం. ప్రతివాడూ ఏదో ఒక పక్షానచేరతాడు. నువు జీవితపక్షాన ఉన్నావా లేక మృత్యువు పక్షంలో చేరావా అన్నదే ప్రశ్న...."

ఈ రచనగురించి కొన్ని సంవత్సరాలపాటు కలలుగన్నానని ఫాస్ట్‌స్వయంగా చెప్పుతున్నాడు. 1951 లో రాయడం పూర్తిచేసి, నవల రాతప్రతిని ఏడుగురు ప్రచురణ కర్తలకిస్తే అందరూ తామది ప్రచురించలేమని తిప్పికొట్టారు. ఇక విధిలేక ఫాస్ట్ స్వయంగా తన నవల ప్రచురించుకున్నాడు. కొద్ది నెలల్లోనే అది ఎక్కువ అమ్ముడు పోయిన పుస్తకాల జాబితాలో చేరిపోయింది. ఈ నవలను శ్రీ ఆకెళ్ళ కృష్ణమూర్తి గారు అనువదించగా 1955 లో విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ వాళ్ళు ప్రచురించారు. ఆ ప్రచురణలో ఎనిమిది భాగాలకూ ముందు ఎనిమిది కవితా చరణాలు అచ్చువేసి పుస్తకొన్ని ఆసక్తికరంగా ముద్రించారు. అయితే ఆ ప్రచురణలో ఎందువల్లనోగాని మూడో భాగం, ఏడో అధ్యాయంలో కొన్ని ముఖ్యమైనవాక్యాలు, ఐదో భాగం చివర కొన్ని పేరాలూ ముద్రించబడలేదు. అనువాదం కూడా అన్నిచోట్లా సులభంగాలేదు. ఐనా ఇంగ్లీషులో వచ్చిన మూడు సంవత్సరాల్లోనే అనువదించి ప్రచురించడంలో ఈలోపాలు క్షమించవచ్చనుకుంటాము. ఐతే ఈమలి ప్రచురణలో తొలిప్రచురణలోని సుగుణాలుఉంచి, లోపాలు తొలగించడానికి బదులు ఎచ్‌బిటి చాలా అజాగ్రత్తగా ఈ ప్రచురణను చేపట్టినట్టు కనిపిస్తున్నది. అప్పుడు మిస్ అయిన భాగాలతోపాటు ఈ ప్రచురణలో కొత్తగా మొదటిభాగం తొమ్మిదో అధ్యాయం మిస్ అయింది. ప్రతి అధ్యాయానికి ముందూ ఉన్న కవితాచరణాలు తీసివేయబడ్డాయి. ఆకెళ్ళ కృష్ణమూర్తిగారి అనువాదం చాలా చోట్లమార్చబడింది. క్లిష్టంగా ఉన్నచోట సరళంగా మార్చడం మంచిదేగాని దానితోపాటు సరళంగా ఉన్నదాన్ని క్లిష్టంగా మార్చడం ఆశ్చర్యంగా ఉంది. (ఉదా: ఒకటోపేజీలో ఏదైనా పనిమీద అనేదాన్ని 'ఏదేనా కార్యవ్యవహారంమీద' అని మార్చారు). కొన్నిచోట్ల ముక్కస్యముక్కగానూ కొన్నిచోట్ల స్వేచ్ఛగానూ అనువదించడంవల్ల ఈ ఇబ్బంది వచ్చింది. కొన్నిచోట్ల ఇంగ్లీషు నుడికారాన్ని యధాతధంగా అనువదించారు. అచ్చుతప్పులుకూడా విరివిగానేఉన్నాయి.

ఏదేమైనా, కొన్నిచిన్నలోపాలు ఉన్నప్పటికీ ఇరవై ఆరేళ్ళుగా వ్యాపార ప్రచురణల 'చీకటికోణం అట్టడుగునపడి కన్పించని' స్పార్టకస్‌ను ఇన్నాళ్ళకైనా వెలుగులోకితెచ్చిన ఎచ్‌బిటివారు అభినందనీయులు. మరో మలిప్రచురణ ఏ లోపమూ లేకుండా వెలువడుతుందని ఆశిద్దాం.

చివరిగా ఫాస్ట్ తన నవల అంకితంచేస్తూరాసిన వాక్యాలతోనే ఈ సమీక్ష ముగిస్తాను.

"ఈ పుస్తకం నాకూతురు రాఛెల్‌కు, నాకొడుకు జొనాథన్‌కు. ఇది చాలాకాలం క్రితం జీవించిన సాహసులైన స్త్రీపురుషులకథ. వాళ్ళపేర్లు ఎన్నడూ మరిచిపోబడలేదు. ఈ కథానాయకులు స్వేచ్ఛను మానవగౌరవాన్ని ఆకాంక్షించారు, వాళ్ళుగొప్ప జీవితాన్ని, మంచిజీవితాన్ని గడిపారు. నా పిల్లలతోపాటు ఇది చదివినవాళ్ళందరూ మన సంక్షోభ భవిష్యత్తులో శక్తి పొందుతారనీ, పీడనకూ అన్యాయానికీ వ్యతిరేకంగా పోరాటం చేపడతారనీ నేనీకథరాశాను.

ఆ విధంగా మన జీవితకాలంలోనైనా స్పార్టకస్ కల నిజమవుతుంది."

— 'ఎవిన్'

స్పార్టకస్ - నవల - హోవర్డ్ ఫాస్ట్ అను : ఆకెళ్ళ కృష్ణమూర్తి, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ (1981), పేజీలు : 376 + viii. 1/8 డెమ్మీ. వెల : సాదా ప్రతి రు. 13-50, మేలుప్రతి రు 20-00, ప్రతులకు : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 3-6-694, హిమాయత్‌నగర్, హైదరాబాద్ 500 029.

Statement about ownership and other particulars about

SRJANA

FORM IV (See Rule 8)

1. Place of Publication ... ... Warangal
2. Periodicity of its publication... Monthly
3. Printer's Name ... ... P. Hemalatha
   Whether citizen of India? ... Yes
   Address ... ... 3-7-82/4, Kumarpally Hanamkonda 506 001
4. Publisher's Name ... ... P. Hemalatha
   whether citizen of India? ... Yes
   Address ... ... (same as above)
5. Editor's Name ... ... P. Hemalatha
   whether citizen of India? ... Yes
   Address ... ... (same as above)

I, P. Hemalatha hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date :
March 1, 1982

S/d– **P. Hemalatha**
Publisher.

పుస్తక సమీక్ష : This Tense Time

గందర' గోళం
గడియారం చరిత్ర

ఆధునిక తెలుగు కవిత్వం ప్రభావంలోనూ, ప్రమాణంలోనూ ఇరవయ్యో శతాబ్దంతోపాటు ఎదిగి ఆంధ్రేతర ప్రాంతాలలో కూడా ఆసక్తి కలగజేసింది. వాళ్ళకోసం అడపాతడపా అనువాదాలు జరుగుతునేవస్తున్నాయి. ఇటీవల కాలంలో విప్లవ కవిత్వం ఇంగ్లీషులోవే కాక ఇతర భారతీయ భాషలలోకికూడా అనువాదమయింది. (పాణిగ్రాహి చెరబండరాజు కవిత్వం సంకలనాలుగా బెంగాలీలో వచ్చింది). సాధారణంగా అనువాదానికి రెండు భాషలమీద, ముఖ్యంగా భాషాస్వరూపంమీద పట్టుఉండాలి. అంతకంటే ముఖ్యం ఏ చారిత్రిక సందర్భంలో కవిత్వం వచ్చిందో ఆ సందర్భాన్ని పరిచయం చేస్తూ కవిత్వాన్ని అనువదించాలి. అలా చేయకపోతే కవిత్వంలో అనుభూతిపోయి పలదాగారడీ మాత్రమే మిగుల్తుంది. అయితే అడపా తడపాచేసే అనువాదాలకు అలాంటి పరిచయం చెయ్యడం అసాధ్యం. అందుకే అనువాద సంకలనానికి మనం ఆహ్వానం పలుకవచ్చు.

This Tense Time అనే పేరుతో వచ్చిన ఈ అనువాద సంకలనానికి ఇంగ్లీషులో పాఠాలుచెప్పే తెలుగుకవి వేగుంట మోహనప్రసాద్‌గారు సంపాదకులు. ఇందులో 175 మంది కవులు రాసిన 240 కవితల్ని 42 మంది ఇంగ్లీషులోకి అనువదించారు. గురజాడ నుండి విప్లవకవుల దాకా (ముందున్న వేమనను లెక్కలోనుండి తీసివేద్దాం) గత ఎనభై సంవత్సరాల తెలుగు కవిత ఇందులో చోటుచేసుకొంది. దీన్ని ఇంచుమించుగా ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కవితాసంకలనం అనవచ్చు. తెలుగు కవిత్వం తగినంతగా ఇంగ్లీషులోకి అనువాదం కాలేదనే సకారణంతో వేగుంట ఈ పనికి పూనుకొన్నారు అంతేకాదు అదిల్‌జసూవాలా సంపాదకత్వం వహించిన New writing in India (Penguins 1974) పుస్తకంలో తెలుగు రచనలకు ప్రాతినిధ్యం దొరకలేదనే దుగ్ధతోకూడా ఆయన ఈ పని మొదలెట్టారు పైగా అందుకోసం తెలుగు భాష ఎంతగొప్పదో ఇద్దరు విదేశీయుల సర్టిఫికెట్ కూడా ఉటంకించారు. మన గొప్పతనాన్ని చెప్పుకొనడానికి విదేశీయుల సర్టిఫికేట్‌ను చూపెట్టుకోడం ఈ దేశంలో ఇంకామిగిలిపోయిన వలస మనస్తత్వ చిహ్నాలలో ఒకటి. ఈ మధ్యకాలంలో తెలుగుకవులు మరోసారి ఇందుకు పాకులాడటం మొదలెట్టారు. అమెరికాలోనూ, ఇంగ్లాండులోమాఉన్న వందలాది విశ్వవిద్యాలయాలలో బోల్డంతమంది అధ్యాపక అనా

మకులున్నారు. వాళ్ళకు ఏదోఒక మూడో ప్రపంచదేశపు భాషాసాహిత్యాలమీద వ్యాఖ్యానించగలగడం ప్రతిష్ఠకు ప్రతీక. అలాంటి వ్యాఖ్యానం ఒకటి ఈ పుస్తకంలో విడిగా అమ్ముకున్న 'ముందుమాట'లో ఉంది. ఆ పెద్దమనిషి ఆంచట జానకిరామ్ అనువదించిన శ్రీశ్రీ నవకవితలో Audenని Rimbaudని, Ezra Poundని. TAS. Eliot పెట్టాడు!

ఈ Tense Time ను గత, వర్తమాన, భవిష్యత్ కాలాలకింద సంపాదకులు విభజించారు. అయితే ఆయనదృష్టిలో కాలం అంటేఏమిటి?

And yet I really think that time is nothing
But a clock a simple arbitrary agreement to meet
Together somewhere at a quarter after six (Tom Disch)

ఇక్కడ కాలానికి చరిత్రతో నిమిత్తంలేదు. మన స్కూలుపుస్తకాలలో చరిత్ర అంటే కాలక్రమానుసార (Chronological) వివరణ అనుకుంటూ ఒక రాజు తర్వాత మరోరాజు కథ చెప్తూంటారు చూడండి, అలాంటిదే ఈభావన. కాని కాలం అంటే గడియారం నడకకాదు సాంఘికశక్తుల పరిణామక్రమం. తెలుగు సమాజం ఆరవయ్యోశతాబ్దంలో ఎన్నో వైరుధ్యాలను, పోరాటాలను, ఆర్థిక వికాసాన్ని, సాంస్కృతిక మార్పులనుచూసింది. మధ్యతరగతిపెరిగి సాహిత్యానికి పాఠకులను, రచయితలను ఇచ్చింది నిరంతరం మార్పుచెందుతూవస్తున్న ఈ సమాజమే తెలుగు కవిత్వానికి పూర్వరంగం. సమాజాన్నుంచి 'వెలివేయబడ్డవ్యక్తులు'గా తమనుతాము ఊహించుకొని తమకుమాత్రమే చెందుతుందనుకున్న ఆత్మఘోషను సమృద్ధిగా వినిపించిన తెలుగుకవులు లేకుండాపోలేదు. అయినా అద్భుతమయిన ఈ శతాబ్దిష్ట సమాజాన్ని తమకవిత్వంలో ప్రతిబింబించి సంఘపు అనుభవాన్ని 'వ్యక్తిగత' అనుభూతిగా చిత్రించి కదిలించిన కవులదే తెలుగులో పైచేయి. పైగా తెలుగుకవిత్వంలో వైవిధ్యం చాలాతక్కువ. అందుకే 'వైతాళికుల'నుండి 'జలపాతం'దాకా తెలుగులోవచ్చిన మంచి కవితా సంకలనాలన్నీ ఎంతోకొంత అసంతృప్తిని మిగల్చకుండా ఉండలేకపోయాయి. ఈ పూర్వరంగపరిచయంలేకుండా తెలుగుకవితను సంకలనంచేయడం కవిత్వంలో 'కవితాంశ'ను ఖూనీచేయడమే.

ఈ అనువాద సంకలనంలో అలాంటి చారిత్రిక పరిచయంచేసే ప్రయత్నమేమీ మీకు కన్పించదు. దానికి బదులు 'ఊపిరితిత్తుల నిండా సిగరెట్ పొగ, చేతిలోబాటిల్'ని ఉంచుకుని సంపాదక కవిగారు రాసిన వ్యక్తావ్యక్తాలాపన కన్పిస్తుంది. దాన్నే ఆయన

పరిచయం అనేపేరుతో పన్నెండుపేజీలు రాసుకున్నారు. సమగ్ర పరిచయం చేయ ప్రయత్నించకపోయినా వేగుంట అలవోకగా తెలుగు కవిత్వంమీద కొన్ని వ్యాఖ్యలు చేయకుండాపోలేదు, "Women poets... should have been a delicacy" అని భయంకరమయిన మగదురహంకారపు జంతుస్వభావం పక్కన పెడదాం. వామపక్ష కవిత్వం తరచుగా self - destructive, too negativistic and Confusing to laymen... అని ఆయన వర్ణించడం ఆశ్చర్యకరం. జననాట్యమండలి పాటల పుస్తకం 'గందరగోళపడే సామాన్యులు' 50 వేల కాపీలకుపైగా కొనుక్కున్నారని ఆయనకు తెలియదనే అనుకుందాం. ఈ 'ఆత్మ - వినాశకర విచ్ఛిన్నకర' కవిత్వం లేకుండా సంకలనం తీసుకురాగలిగితే కదా ఆమాట అనాల్సింది. కవితా ధోరణులపై ఉల్లర వ్యాఖ్యానాలు మినహాయించి ఈ పరిచయం నిండా విడిగాప్రముఖ తెలుగు కవులందరిపై అభిప్రాయాలుకూడా ఉన్నాయి. ప్రతి కవికి ఐదారు విశేషణాలు జోడించి దాన్నే ఆయన ఆ కవి కవిత్వంపై తన అభిప్రాయంగా ప్రకటించారు. ఆ విశేషణాలకు ఆయా కవుల కవిత్వానికి ఏమయినా సంబంధం ఉంటే అది కేవలం యాదృచ్ఛికం మాత్రమే. ఈ రకమయిన వ్యాఖ్యానం చేయడం చాలా సులువు. Dictinary of Adjectives అని ELBS వాళ్ళ నిఘంటువు ఒకటి సంపాదించండి. తెలుగు కవుల జాబితాను దగ్గర పెట్టుకోండి. ఆ నిఘంటువు లోంచి మీకుతోచిన 5, 6 విశేషణాలు తీసుకొని ఈ జాబితాలో మీకుతోచిన తెలుగు కవికి తగిలించండి. వీలయినంతమేరకు ఈ రెంటికీ మధ్య సంబంధం ఉండేలా చూడండి. ఈ రకమయిన విమర్శ ఇంత వరకు మన పత్రికలలో వచ్చే తెలుగు సినిమా సమీక్షలకు మాత్రమే పరిమితమయి ఉంది. దీన్ని సాహిత్యంలో ప్రవేశపెట్టిన ఘనత వేగుంట మోహనప్రసాద్‌కు చెందుతుంది. విశేషణాలకు, విశ్లేషణకు తేడా చూడలేనివాళ్ళు విమర్శకు పూనుకోవడం అనవసరం. తెలుగు విమర్శకులు extra - territorial, non - literary, imbalanced, partisan, prejudiced, conceited, confused and at times simply stupid అని వేగుంట వర్ణించారు. అందులో ఈ పరిచయం ఏ రకమయిన విమర్శకులకు ఉదాహరణో తెలుసుకోడానికి పాఠకులు ఎక్కువ శ్రమపడనవసరం లేదు.

ఈ పరిచయంలో మీకు కొట్టవచ్చినట్టుకన్పించేది సంపాదకుల ఇంగ్లీషు. ఇందులో not exactly my fish of dish,stuck up, negativistic లాంటి ఇంగ్లీషులో లేని వ్యక్తీకరణలనుచూసి చూడకుండా వదిలేయచ్చు. కాని పరిచయం నిండా విసిగించే పదగాంభీర్యం (Verfiage) పాఠకులు విస్మరించడం చేయడంకష్టం. భావాన్ని తెలియజేయడంకంటే తామెరిగినపదాల్ని ప్రదర్శించుకోవడమే ముఖ్యంగా

భావించే రచనాపద్ధతి తెలుగుదేశపు ఆంగ్లమేధావులకి బ్రిటిష్ విద్యావిధానంపెట్టిన చలవ. సాహిత్యంపై వేగుంట అభిప్రాయాలకంటే భాషాస్వరూపంపై, వాక్యనిర్మాణం పై పట్టులేకుండా ఆయనరాసిన ఇంగ్లీషే పాఠకుల్ని ఎక్కువబాధపెడ్తుంది.

ఈ సంకలనంలో ప్రముఖ తెలుగు కవులు, కవులు కాదల్చుకున్నవాళ్ళ ఇంగ్లీషు అనువాదంలోనే మొదటిసారి మీకుకన్పించే తెలుగుకవులు, సంపాదకుడి స్నేహితులు (బహుశా కొందరు వాళ్ళచుట్టాలుకూడా) అందరికవితలు ఉన్నాయి. ఈ సంకలనానికి ఏరకమయిన కొలబద్దలు, ప్రమాణాలు ఉన్నట్టుతోచదు. కవులందర్ని సంతోషపెట్టే ప్రయత్నంలో పాఠకుణ్ని బాధించడంతప్ప ఏ ఇతర ప్రయోజనాన్నీ ఇది నెరవేర్చలేదు. అన్నిమతాల్లోని 'మంచి'ని రంగరించి ఒకకొత్తమతాన్ని తయారు చేద్దామని అక్బర్ పాదుషాగారు ప్రయత్నించారుట. వారి ప్రయత్నమేమయిందో వేగుంటకెవరయినా చెప్తే బాగుండేది.

అనువాదాలలోకూడా ఇంచుమించు ఇదేకొలబద్ద. 235 కవితలలో సంపాద కులే స్వయంగా 56 కవితలు అనువదించారు ఈ రకమయిన అనువాద సంకలనంలో అనువాదాలగురించి ప్రత్యేకించి చెప్పుకోడానికేమీఉండదు. ఎవరోకొందరు మంచి అనువాదకులు, కొందరు చెడ్డఅనువాదకులు అని ఒకవిభజన చేయచ్చుగాని అది ఈ సంకలనంమీద తీర్పుకాలేదు.

తెలుగుకవిత్వం అనువదించేటపుడు కొన్ని ప్రత్యేకమయిన ఇబ్బందులున్నాయి. మొత్తంగా తెలుగుకవిత్వంలో పదచిత్రాలు (ఇమేజరీ) బలంకంటె శబ్దబలమే (శ్రీశ్రీ నుండి గద్దర్‌దాకా) ఎక్కువ. అనువదించేటప్పుడు ఈ స్వరసౌందర్యాన్ని కనీసం మూలంలో దానిపాత్రను పట్టుకోవడంకష్టం. అందుకు అరుదయిన ప్రతిభ కావాలి. ఈ అనువాదకులలో చాలామందికి ఆ ప్రతిభలేదు. ఆ రకమయిన ప్రతిభ కావాల్సిన అవసరాన్ని అసలు సంపాదకులు గుర్తించినట్టులేదు. అనువదించేటపుడు సౌలభ్యం కోసం (లేదా అవసరంవల్ల) కొన్నిపదాల్ని, నుడికారాన్ని అనువదించకుండా యథా తథంగానే ఉంచడం అనువాదకులనుసరించే మంచి సాంప్రదాయం. అయితే అలాంటి పదాల్ని Italics లో ముద్రించి చివరన ఆ పదాలకువివరణ (glossary) చేర్చలేక పోతే అవి అర్థరహితమవుతాయి. (వోలీవోలీలరంగ వోలీఅని ఇంగ్లీషులోరాసి దానికి ఏవివరణ ఇవ్వకపోతే తెలుగురాని విదేశీయపాఠకుడు ఏమనుకోవాలి చెప్పండి). అనువాదాలగురించి ఈపాటి చిన్నసూత్రమయినా సంకలనకర్తకు తెలిసినట్టులేదు.

ఇరవయ్యోశతాబ్దపు తెలుగుకవిత్వంలో మనసమాజం పడిన ప్రతి పురిటి నొప్పులకు ప్రతిస్పందనఉంది. అద్భుతమయిన చలనంఉంది, శ్రావ్యమయిన

జాతుల సమస్య :

నాగాజాతి సమస్య

ఉదయన్ మిశ్రా

రహస్యంగా ఉన్న నాగాలాండ్ సంయుక్త ప్రభుత్వపు రాజకీయ విభాగమైన నాగానేషనల్ కౌన్సిల్ చాలాకాలంగా నాగాలు ఒకప్రత్యేక స్వతంత్రజాతి అని వాదిస్తున్నది. ఒక శతాబ్దపు బ్రిటిష్ పాలనలో తప్ప మరెన్నడూ నాగాలు ఏ ఇతర ప్రజల పాలనకిందాలేరని, ప్రస్తుత ఇండియన్ యూనియన్‌లో నాగాభూభాగం ఎప్పుడూ భాగంకాదని ఎన్‌ఎన్‌సి వాదిస్తున్నది. భారతదేశం కంటె ప్రత్యేకమైన భావన నాగాలందరికీ ఉన్నందువల్లనే వాళ్ళు బహుశక్తివంతమైన ప్రతికూల పరిస్థితుల్లో కూడా దీర్ఘకాలికంగా పోరాడుతూఉన్నారు. ఎంతోకాలంగా నాగా ప్రజలకు ఉన్న ఈ చైతన్యానికి గల చారిత్రిక, సాంఘిక మూలాలను ఈ వ్యాసం పరీక్షిస్తుంది.

కొంతకాలం కిందివరకూ నాగాపోరాటాన్ని భారత 'జాతి'ని విచ్ఛిన్నం చేయడానికి విదేశీ మిషనరీలు నాగాల్లో ఉన్న తీవ్రమైన స్వేచ్ఛాభావాలను వాడుకొన్న ఫలితంగా వచ్చిన వేర్పాటువాద ఉద్యమంగానే చిత్రించడం జరిగింది. ఈ సందర్భంగానే నాగాల్లో పద్నాలుగు తెగలున్నాయని, వాళ్ళభాషలు వేరువేరని, వాళ్ళు ఒకరికొకరు శత్రుత్వం వహిస్తారని, కనుక నాగాజాతీయవాదానికి పునాదేమీలేదని కూడా ఒక వాదనవచ్చింది నాగాజీవన విధానం గురించి అజ్ఞానం నుంచి పుట్టిన ఈ వాదనలన్నీ నాగాపోరాటపు దీర్ఘకాలిక స్వభావంవల్ల కొట్టుకుపోయాయి. దీర్ఘకాలిక పోరాట క్రమంలో నాగాలు దృఢత్వాన్ని, జాతీయఐక్యతాభావనను పొందారని ఇవాళ వాళ్ళ బద్ధశత్రువులు కూడా అంగీకరిస్తారు. ఈ జాతీయ ఐక్యతా భావన భారతఉపఖండంలో చాలా కొద్దిజాతులకు మాత్రమే ఉంది

సంగీతంఉంది. పాబ్లోనెరుడా భాషలో తెలుగు . Poems have not eaten, They devour exciting happenings. కవిత్వాన్ని పీఠన్నిటినుండి వేరుచేసి, జీవంలేని ఈజిప్షియన్ మమ్మీలాతయారుచేసి సంకలనం చేయడం విచారించాల్సిన విషయం. తెలుగు కవిత్వంమీద, ఇంగ్లీషుభాషమీద అభిమానం ఉన్నవాళ్ళందరు ఈ సంకలనంచూసి బాధపడకతప్పదు — సురా

This Tense Time - An Anthology of Modern Telugu Poetry (1915-1980) (Ed.) V. Mohana Prasad, పేజీలు,238+xx ప్రతులకు New Directions, 3rd Line, Technical Nagar, Vijayawada. 520010 వెల. రు. 50/-

---

తమ తెగకో, వంశానికో విధేయుడుగా ఉండిన నాగా ఇవ్వాళ క్రమక్రమంగా సంయుక్త నాగాలాండ్ భావనకు విధేయుడవుతున్నాడు. బర్మాలోని చిండ్విన్‌నుంచి, అస్సాంలో బ్రహ్మపుత్ర వరకు గల నాగాలు నివసించే ప్రాంతాలన్నీ కలిసి సంయుక్త నాగాలాండ్ అవుతుంది.[1] నాగా జాతీయవాదం తెగలమధ్య, వంశాలమధ్య శత్రుత్వాన్ని తొలగించలేకపోయినప్పటికీ తగ్గించిందనడానికి 'విశాల నాగాలాండ్' డిమాండే మంచి ఉదాహరణ. తెగ, వంశం కట్టుబాట్లనుంచి నాగాజాతి జనులందరూ నివసించే సర్వసత్తాక నాగా రాజ్యభావనవరకు సాగిన అభివృద్ధికి నాగాలకు భూమితో, స్థానిక సాంప్రదాయాలతో ఉండే ప్రగాఢబంధం ఎంతో తోడ్పడింది. తమ భూమిపై విదేశీ ఆక్రమణ జరిగినప్పుడల్లా వివిధ తెగల నాగాలు తీవ్రవ్యతిరేకత కనబరచారు. నాగాల లిఖిత చరిత్రంతటా మనకీవిషయం కనబడుతుంది. పదమూడో శతాబ్దం మధ్యనించి అస్సాంను పాలించిన అహోమ్ రాజులు నాగా కొండలను వ్యూహాత్మక ప్రాముఖ్యం కలిగిన ప్రాంతాలుగా భావించారు. ఈశాన్య సరిహద్దు ప్రాంతంలో నాగాలు నివసించి పట్కాయి, తిరప్ డివిజన్లగుండానే అహోమ్‌లు అస్సాంలో ప్రవేశించారు. వాళ్ళు ఆ తర్వాతకూడా బర్మాలోని తమ బంధుమిత్రులతో సంబంధాలకై ఈ మార్గాన్నే ఉపయోగించారు. కనుక అహోమ్‌లు నాగాలతో తమ సరిహద్దును జాగ్రత్తగా కాపాడుకుంటూ నాగాలపై అధికారాన్ని నిలుపుకున్నారు. నాగాలతో అహోమ్‌లు ఒకవైపు శాంతి, మరొకవైపు బలప్రయోగం అనే విధానాన్ని అనుసరించారు. ఐతే అహోమ్ పాలకులు నాగాప్రాంతాలను తమ రాజ్యంలో కలుపుకోవడానికి ఎన్నడూ ప్రయత్నించలేదు. అస్సాం మైదానప్రాంతాలలోని గ్రామాలమీద దాడులు చేసినందుకుగాను శిక్షగా నాగాతెగలపై అహోమ్ పాలకులు ఎన్నోసార్లు దండయాత్రలు జరిపారు. ఐతే వాళ్ళు నాగాల ఆంతరంగిక పాలనావిధానంలో జోక్యం కలిగించుకోవడం భయంకరమైన పరిణామాలకు దారితీస్తుందని గుర్తించారు. పన్ను కట్టనవసరంలేని భూమి, చేపలు పట్టుకోవడానికి నీటివనరులు మొదలైన సౌకర్యాలు కలిగించి అహోమ్‌లు నాగాలను లొంగదీసుకున్నారు. మైదానప్రాంతాల కొసల నివసించే నాగాలు అహోమ్ ప్రాంతాలమీద దాడిచేయనంతకాలం, భారత - బర్మా సరిహద్దుల్లో నివసించే నాగాలు పట్కాయి పర్వతశ్రేణికావల అహోమ్‌ల శత్రువులతో కలిసి అహోమ్ రాజ్యవిచ్ఛిన్నాన్నికి కుట్రలు చేయనంతకాలం వాళ్ళలొంగుబాటును అంగీకరించి, వాళ్ళ గిరిజన స్వాతంత్ర్యాన్ని అనుభవించనివ్వడమే మంచిదని అహోమ్ పాలకులు భావించారు.

నాగా వ్యవహారాలలో ఈ జోక్యరహిత విధానంవల్ల నాగా కొండల సరిహద్దుల్లో నివసించే అస్సామీలకూ, నాగాలకూ మధ్య చనువూ, అవగాహనా ఏర్పడ్డాయి. వాళ్ళ మధ్య పెద్దఎత్తున వస్తుమారకం జరిగింది. పద్దెనిమిదో శతాబ్దం చివరా, పంతొమ్మిదో శతాబ్దం మొదట్లోనూ అహోమ్‌ల అధికారం క్షీణించడం ప్రారంభమయ్యాక నాగాతెగలు మరొక్కసారి విదేశీ ఆక్రమణనుంచి తమ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని స్థాపించుకున్నాయి. ఇదెంత పరిమితమైనదైనా కావచ్చు. అంతవరకూ అహోమ్ రాజులకు కానుకలు చెల్లిస్తున్న తెగలు ఆపని మానేశాయి. అహోమ్ - నాగా సంబంధాలను ఒక్కమాటలో చెప్పాలంటే అహోమ్ పాలకుల శక్తికి నాగాలు లొంగిపోగా, నాగా స్వేచ్ఛాపిపాసను గౌరవించి అహోమ్ పాలకులు వాళ్ళ వ్యవహారాలలో జోక్యంకలిగించుకోవడం మానుకున్నారు.

అస్సాంలో పాలనను ప్రారంభించిన మొదటి సంవత్సరాల్లో బ్రిటిష్ వాళ్ళు కూడా నాగా వ్యవహారాలపట్ల జోక్యరహిత విధానాన్నే అవలంబించారు. 1826 యండబూ ఒప్పందం, అస్సాం ఆక్రమణలవల్ల ఏర్పడిన అనుకూలపరిస్థితుల్లో బ్రిటిష్ వాళ్ళు సారవంతమైన లోయప్రాంతమంతటా తమ అధికారాన్ని త్వరగా సుస్థిరం చేసుకోగలిగారు. కాని వాళ్ళు కొండతెగలపట్ల, ముఖ్యంగా నాగాలపట్ల జోక్యం కలిగించుకోకుండా జాగ్రత్తగాఉండే విధానం చేపట్టారు. కొండప్రాంత ప్రజలను అవినీతిపరులైన మైదానవాసులనుంచి రక్షించడానికే ఈపనిచేశామని తరువాత బ్రిటిష్ వాళ్ళు చెప్పుకున్నారు. కాని అది నిజంకాదు. ఆనాటికి కొండప్రాంతాలను ఆక్రమించడం లాభకరంకాదని బ్రిటిష్ వాళ్ళు భావించారు. మొట్టమొదటి సారిగా నాగా ప్రాంతంలోకి బ్రిటిష్ వాళ్ళు 1832లో ప్రవేశించారు. మణిపూర్ నుంచి అస్సాం మైదానానికివెళ్తూ కెప్టెన్ జెంకిన్స్, తన సైన్యంతో అంగామీ ప్రాంతంగుండా తరలివెళ్ళాడు. అస్సాం మైదానప్రాంతంమీద అంగామీల దాడులను అరికట్టడానికై 1835 నుంచి 1851 వరకు బ్రిటిష్‌వాళ్ళు పదిసార్లు అంగామీ భూభాగంపై శిక్షాదండయాత్రలు నడిపారు. 1850లో జరిగిన పదోదండయాత్ర తర్వాత జోక్యరహిత విధానం స్పష్టంగా వెల్లడయింది. సైన్యాలు వెనక్కిరప్పించబడ్డాయి. ఈ విషయాన్ని గురించి డల్‌హౌసీ ఇట్లా రాశాడు. "అధికారాన్ని సాధించాలనే విధానాన్ని- అంటే ఈ కొండల నాక్రమించి అక్కడి ఆటవిక నివాసులపై సార్వభౌమాధికారాన్ని స్థాపించాలనే విధానాన్ని- నేను పూర్తిగా నిరసిస్తున్నాను. మన ఆక్రమణలు మనకేమీ లాభంలేవు సరిగదా, అవి ఎంత అనుత్పాదకాలో అంత ఖర్చయినవికూడా.... ఈ కొండలను శాశ్వత ఆక్రమణలో

ఉంచుకోవాలనే ఉద్దేశం ఎంత అవివేకమైందో, తాత్కాలిక ఆక్రమణకు అంగీకరించడం కూడా అంత అవివేకమైనదేనని నేను భావిస్తున్నాను "

1862లో కౌసిన్ బెడన్ లెఫ్టినెంట్ గవర్నర్ అయ్యేవరకూ ఈ విధానమే కొనసాగింది. ఆ తర్వాత బ్రిటిష్ వాళ్ళు నాగాలను తమ రాజకీయాధికారం కిందికి తెచ్చుకొని, తద్వారా మైదాన ప్రాంతాలపై వాళ్ళ దాడులను అరికట్టేందుకు మార్గాలు వెతకడం ప్రారంభించారు. "దాడిజరిగే తక్షణప్రమాదంఉన్న రెండు నాగా గ్రామాలను శిస్తు చెల్లింపుమీద లాంఛనంగా రక్షణలోకి తీసుకున్నాను. ఇతర శత్రుగ్రామాలను కూడా ఖాళీచేయవలసిందిగా ఆజ్ఞాపించాను" అని 1874లో కెప్టెన్ జాన్‌స్టన్ చీఫ్ కమిషనర్‌కు తెలియజేశాడు. ఇట్లా నాగా కొండలను బ్రిటిష్‌వాళ్ళు ఆక్రమించుకోవడం మొదలైంది. చీఫ్ కమిషనర్ కెప్టెన్ జాన్‌స్టన్‌తో ఏకీభవించాడుగాని ఉన్నతాధికారులు అందుకంగీకరించలేదు వాళ్ళీపనిని "ఖర్చుతో సంబంధం లేకుండా దేశాన్ని క్రమక్రమంగా మామూలుపాలనా వ్యవస్థగా మార్చేచర్య"గా భావించారు.

ఈ ఊగిసలాటలట్లా ఉండగానే, చివరికి 'ముందంజ విధానం' నిర్ణయించబడి 1878 నవంబర్ పద్నాలుగున కోహిమాను ఆక్రమించడంలో బయటపడింది. దీని తర్వాత బ్రిటిష్ వాళ్ళు నాగా కొండల్లో తమ అధికారాన్ని వేగవంతంగా స్థిరపరచుకోవడం మొదలుపెట్టారు 1881 లో నాగా కొండలజిల్లా ఏర్పరచబడింది [2] నాగా కొండల మొత్తం ప్రాంతంలో బ్రిటిష్ ఆక్రమణ కిందికొచ్చింది మధ్య నాగాలాండ్ ప్రాంతం మాత్రమే, బర్మా, టిబెట్ సరిహద్దుల్లోని విశాలప్రాంతం ఎవరి అధికారం కిందికీ రాకుండా వదిలివేయబడింది. చివరిసారిగా 1879-80 ల్లో నాగాలు, ముఖ్యంగా అంగామీలు బ్రిటిష్ ఆక్రమణను తీవ్రంగా ప్రతిఘటించి, పదకొండు రోజులపాటు కోహిమాను తమ ఆధీనంలో ఉంచుకున్నారు ఈ దాడికి నాయకత్వం వహించింది కొనొమా[3]తో సహా పదమూడు గ్రామరాజ్యాలు. తమ భూమినుంచి బ్రిటిష్ వాళ్ళను వెళ్ళగొట్టే ప్రయత్నంలో నాగాలు పొందిన వైఫల్యానికి ఐక్యత లేకపోవడం, వివిధ నాగా తెగలకు కలిసి ఒక ఉమ్మడి నిర్మాణయుత రాజకీయ ఆధిపత్యం లేకపోవడం కారణాలుగా చెప్పుకోవచ్చు. ఈ కాలానికి నాగాలు విడివిడిగాఉన్న సర్వసత్తాక గ్రామ రాజ్యాల్లో నివసిస్తుండేవారు. ఇవి స్వతంత్రంగానేకాక ఒకదానికొకటి వ్యతిరేకంగా కూడా ఉండేవి.

బ్రిటిష్ ఆక్రమణతో నగాలు ఒక పరాయిశక్తిని తమ పాలకులుగా అంగీకరించవలసివచ్చింది. అప్పటివరకూ వాళ్ళకు తెలిసినవి శిక్షాదండయాత్రలు మాత్రమే. ఈ దండయాత్రలను ప్రతిఘటించడానికై తమ స్వంతగెరిల్లా ఎత్తుగడలను వాళ్ళెప్పుడో రూపొందించుకున్నారు. కాగా బ్రిటిష్ గెలుపు నాగా సాంఘిక - రాజకీయవ్యవస్థలో పెనుమార్పులు తెచ్చింది. ఆ మార్పులు ఈ వ్యాసంలో చర్చించబడతాయి.

నాగా కొండల్లో అమలులో ఉన్న గిరిజన గ్రామీణ ప్రజాస్వామ్యంలో కలిపించుకోకుండా బ్రిటిష్ వాళ్ళు జాగ్రత్తపడ్డారు. నాగా వ్యవహారాలను పరిష్కరించడానికి గిరిజనమితుల సంపూర్ణాధికార హక్కును గుర్తించి మైదానప్రాంతాల నుంచి కొండ ప్రాంతాలను వేరుపరిచే చట్టాలు ప్రవేశపెట్టి బ్రిటిష్ వాళ్ళు నాగాలను మిగతా ఉపఖండం నుంచి వేరుచేయడంలో కృతకృత్యులయ్యారు. కనుకనే కాంగ్రెస్ నడిపిన బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో నాగాలేమాత్రం పాలుపంచుకోలేదన్నా, భారత జాతీయవాదం వాళ్ళ ఛాయలకు రాలేదన్నా ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు.[4] భారతదేశం నుంచి వెళ్ళిపోయేటప్పుడు బ్రిటిష్ పార్లమెంటు భారత స్వాతంత్ర్య చట్టంతోపాటు అదనపుప్రాంతాల పాలనాధికార చట్టాన్ని కూడా జారీచేసింది. ఈ చట్టంవల్ల కొత్త భారతప్రభుత్వం నాగాకొండల్లో తన పాలనను సాగించవలసివచ్చింది. తమ అంగీకారాన్ని కోరకుండానే తాము భారత యూనియన్‌లో భాగంగా మార్చబడ్డామని నాగాలు గుర్తించారు. మానసికంగా వాళ్ళు అలాంటిఐక్యతను ఏమాత్రమూ కోరుకోవడం లేదు.

ఈ అధికారమార్పిడినే ఎన్ ఎన్ సి ప్రశ్నిస్తున్నది. 1929లోనే సైమన్ కమిషన్‌కు సమర్పించిన విజ్ఞప్తిలో తమను కొత్తగా రాబోతున్న రాజ్యాంగమార్పుల పరిధిలోకి తీసుకోగూడదనీ, బ్రిటిష్‌ప్రభుత్వం నేరుగా తనపాలనలోనే ఉంచుకోవాలనీ నాగాక్లబ్ కోరింది.[5] "మమ్మల్ని గెలిచిన వాళ్ళు మీరుమాత్రమే. కనుక మీరు వెళ్ళిపోతే మళ్ళీ మేం గతంలో ఎట్లాఉన్నామో అట్లాగే ఉండేఅవకాశంఇవ్వాలి" అని ఆ విజ్ఞప్తిలో రాశారు. ఒకవేళ భారతీయుల పాలనకిందికే రావలసిన పరిస్థితివస్తే తమకవసరమయ్యే రక్షణలన్నిటినీ డిమాండ్‌చేసి, ఆవిజ్ఞప్తి ఇట్లాముగిసింది. "ఒకవేళ బ్రిటిష్‌ప్రభుత్వం మమ్మల్ని తోసివేయదలిస్తే ఏ ప్రజలైతే మమ్మల్నెన్నడూ ఓడించలేకపోయారో, మమ్మల్నెన్నడూ పాలించలేకపోయారో ఆ ప్రజల దయాధర్మాలకు వదిలేయవద్దనిమాత్రం మేం ప్రార్థిస్తున్నాం. గతంలోలాగానే మా విషయం మమ్మల్నే నిర్ణయించుకోనివ్వండి". వివిధ తెగలకుచెందిన ప్రతినిధులు ఇరవైకంటె ఎక్కువమంది ఈ విజ్ఞప్తిపై సంతకాలుచేశారు. నాగాక్లబ్ తీసుకున్న ఈ చర్య ఏఫలితాన్నీ ఇవ్వకపోయినప్పటికీ, ఇది నాగాప్రజల భవిష్యత్ స్థితిని గురించి వివిధతెగల ప్రముఖులు చేసిన మొట్టమొదటి ఉమ్మడిప్రయత్నంగా భావించవచ్చు. తర్వాత పదహారు సంవత్సరాలకు అప్పటి నాగాకొండల జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా ఉండిన సి ఆర్ పాసీ ప్రయత్నాలవల్ల నాగాకొండల జిల్లా గిరిజనసమితి ఏర్పాటయింది. ఈ సమితే 1946లో అన్ని గిరిజనసమితుల ప్రతినిధులతో కూడిన నాగా నేషనల్ కౌన్సిల్‌గా మారింది. నాగాప్రజల్లో అత్యధిక సంఖ్యాకులకు ప్రాతినిధ్యం వహించే ఎన్ ఎన్ సి నాగాకొండల్లో ఏకైక నిర్మాణయుత రాజకీయశక్తి.

ఎన్ ఎన్ సిలో వాటివాటి నిష్పత్తులప్రకారం 29 మంది వేరువేరుతెగల ప్రతినిధు లున్నారు అంటే నాగాప్రజలు తమ చరిత్రలో మొదటిసారిగా ఒకే రాజకీయనిర్మాణం కింద సమీకృతం కావడం ప్రారంభమైంది. నాగా జాతీయశక్తులను సమీకరించడంలో ఎన్ ఎన్ సి ఏర్పాటు ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. బ్రిటిష్‌వాళ్ళు వెళ్ళిపోయి, తమభవిష్యత్తుగురించి నాగాలు సందేహపడుతున్న సమయంలో ఎన్ ఎన్ సి ఆవిర్భవించవలసిన పరిస్థితి ఏర్పడిఉంది. దానినాయకుల్లో ఎక్కువమంది విద్యా వంతులైన నాగాలు.

ఎన్‌ఎన్‌సి చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమాల్లో స్వయం నిర్ణయాధికార హక్కునూ, ప్రాథమిక హక్కులనూ పొందడానికి సిద్ధపడవలసిందిగా నాగాలకు ఇచ్చిన పిలుపు ఒకటి. 1946 డిసెంబర్ ఒకటిన కోహిమాలో ఎన్‌ఎన్‌సి కార్యదర్శి ఇట్లా ప్రకటించాడు "ఎన్‌ఎన్‌సి అన్ని నాగాజాతుల ఏకీకరణకూ, వాళ్ళ స్వేచ్ఛ కొరకూ నిలబడుతుంది. మనదేశం ఎన్నోవిధాలుగా భారతదేశంతో కలపబడిఉంది. మనం ఈ సంబంధాన్ని కొనసాగించాలి. భారతదేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంవస్తుందా లీగ్ ప్రభుత్వం వస్తుందా అనే దానితో మనకు సంబంధం లేదు. ఒక ప్రత్యేక సంఘంగా మనం మన మేధకూ, అభిరుచులకూ తగినట్టుగా అభివృద్ధి సాధించాలి. మనం మన దేశంలో స్వపరిపాలననే అనుభవిస్తాం. ఐతే విస్తృతమైన అంశాల విష యంలో మాత్రం భారతదేశంతో సంబంధం పెట్టుకోవలసివస్తుంది. మనం అందు కోసం పోరాడాలి. అది సాధించాలి, పట్టుదలతో ఉండండి." భారతదేశంతో తమ భవిష్యత్ సంబంధాల గురించి నాగాప్రజల దృక్పథాన్ని ఎన్‌ఎన్‌సి కార్యదర్శి తన మాటల్లో వివరిస్తున్నాడు. కాని ఈ సంబంధం ఎట్లా ఉండబోతుందో అప్పటికింకా స్పష్టంకాలేదు పై ప్రకటననుబట్టి చూస్తే ఎన్‌ఎన్‌సి అప్పటికి పూర్తి స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేయలేదని, ప్రాంతీయ స్వతంత్ర ప్రతిపత్తిలోనే పరిష్కారం చూసిందని అర్థమవుతుంది.

ఉపఖండంలో వేగంగా జరిగిపోతున్న సంఘటనలను చూసింతర్వాత, తమ డిమాండ్లనుకూడా పెద్దఎత్తున వినిపించకపోతే తమ ఆకాంక్షలు అడుగునపడిపోతాయని నాగా నాయకత్వం గుర్తించింది. భారతజాతీయ కాంగ్రెస్ కూడా ఈ విషయాన్ని గుర్తించింది. "తూర్పు అస్సాంలోని నాగా భూభాగం రాజకీయంగాను, ఆర్థికంగానూ తనకుతానే నిలబడలేనంత చిన్నదని విషయం స్పష్టమే. అది భారతదేశం, చైనాల మధ్యఉంది. అక్కడ నివసించేవాళ్ళు ఎక్కువగా వెనుకబడినవాళ్ళు, సహాయం పొంద వలసినవాళ్ళు, భారతదేశం స్వతంత్రమయిన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం నాగాభూభా గాన్ని మొత్తంగాగానీ, అందులోని ఏ ప్రాంతాన్నిగానీ ఆక్రమించుకొని ఉండడం

సాధ్యంకాదు. వాళ్ళు భారత, చైనాల మధ్య వేరైపోతారు. కనుక అనివార్యంగా నాగా భూభాగం భారతదేశంలో విలీనమైపోవాలి. దగ్గరి సంబంధాలున్నాయి గనుక అస్సాంలో భాగంకావాలి" అని 1946 ఆగస్టులో ఎన్ఎన్సి నాయకుడు టి. సఖ్రికి నెహ్రూ రాశాడు. భారతదేశం అప్పటికింకా నాగాభూభాగం అనాది కాలంనుంచి తన నుంచి విడదీయరాని భాగంగా ఉన్నదనే వాదనను తయారుచేసుకోలేదు. నాగా ప్రాంతం స్వతంత్రంగా బతకడానికి వీల్లేనంత చిన్నది గనుక, వ్యూహాత్మక కారణాల దృష్ట్యా భారతయూనియన్‌లో చేరిపోవాలని నెహ్రూ స్పష్టంగా చెప్తున్నాడు.

ఐనప్పటికీ ఎన్ఎన్సి స్వతంత్ర నాగారాజ్యం అనే తన డిమాండ్‌కు కట్టుబడి ఉంది. అంగామీ జాపుఫిజో నాయకత్వంలో ఒక ప్రతినిధి బృందం మౌంట్‌బాటన్‌ను కలిసి భారత ప్రభుత్వం నాగాలకు పదిఏళ్ళపాటు రక్షణఇవ్వాలని, ఆ తర్వాత తమ రాజకీయ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే స్వేచ్ఛ వాళ్ళకివ్వాలని సూచించింది. దీని తర్వాత ఆదివాసి తెగల సలహాకమిటీకి పదిసంవత్సరాల మధ్యంతర ప్రభుత్వ పథకాన్ని సమర్పించడం జరిగింది.[6] ఈ కమిటీ 1947లో కోహిమా సందర్శించింది. పది సంవత్సరాల రక్షణ పథకం గురించి రాజ్యాంగ శాసనసభకు సూచించడానికి సలహా కమిటీ నిరాకరించిన తర్వాత, నాగాలకు తమ స్వంత రాజ్యాంగం ఉండగా ఇతర రాజ్యాంగాల పరిష్కారాన్ని అంగీకరించడమనే సమస్య రావేరాదని ఎన్ ఎన్ సి ప్రకటించింది. ఈ ప్రతిష్టంభనను తొలగించడానికై హైదరీ ఒప్పందం ద్వారా కొంత ప్రయత్నం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం అమల్లోఉన్న గిరిజన న్యాయసూత్రాల దగ్గరినుంచి భూమిపై, పన్నులపై యజమాన్యం దాకా నాగాల జీవనవిధానంలోని అన్ని రంగాలపై ఎన్ఎన్సికి గల హక్కుల్ని గుర్తించడం జరిగింది. ఐతే ఈ ఒప్పందంలోని ఎనిమిదో ప్రకరణం[7] మరో ప్రతిష్టంభనకు దారితీసింది. పదిసంవత్సరాల కాలం తర్వాత పూర్తి స్వాతంత్ర్యం పొందడానికి నాగాలకు ఉన్నహక్కు ఆప్రకరణంలో పొందపరచబడ్డదని ఎన్ఎన్సి వాదించగా భారత ప్రభుత్వం అప్రకరణానికి ఇంకో ర్థకమైన వివరణ ఇచ్చింది. విస్తృతచర్చకు తావివ్వకుండా త్వరగా ముందుకు తేబడ్డదనే కారణంమీద హైదరీ ఒప్పందాన్ని అంగీకరించడానికి నిరాకరిస్తూ ఫిజో నాయకత్వంలో కొందరు ఎన్ఎన్సి సభ్యులు 1947 జులైలో గాంధీని కలుసుకున్నారు. ఇండియన్ యూనియన్ వెలుపలనే ఉండాలనే నాగాల నిర్ణయాన్ని వాళ్ళు గాంధీకి తెలియపరిచారు. నాగాలు ఇండియన్ యూనియన్ బయటనే ఉండాలని కోరుకుంటే వాళ్ళకా స్వేచ్ఛ ఉన్నదని, ఎట్టిపరిస్థితుల్లోనూ వాళ్ళమీద బలప్రయోగం జరగదనీ గాంధీ ప్రతినిధి వర్గానికి హామీఇచ్చాడు.

(మిగతా వచ్చే సంచికలో)

ప్రతిష్ఠ దెబ్బతిన్నదని పరిహారం కోరిన రచయితా! పాఠకుల నష్టం సంగతి ఆలోచించావా?

యండమూరి వీరేంద్రనాథ్ తన క్షుద్రశక్తుల నుపయోగించి ఒక అమాయిక ప్రాణాన్ని బలితీసుకునికూడా చట్టానికి చిక్కకుండా తప్పించుకున్న సంగతి పత్రికలు చదువుతున్న వాళ్ళందరికీ తెలిసిందే. "ఎన్‌కౌంటర్ల" పేరుతో యెందరో అమాయకుల్ని కూడా కాల్చిచంపుతున్న పోలీసులకు యండమూరి మీద కేసుపెట్టడానికి యే ఆధారాలూ దొరకలేదన్న సంగతి కూడా తెలిసిందే. ఆత్మహత్యలా కనిపించే హత్యకు గురయిన ఆ అమ్మాయి తన పూర్తి జీవితాన్ని నష్టపడితే, అలా స్పష్టంగా కనిపించకుండా ఆ రచయిత వల్ల నష్టపడిన పాఠకులు అసంఖ్యాకం. అతని "తులసిదళం" ప్రచురించిన పత్రిక పెంచుకున్న "సర్క్యులేషన్"బట్టి పుస్తకం 'సేల్స్'ను బట్టి నష్టపోయిన పాఠకుల్ని అంచనా కట్టవలసివుంటుంది. ఆ పాఠకులకు తాము నష్టపోయినట్లు తెలీనంత మాత్రాన అది నష్టంకాకుండాపోదు. వాళ్ళ లాభాలు మాత్రమే చూసుకుంటూ పాఠకుల నష్టంసంగతి ఆలోచించని పెట్టుబడిదారులు అది రచయిత సాధించిన విజయంగా అభివర్ణిస్తారు. సమాజక్షేమంకోరేవాళ్ళు మాత్రం అటువాళ్ళ కుట్రను ఖండించడంతోపాటు ఇటు పాఠకులకు సక్రమమైన ఆలోచన కలిగించాలనే ప్రయత్నంచేస్తారు.

రంగనాయకమ్మ తనకున్న సామాజిక బాధ్యతను గుర్తించిన రచయిత్రి కనుక అలాంటి ప్రయత్నం చేసింది. "ఆంధ్రప్రభ" దినపత్రికలో ఎనిమిది ఆదివారాలు "తులసిదళం" మూఢనమ్మకాల కుట్రను తూర్పారపట్టింది. వీరేంద్రనాథ్ ఆమె విమర్శని ఎదుర్కొని జవాబివ్వకుండా (క్షుద్రశక్తులేతప్ప అసలు శక్తులు అతనికిలేవు గనుక) కిమ్మనకుండా వుండిపోయాడు. అయితే, "తులసిదళం" పరిచయకర్త ప్రముఖ "ప్రేమ" రచయిత కొమ్మూరి వేణుగోపాలరావు మాత్రం తన "వ్యక్తిగత ప్రతిష్ఠ"ను రంగనాయకమ్మ కించపరిచిందనే కారణంవల్ల నష్టపరిహారం కోరాడు "కోర్టు" వారిని! వీరేంద్రనాథ్ కాకపోతే వేణుగోపాలరావయినా రంగనాయకమ్మ "విమర్శ"కు జవాబివ్వలేదు. తన "వ్యక్తిగత ప్రతిష"ను పునరుద్ధరించుకోడానికి కోర్టును ఆశ్రయించాడు. రంగనాయకమ్మ కొమ్మూరి వేణుగోపాలరావు నేమంది? "మరో క్షుద్ర రచయిత" అంది. "డాక్టరై కూడా మూఢనమ్మకాలను సమర్థిస్తున్నాడంది" ఈ రచయితకు యిప్పుడు తన "వ్యక్తిగత ప్రతిష్ఠ" యింత బ్రహ్మాండంగా కనిపిస్తూంది కదా, అలాంటి మూఢనమ్మకాల నవలకు అంత పెద్ద పెద్ద సర్టిఫికెట్లు

యిస్తున్నపుడు ఆ "ప్రతిష్ట"యే కొంచెం రూపంలోనయినా ఎందుకు అడ్డుపడలేదు ? ఆధునిక సభ్య సమాజానికి చెందిన విద్యాధికురాలైన యువతి ఇద్దరు మగవాళ్ళను పెళ్ళి చేసుకుని, ఇంట్లోనూ, ఆస్పత్రిలోనూ సంసారం చేయడాన్ని ఆదోత్యాగమనీ అదో "ప్రేమకాంతి" అని సిగ్గులేకుండా రాస్తున్నపుడు ఆ ప్రతిష్ట ఏమయిందీ ? ఇవాళ "పరిహారం" కోరుతున్న ఈ రచయితా యితని సంపాదక స్నేహితుడూ, యితని ప్రచురణకర్తా, "ప్రేమచీకటి"లో మునిగిపోయి నష్టపోయిన పాఠకులకు పరిహారం చెల్లిస్తారా ? వాళ్ళకు కల్గిన అపార నష్టానికి పరిహారం సంగతి ఆలోచించకుండా పరిహారంకోరే నైతిక హక్కు వీళ్ళకు ఉందా ? వీరేంద్రనాధ్ క్షుద్రరచయిత అయినట్లే కొమ్మూరి వేణుగోపాలరావుకూడా క్షుద్రరచయితే. సమాజ అభివృద్ధికి ఆటంకాన్ని కల్పించే సాహిత్యచెత్తను ఉత్పత్తి చేసే వాళ్ళంతా క్షుద్రరచయితలే. క్షుద్ర రచయితను క్షుద్రరచయితఅనీ క్షుద్రసంపాదకుని క్షుద్రసంపాదకుడనీ అంటే తప్పుకాదు. అనకపోవడమే తప్పవుతుంది. కనుక, ఓ "ప్రేమచీకటి" రచయితా ! ఏ సామాజిక బాధ్యతతో రంగనాయకమ్మ నిన్ను క్షుద్ర రచయిత అందో ఆ సామాజిక బాధ్యతతోనే మేము నిన్ను క్షుద్రరచయిత అనే అంటున్నాం. రంగనాయకమ్మ అన్నది సరైనదేనని ప్రకటిస్తున్నాం. కోర్టు ఏ తీర్పు చెప్పినా నిన్ను గురించి పాఠకుల తీర్పు ఇదే ! ఇదేనని నీకు గుర్తుచేస్తున్నాం. నీ నవలల్లోని "ప్రేమ" వీరేంద్రనాధ్ "చేతబడి" లాంటిదే ! అక్షరాస్యులై పత్రికలు చదివేఅలవాటును పెంపొందించుకున్న అమాయక పాఠకులకు కలిగించిన పరోక్ష నష్టానికి నీవూ, నీ సంపాదక మిత్రుడూ, నీ ప్రచురణకర్తా ఏ విధంగా పరిహారం చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నాం. మీ నేరాలకు సంజాయిషీ యిచ్చుకునే కనీస నైతిక బాధ్యతలేని మీకు పరిహారం కోరగలిగే హక్కు వుందా ? అని నిలదీసి అడుగుతున్నాం.

కాన్షస్ రీడర్స్ సర్కిల్

త్వరలో వెలువడుతాయి

సృజన ప్రచురణగా

ఉప్పెన - రెండోభాగం

క్రాంతి ప్రచురణగా

జననాట్యమండలి పాటలు

ఏం చేయాలి ? - లెనిన్

వివరాలకు :

1. పీస్‌బుక్ సెంటర్, 4-5-421, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ - 500 001.

2. సృజన, మాసపత్రిక, హనుమకొండ - 506 001.

జీవనది

'సుమనశ్రీ'

నీవు రెండుచేతులూచాచి కవిత్వాన్ని
జీవితంలోకి ఆహ్వానించుకోవాలి
నీ రక్తనాళాల్లో జీర్ణించుకోవాలి
కవిత్వాన్ని రెండుకళ్ళతోనూ జుర్రుకోవాలి.
కవిత్వం అకస్మాత్తుగా నీ చెంతచేరి

నీ అరచేతిలో పిచ్చిగీతలుగీయదు
నిరంతరం తపస్సుచేస్తేతప్ప
నీ ప్రతిజీవకణంలోనూ దాన్ని ప్రతిష్ఠించుకుంటేతప్ప
నీలోస్పందిస్తున్న నవాలక్షనరాల్ని
అనుక్షణం మీటుకుంటూంటేతప్ప
నీలోపొంగే రక్తసముద్రం నిత్యం
కవిత్వం ఒడ్డుని ఒరుసుకుంటూంటేతప్ప
కవిత్వం నీలోబతకదు
నీ ఊపిరిలో కదలదు.

ఏరోజున కలాన్ని నువ్వు
నీ కంఠంలో ప్రతిష్ఠించుకున్నావో
నీ కళ్ళల్లోని అమ్మలపొదిలో చేర్చుకున్నావో
నీ సర్వాంగాంల్లో పాదరసంలా బంధించుకున్నావో
నీ ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో కలిపేసుకున్నావో
అనాడేనీవు జీవనదివయ్యావు
పాయలు పాయలుగా పారుతున్నావు
గుండెబీళ్ళు తడుపుతూ పంటపొలానివయ్యావు
కానీ పంటపొలాల్ని ఈ వ్యవస్థ బ్రతకనివ్వదు
వ్యవస్థ కొమ్ముకాస్తున్న మృగం నిన్నుబ్రతకనివ్వదు
ఆ మృగసంతతి నిన్నూ నీజనాన్నీ బతకనివ్వదు

నీపై అనుక్షణం బాణాల్ని సంధిస్తూనే వుంటుంది
నీ నీళ్ళకూజా నీనోటికిందకూడా
నీవుకట్టుకున్నపంచె లాగేయజూస్తుంది
నీ కంటినీ నోటినీ బంధించాలని చూస్తుంది
నీగొంతుపై మృగం వేళ్లాడేసినకత్తి వస్తూవుంటుంది
అప్పుడే నీలో గడ్డకట్టే చలిమంచు వీస్తూవుంటుంది
కళ్ళు దొంగదారుల్ని వెతుక్కోజూస్తాయి
ఉన్నట్టుండి నీకాళ్ళు చచ్చుబడిపోజూస్తాయి
నీవేళ్ళచివర నరాలు తన్నుకపోజూస్తాయి
కళ్ళు పుళ్ళవుతాయి
గుండె కొబ్బరిచిప్పై కూచుంటుంది
నీకలం గిలగిలా కొట్టుకుంటూంటుంది

నువ్వుమాత్రం నీసర్వశక్తుల్నీ కూడదీసుకుని
శత్రువుపై యుద్ధాన్ని ప్రకటిస్తావుతప్ప
నీఓటమిని అంగీకరించవుకదా
మృత్యువును మింగేయజూస్తావుతప్ప
నీవుగా మింగుడుపడవుకదా

నిన్ను ఏజ్వరాలు చుట్టుముట్టినా
కాళ్ళుపగిలినా నరాలుచిట్లినా
కడుపులో దావానలాలుపొంగినా
కత్తులు కళ్ళల్లో దూయబడినా
కవిత్వమే ప్రవహించాలి నీ నరాల్లోంచి
కవిత్వమే నినదించాలి నీ కంఠనాళాల్లోంచి
నిత్యజీవన సమరంలో
కవిత్వమే నీ గుండెగడియారంలో
కాలంతోకదిలే లోలకంలా ఆడుతూవుండాలి
నీహృదయంలో సముద్రంలా

నురగలు కక్కుతూనేవుండాలి
నువ్వు ఆలోచనల్ని సాగదీసుకుంటూ
జనసముద్రాల్ని దాటుతూవుంటావా
ఎర్రకాలువలా ప్రవహిస్తూవుంటావా
గింజల్ని ఏరుతూ భూమిని పొడిచేకోడిలా
కలం నీగుండెలో ముల్లులా కదుల్తూవుండాలి
నీగుండెలో పొంచికూచున్న
నల్లతాచులా బుసలుకొడుతూనేవుండాలి
నీ రక్తంలో కలిసి బుస బుస పొంగుతూనేవుండాలి

(అంకితం: చెరబండరాజుకి త్వరలో కోలుకోవాలని కోరుకుంటూ.)

పుస్తక స్వీకారం

1. సింహావలోకనం - భారత స్వాతంత్ర్య సాయుధపోరాట ప్రామాణికగాథ రెండవభాగం - మూలం : యశ్‌పాల్, అను : ఆలూరి భుజంగరావు, రాహుల్ సాహిత్యసదనం, గుడివాడ ప్రచురణ (జనవరి 1982) పేజీలు : 282 + 2, 1/8 క్రౌన్, వెల రు. 12.00, ప్రతులకు : ఆలూరి భుజంగరావు, హిందీ పండిట్, టౌన్ హైస్కూలు, గుడివాడ, కృష్ణాజిల్లా.

2 దివ్యదృష్టి - కవితాసంపుటి - రాధేయ - సాంస్కృతీ సమాఖ్య, కడపజిల్లా ప్రచురణ (నవంబర్ 1981), పేజీలు 140, 1/8 క్రౌన్, వెల రు. 6.00, ప్రతులకు : రాధేయ, అధ్యక్షుడు, సాంస్కృతీ సమాఖ్య, కడపజిల్లా శాఖ, ముద్దనూరు 516 380

3. కుటుంబరావు సాహిత్యం - మొదటి సంపుటం. సంపాదకుడు : కేతు విశ్వనాథ రెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ ప్రచురణ (జనవరి 1982) పేజీలు : 422 + xxxiv, 1/8 డెమ్మీ, వెల రు. 25.00, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ 520 004

4. ప్రభంజనం. కథల సంపుటి - జాతశ్రీ - ఖమ్మంజిల్లా అరసం ప్రచురణ (ఫిబ్రవరి 1982) పేజీలు : 116 + iv, 1/8 క్రౌన్, వెల : రు. 5.00, ప్రతులకు : సృజనాలయం, ఇల్లందు, ఖమ్మంజిల్లా 507 1[illegible]

5 పరిణామశాస్త్రం : ప్రథమపాఠాలు - ఆర్కె - జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య ప్రచురణ (డిసెంబర్ 1981) పేజీలు : 76, 1/8 డెమీ, వెల : రు 3 00, ప్రతులకు : 1. మేనేజర్, ప్రజాసాహితి, వెంకటరత్నం వీధి, సూర్యారావుపేట, విజయవాడ - 530 002, 2 మైత్రిబుక్‌హౌస్, లబ్బీపేట, విజయవాడ 520 010

6. ఎక్స్‌రే లోంచి - ఆధునిక కవితావేదిక ఫిబ్రవరి 1982, 16 పేజీలు, 0-25 పైసలు. ప్రతులకు : ఎక్స్-రే, కొల్లూరిహౌస్, అమలాపురం 533 202

7. కవితా దిక్సూచి - వర్తమాన కవితావేదిక. నిర్వహణ : సాహితీమిత్రులు సిరిసిల్ల, (ఫిబ్రవరి 1982) సాలుచందా రు 6-00, ప్రతులకు : దిక్సూచి, 1-2-63, సిరిసిల్ల 505 301

8 మరో కెరటం - ఆధునిక సాహిత్య బులెటిన్-2, ప్రచురణ : సాహితీమిత్రులు విజయనగరం, వెల లేదు- ప్రతులకు : ఏ రాంబాబు, c/o పాన్‌షాప్, న్యూపూర్ణా వద్ద, విజయనగరం 531 202

9. వెల్లువ - సాహితీవేదిక, నిర్వహణ : నూతన సాహితి, సిరిసిల్ల, మార్చి 1981, వెల లేదు ప్రతులకు: తోట మహాదేవ్, నూతనసాహితి, సిరిసిల్ల 505 301

10. హేట్స్ ఆఫ్ టు కాంతం-గరిమెళ్ళ వెంకటసీతారాం కథలు, (సెప్టెంబర్ 1981) పేజీలు 370 + 22 1/8 క్రౌన్, వెల : రు. 12-00, ప్రతులకు : శ్రీమతి గరిమెళ్ళ మహాలక్ష్మి, శివోదయం బిల్డింగ్స్, అశీలుమెట్ట, విశాఖపట్నం 533 016

ఆదిలాబాద్ గిరిజన సహాయ నిధి

C/o సృజన, హనుమకొండ 506 001

జనవరి సంచికలో ప్రకటించిన విరాళాలు :

ఒక బంగారు ఉంగరం, 4 వెండిమట్టెలు, 1500 రూపాయల మందులు

+ రు. 18297-78

డా॥ ఉపేందర్ రావు. అల్జీరియా 500-00

మొత్తం రూ. 18797-78

+ ఒక బంగారు ఉంగరం, 4 వెండిమట్టెలు, 1500 రూ॥ మందులు

ఆదిలాబాద్ గిరిజన సహాయ నిధి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, వరంగల్‌లో పి. వరవరరావు పేరఉంది, అకౌంట్ నంబర్ 2730

సృజన ఏజెంట్లకు గమనిక

సృజనకు గత కొద్దికాలంగా ఏజెంట్లు బకాయిలు సరిగా చెల్లించడం లేదు. విపరీతంగా బకాయిలు పేరుకు పోయాయి. అందువల్ల ఒక్క సంచిక డబ్బు రావలసి ఉన్నప్పటికీ బకాయి పడిన ఏజెంట్లకు సృజన ఏప్రిల్ సంచిక నుంచి పంపడం ఆపివేయదలచుకున్నాం. ఏప్రిల్ మొదటివారంలో మీకు బకాయిలు తెలుపుతూ ఉత్తరాలు వస్తాయి. వెంటనే చెల్లించి సృజనను కాపాడుతారని ఆశిస్తున్నాం.

పాఠకులకు విజ్ఞప్తి

పాఠకు లెంతగా ఆదుకుంటున్నా, విరాళాలు, చందాలు విరివిగానే వస్తున్నా ఏజెంట్లు వెంట వెంటనే డబ్బులు పంపించక పోవడం వల్ల సృ ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటూనే ఉన్నది. ఏజెంట్ల దగ్గర సృజన కొనే పాఠకులను సరాసరి చందా కట్టి సృజన ఆర్థిక నష్టాలను పూడ్చవలసిందిగా పాఠపలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002 for Venkataramana Mudranalayam, Warangal

Working Editor: Varavararao

SRJANA Telugu Monthly Mar. '82 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67.

హర్రోజూ నెలపొడుపే

కె. వి. రమణారెడ్డి

పొలిపాటల సందడితో వుడుకెక్కిన పల్లెజనం
బెదురుదీరి చేవెక్కిన పోటుబంటులౌతుంటే
పొద్దుపొడుపు వెలుగువరద లావాగా పొంగుతుంటె
గరికపోచ గరుకుబారి కత్తిగ కరకెక్కుతుంటె
గడిగోడలనుకుమ్మి బక్కెద్దు కూల్చుతుంటె
దొరల గుండెదడదడలకు కేంపు వంతపాడుతుంటె
లాఠీలకు జవాబుగా గుతపల కోలాటముంటె
రివాల్వర్ల హుంకరింపు కంపరమెత్తించకుంటె
ఎదురుకాల్పు కట్టుకతలు పిరికిమందు తాపకుంటె
జై జైమంటూ ముందుకు జనందండు కదులుతుంటె
ఆచరణకు సిద్ధాంతం నడకలు నేర్పిస్తుంటె
వ్యూహానికి తగిన యెత్తుగడలు ఫలితమిస్తుంటే
స్తూపందగ్గర శపథం మారుమోగిపోతుంటే
రక్తంలోపలి సారం శక్తిరూపమెత్తుతుంటె
మంచుకొండ విరిగి నీరు కెంపుమీరి దుముకుతుంటె
తాతామని పోరాటం పేలి విస్తరిస్తుంటే —

కటకటాల తలపంపులు ఖైదుకొట్ల ఛజ్జలోన
ఒంటరిపాటెంతసేపు ఎంతటిదీ నలత కలత
ఖైదీమది అమ్మలపొది ఒరబెట్టిన ఖడ్గలత
కోర్టూ జైలూ లెక్కేం లెక్కేం కక్ష శిక్ష
లోకం తనలోపటినిధి లోకులలో తానేనది
రేపటిదాకా ఎందుకు ? హర్రోజూ నెలపొడుపే !

SRJANA
Hanamkonda-506001

Single copy Rs. 2-00
Yearly Subscription Rs. 20-00